RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam




# వుదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal




సంపుటి: 12 | సంచిక: 255 | ఆదిలాబాద్ | మంగళవారం, మార్చి 04, 2025 | VOODAYAM Telugu Daily | వెల: రూ. 3.00 | పేజీలు: 12

# తెలంగాణ సర్కార్ భేష్

## జాతీయ రైతు సంఘాలు.

**హైదరాబాద్ :**

తెలంగాణ రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వం కొనసాగుతోందన్నారు జాతీయ రైతు సంఘాల నాయకులు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన జాతీయ రైతు సంఘాల నాయకుల బృందం.. రెండు రోజులుగా రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఈరోజు బిఆర్కే భవన్ లోని వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ను కలిసింది. రాష్ట్రంలో రైతులు, వ్యవసాయ కోసం అమలవుతున్న పథకాలపై ఆరా తీశారు. ప్రధానంగా దేశంలో ఎక్కడా లేనివిదంగా రాష్ట్రంలో ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ పథకం ద్వారా రైతులు రుణ విముక్తులయ్యారని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి.. జాతీయ రైతుసంఘం బృందానికి వివరించారు. అదేవిదంగా సన్నాలకు 500 రూపాయల బోనస్ ద్వారా రాష్ట్రంలో సన్నాల సాగు అమాంతం పెరిగిందని దాని ద్వారా రైతులు ఆర్థికంగా ఎదుగుతున్నట్లు తెలిపారు. ఇక రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లాంటి పథకాలు కూడా వివరించారు. జాతీయ రైతు సంఘం నేతలు సైతం రెండు రోజులుగా రాష్ట్రంలో పర్యటించిన విషయాలపై కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, భవానీ రెడ్డి, గడుగు గంగాధర్ తో చర్చించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వం అని జాతీయ రైతు సంఘాల నాయకులు కొనియాడారు. తెలంగాణకు వచ్చిన జాతీయ రైతు సంఘాల నాయకులను సన్మానించింది రైతు కమిషన్.



**విద్యా వ్యవస్థ ముఖచిత్రం మారాలి: మంత్రి శ్రీధర్ బాబు**

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడం ద్వారా పాఠశాల విద్య ముఖచిత్రాన్ని సమూలంగా మార్చాలని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. సోమవారం నాడు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. యోగితా రాణా ఇతర ఉన్నతాధికారులతో విద్యాసంస్కరణలపై సమీక్ష నిర్వహించారు. ఒకప్పుడు ప్రపంచానికి ప్రతిభావంతులను అందించిన ప్రభుత్వ స్కూళ్లు ఎందు వల్లనో ఇప్పుడా పరిస్థితిలో లేవని ఈ సందర్భంగా మంత్రి వ్యాఖ్యానించారు. ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడలేక పోతున్నామని దీనికి దారితీసిన కారణాలపై అధ్యయనం చేసి మార్పులకు శ్రీకారం చుట్టాలని శ్రీధర్ బాబు సూచించారు. " స్కూళ్లలో మౌలిక సదుపాయాలు మరింత మెరుగు పర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు కూడా అత్యుత్తమ చదువులను అందించాలని సిఎం రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఇందుకు అనువైన పరిస్థితులను విద్యాశాఖ కల్పించాలి. గుజరాత్ నుంచి ఏటా 30- 40 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు సింగపూర్ కు వెళ్లి ఉన్నత శిక్షణ పొంది వస్తున్నారు. ఆ తరహా ప్రయత్నం మనవద్ద కూడా జరగాలి. ఫిన్లాండ్, ఫ్రాన్స్, యుకెలలోని విద్యాప్రమాణాలపై అధ్యయనం చేసి మన వద్ద కూడా ఆ స్థాయి విద్యను ప్రవేశ పెట్టాలి. పాఠ్యాంశాలను మార్చాలి. సింగపూర్ ప్రభుత్వం మన దగ్గర ప్రపంచస్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేయడానికి అంగీకరించింది. త్వరలోనే సింగపూర్ బృందం పర్యటిస్తుంది. మన ఉపాధ్యాయులను కూడా ఇతర దేశాలకు పంపించి నైపుణ్యాలను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది". దానికి సంబంధించిన విధివిధానాలు సిద్ధం చేయాలని శ్రీధర్ బాబు ఉన్నతాధికారులను ఆదేశించారు. "వచ్చే 2-3 ఏళ్లలో మన విద్యావిధానంలో సమూల మార్పులు జరగాలి. విద్యపై ఎంతో ఖర్చు పెడుతున్నా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. ఢిల్లీలోని ప్రభుత్వ స్కూళ్ళను పరిశీలించి అందులో మెరుగైన విధానాలను అమలు చేసే విషయం పరిశీలించాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సును కర్రికులమ్ లో భాగం చేయాలి:"కింది తరగతుల నుంచే విద్యార్థులకు కృత్రిమ మేధపై అవగాహన కల్పించాలి. హైస్కూలు స్థాయిలో దానిని వినియోగించి తెలివితేటలను పెంచుకునేలా చూడాలి. భేషజాలకు పోకుండా కన్సల్టెంట్ల సేవలను తీసుకోవాలి. మన ఆలోచనల కంటే వారి సూచనలు వాస్తవికంగా ఉంటాయి. ఒకప్పుడు డిఇఓలు తరచూ స్కూళ్లను తనిఖీ చేసేవారు. ఎంఇఓలు కూడా ఇతర పనులు చేస్తున్నారు తప్ప విద్యాప్రమాణాలు పెంచే ప్రయత్నం జరగటం లేదు. స్కూళ్లలో వకృత్వ పోటీలు జరిగేవి. విద్యార్థులను పిక్నిక్ లకు తీసుకెళ్లేవారు. ఎక్సకర్షన్లు ఉండేవి. ప్రైవేటు స్కూళ్లలో ఇవన్నీ జరగుతున్నాయి. వచ్చే తరం పిల్లలకు మనం ప్రపంచస్థాయి విద్యను అందించగలిగితేనే వాళ్లు పోటీ ప్రపంచంలో మనగలగుతారు. ఈ విషయాన్ని గుర్తెరిగి సమూల మార్పులకు దారి వేయాలి అని శ్రీధర్ బాబు సూచించారు. సమీక్షా సమావేశంలో పాఠశాల విద్య డైరెక్టర్ ఇ. వెంకట నర్సింహారెడ్డి, అదనపు డైరెక్టర్ లింగయ్య, ఓపెన్ స్కూల్ డైరెక్టర్ శ్రీహరిలు పాల్గొన్నారు.

# కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధమైన వాటా కేటాయించాలి



- గోదావరిలో తెలంగాణ నికర జలాల వాటా తేల్చాలి
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, సమ్మక్క సాగర్ ప్రాజెక్టులకు క్లియరెన్స్‌లు ఇవ్వండి
- తెలంగాణ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందజేయండి
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

ఢిల్లీ: కృష్ణా నది జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధమైన వాటా కేటాయించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కృష్ణా నది పరివాహకంలో సుమారు 70 శాతం తెలంగాణలో ఉంటే కేవలం 30 శాతం మాత్రమే ఏపీలో ఉన్నందున కృష్ణా జలాల్లో 70 శాతం వాటా తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. గోదావరికి సంబంధించి తెలంగాణ వాటా నికర జలాలు తేల్చిన తర్వాతే ఏపీ ప్రాజెక్టులపై నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రి పాటిల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం సాయంత్రం భేటీ అయ్యారు. కృష్ణా, గోదావరి నది జలాలకు సంబంధించి తెలంగాణ ప్రయోజనాలు కాపాడాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలోనూ ఆయా వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలియజేశారు. కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా ఉన్నప్పటికీ కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) పక్షపాతంగా ఆంధ్రప్రదేశ్‌కు 66, తెలంగాణకు 34 శాతం నీటి కేటాయింపులు చేసిందని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఏళ్లుగా తాము నష్టపోతున్నామని, ఈ ఏడాది సైతం ఆంధ్రప్రదేశ్ తమకు కేటాయించిన మొత్తానికి మించి నీరు తరలించుకుపోయిందన్నారు. ఇక ముందు తమ వాటాకు మించి కృష్ణా నది నీటిని ఏపీ తరలించుకొని పోకుండా చూడాలన్నారు. కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించి వెంటనే టెలీ మెట్రీ యంత్రాలు ఏర్పాటు చేయాలని, అవసరమైతే అందుకయ్యే మొత్తాన్ని తామే భరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి తెలియజేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2022లోనే డీపీఆర్ సమర్పించినా అనుమతుల్లో ఆలస్యం చేస్తున్నారని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. అదే సమయంలో న్యాయస్థానాల పరిధిలోని అప్పర్ భద్రకు మాత్రం అనుమతులు ఇచ్చారన్నారు. సీతారామ ఎత్తిపోతల, సమ్మక్క సాగర్ బ్యారేజీలకు మాత్రం అనుమతులు ఇవ్వలేదన్నారు. ఈ మూడు ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), సాంకేతిక సలహా మండలి (టీఏసీ) నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి-బనకచర్ల అనుసంధాన పథకానికి రూపకల్పన చేసిందని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఈ పథకానికి సంబంధించి ఏపీ ప్రభుత్వం కేంద్ర జల సంఘం, గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్‌ఎంబీ), కేఆర్‌ఎంబీల నుంచి ఎటువంటి అనుమతి పొందలేదన్నారు. గోదావరిపై తాము చేపట్టిన సీతారామ ఎత్తిపోతల, సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటి వరకు అనుమతులు ఇవ్వలేదన్నారు. గోదావరి నదిలో తెలంగాణకు సంబంధించి నికర జలాల వాటాలు తేల్చాలని, గోదావరిపై తెలంగాణ చేపడుతున్న ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. అలా చేయకపోతే ఆయకట్టు స్థిరీకరణ పేరుతో తాము నష్టపోతామని, కృష్ణా డెల్టా ఆయకట్టును చూపి కృష్ణా జలాల్లో తెలంగాణకు నష్టం చేశారని ఆయన గుర్తు చేశారు. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉన్న అపెక్స్ కౌనిల్స్‌లోనూ ఏపీ గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ఎటువంటి చర్చ జరగలేదని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడుకునే విషయంలో తాము ఏమాత్రం రాజీపడబోమని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పాలమూరు- రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల, మోడి కుంట వాగు, చనాఖా కొరటా బ్యారేజీ (డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్), చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర) ఎత్తిపోతల పథకాలకు సత్వర సాగు నీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ).. పీఎంఆర్‌పీ 2024 కింద తగిన ఆర్థిక సహాయం అందజేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సాగు నీటి ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందజేసేందుకు మౌలిక వసతుల అభివృద్ధి కింద 50 సంవత్సరాలు పాటు వడ్డీలేని రుణాలు తెలంగాణకు ఇవ్వాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి అభ్యర్థించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు సంబంధించి తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపడతామని, ముంపునకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు ఇప్పించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, రాష్ట్ర నీటి పారుదల శాఖ ఈఎన్సీ (ఓ అండ్ ఎం) విజయ్ భాస్కర్ రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను మోసం చేస్తే కాంగ్రెస్ ను మట్టికరిపిస్తాం

- మహిళల ఆగ్రహాన్ని చవి చూడకముందే హామీలు అమలు చేయండి
- హామీలపై ప్రకటన చేయకపోతే సోనియా గాంధీకి లక్షలాది పోస్టు కార్డులు పంపిస్తాం
- మార్చి 8లోపు మహిళలకు ఇచ్చిన హామీలపై ప్రకటన చేయాల్సిందే
- మహిళా లోకంతో ఆటలాడుతున్న రేవంత్ రెడ్డి సర్కారు
- తప్పుడు హామీలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం
- పోస్టు కార్డు ఉద్యమాన్ని మొదలుపెట్టిన ఎమ్మెల్సీ కవిత
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 10 వేల పోస్టు కార్డులు పంపిన ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా లోకాన్ని మోసం చేయాలని ప్రయత్నం చేస్తే కాంగ్రెస్ పార్టీని మట్టికరిపిస్తామని హెచ్చరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 8వ తేదీలోగా మహిళలకు నెలకు రూ 2500 ఇవ్వడంతో పాటు అన్ని హామీలపై కార్యాచరణ ప్రకటించాల్సిందేనని డిమాండ్ చేశారు. వరంగల్ లో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి రాణి రుద్రమాదేవీ పేరు పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. మహిళలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి సోమవారం నాడు ఎమ్మెల్సీ కవిత పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 10 వేల పోస్టు కార్డులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ ...హామీల అమలుపై మార్చి 8 లోగా ప్రకటన చేయకపోతే 10 వేల మంది మహిళలం 10 వేల గ్రామాల్లోకి వెళ్తామని, అన్ని గ్రామాల్లో మహిళలకు కూడగట్టి లక్షలాది పోస్టు కార్డులను తయారు చేసి సోనియా గాంధీకి పంపిస్తామని తేల్చిచెప్పారు. "ఏ సోనియా గాంధీ పేరు చెప్పి కాంగ్రెస్ పార్టీ మహిళల ఓట్లు వేయించుకుందో.... అదే సోనియా గాంధీకి లక్షలాది పోస్టు కార్డులను పంపిస్తాం" అని స్పష్టం చేశారు. మహిళలకు విషయంలో సీఎం రేవంత్ రెడ్డి మానవీయంగా ఆలోచించడం లేదని, మహిళలతో రేవంత్ రెడ్డి సర్కారు ఆటలాడుతోందని, మహిళలను మభ్యపెట్టి మోసం చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

# ఎస్ఎల్‌బిసి ప్రమాద ఘటన.. హైకోర్టులో విచారణ

హైదరాబాద్ మార్చి 3 : ఎస్ఎల్‌బిసిలో ప్రమాదం జరిగి దాదాపు పది రోజులు అవుతున్న విషయం తెలిసిందే. తాజాగా సిఎం రేవంత్ రెడ్డి కూడా ఘటన స్థలికి వెళ్లి సహాయకచర్యలకు పరిశీలించారు.

మరోవైపు కొందరు ప్రతిపక్ష నేతలు ఈ ఘటనకు సంబంధించి ప్రభుత్వాన్ని విమర్శిస్తూనే ఉన్నారు. తాజాగా ఈ ప్రమాద ఘటన హైకోర్టుకు చేసింది. ఎస్ఎల్‌బిసి ఘటనపై హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. నేషనల్ యూనియన్ ఫర్ మైగ్రెంట్ వర్కర్స్ అనే సంస్థ టన్నెల్‌లో చిక్కుకున్న వాళ్లని సురక్షితంగా బయటకు తీసుకురావాలి అంటూ.. ఈ పిల్‌ను దాఖలు చేసింది.ప్రమాదం జరిగి ఇన్ని రోజులైనా కార్మికుల ఆచూకీ తెలియకపోవడాన్ని కోర్టు దృష్టికి తీసుకువెళ్లింది.

అయితే దీనిపై తెలంగాణ ప్రభుత్వ అడ్వకేట్ జనరల్(ఏజి) సుదర్శన్ రెడ్డి తమ వాదనలు వినిపించారు. ఆర్మీ, సింగరేణి రెస్క్యూ, ఎన్డీఆర్ఎఫ్ బలగాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయని ఆయన తెలిపారు. 24 గంటలూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. ప్రభుత్వం సహాయక చర్యలను పరిశీలిస్తుందని చెప్పి వివరాలను హైకోర్టు నమోదు చేసి.. పిల్‌పై విచారణను ముగించింది.

# సంపాదకీయం

## ఇదా అగ్రరాజ్య పెద్దరికం?

రష్యా భూతాన్ని చూపించి భయపెట్టి ఉక్రెయిన్ మెడలు వంచి అక్కడి ఖనిజసంపదను కొల్లగొట్టడానికి శాంతి చర్చల ముసుగులో అమెరికా చేసిన తొలి విడత భేటీ చివరకు బెడిసికొట్టింది. శాంతియుత దౌత్య చర్చలకు వేదికగా నిలిచే ఓవల్ కార్యాలయంలో శుక్రవారం చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు ఒక్కసారి ఉలికిపాటు కలిగించాయి. భేటీలో మొదట కొంతసేపు సామరస్యంగా సాగినా, భవిష్యత్తులో తమపై రష్యా ఏదైనా దురాక్రమణకు పాల్పడితే రక్షణ కల్పించాలని జెలెన్ స్కీ ఒత్తిడి చేయడం అమెరికా అధ్యక్ష, ఉపాధ్యక్షులకు నచ్చలేదు. వారి దృష్టిలో పుతిన్ నియంతకాదని, జెలెన్‌స్కీయే నియంత అన్న అభిప్రాయం నాటుకుంది. తరువాత శాంతి చర్చలకు సంబంధించి తాము చేసిన ప్రతిపాదనలను అంగీకరించాలని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ డిమాండ్ చేసిన తరువాతనే చర్చలు వేడెక్కడం ప్రారంభించాయి. భేటీ మొదట్లో ఉక్రెయిన్‌కు ఆయుధాల సరఫరా కొనసాగిస్తామని, అయితే ఆయుధాల సరఫరా కన్నా యుద్ధాన్ని ముగింప చేయడానికి, ఇతర అంశాలపై దృష్టి కేంద్రీకరించడానికే ప్రయత్నిస్తున్నామని ట్రంప్ వెల్లడించినా భేటీ బెడిసికొట్టిన తరువాత ఆ ఆలోచనలు మారుతున్నట్టు కనిపిస్తోంది. ఉక్రెయిన్ అస్తిత్వానికి భంగం కలిగించే అమెరికా ఆంక్షలకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఎక్కడా రాజీపడలేదు. ఓవెల్ ఆఫీసులో అమెరికా అధ్యక్షుడు, మరో దేశాధ్యక్షుడి మధ్య జరిగిన అతిపెద్ద వాగ్వాదం ఇదే కావడం విశేషం. ఈ చర్చల తీరు పరిశీలిస్తే ఉక్రెయిన్, రష్యాల మధ్య వైరాన్ని మాపడానికి మధ్యవర్తిత్వం వహించే అగ్రరాజ్యం ఏకపక్షంగా రష్యాకే వత్తాసు పలుకుతూ ఉక్రెయిన్‌ను బెదిరించడం, హెచ్చరించడం కనిపించింది. అయితే ట్రంప్ హెచ్చరికలకు ఏమాత్రం బెదరకుండా జెలెన్ స్కీ గట్టిగానే సమాధానం ఇచ్చారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఓ హంతకుడని, ఆయనతో రాజీపడే ప్రసక్తే లేదని జెలెన్ స్కీ నిర్భయంగా చెప్పారు.

అయితే జెలెన్ స్కీ వాదనకు అవకాశం సరిగ్గా ఇవ్వలేదు. ఆయనపై ఎదురు దాడి కనిపించింది. ఉక్రెయిన్‌కు అమెరికా చేసిన సాయానికి కూడా కృతజ్ఞతలు చెప్పడం లేదని జెలెన్ స్కీపై అమెరికా నేతలు ఆక్షేపించారు. వాస్తవాలను పరిశీలిస్తే 2022 నుంచి రష్యాతో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ అమెరికా తమకు సాయం చేస్తున్నందుకు కనీసం 33 సార్లయినా అమెరికాకు, ఇదివరకటి అధ్యక్షుడు జో బైడెన్‌కు కృతజ్ఞతలు తెలిపిన సంఘటనలు ఉన్నాయి. అవన్నీ పరిగణనలోకి తీసుకోకుండా ట్రంప్ ప్రభుత్వం ఏదో ఒకసాకు చూపించి జెలెన్ స్కీని అవమానించడమే అన్నట్టు ఈ భేటీ సాగింది. భేటీ నుంచి మధ్యలోనే జెలెన్ స్కీ బయటకు వెళ్లిపోయారు.

అర్థాంతరంగా భేటీ ముగిసాక జెలెన్ స్కీ ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్‌నకు క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ట్రంప్, పుతిన్ మధ్య సంబంధం పైనా జెలెన్ స్కీ స్పందిస్తూ ట్రంప్ తటస్థంగా ఉండాలని, తమ వైపే ఉండాలని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు. అమెరికా సాయం లేనిదే రష్యా సైన్యాలను ఢీకొనడం సాధ్యం కాదన్న అభిప్రాయంతో ఉన్నారు. కానీ ట్రంప్ మాత్రం జెలెన్ స్కీపై వ్యతిరేక భావంతోనే ఉన్నారు. శాంతి చర్చలకు జెలెన్ స్కీ తిరిగి వచ్చినప్పటికీ అందుకు తాను సిద్ధంగా లేనని, పైగా జెలెన్ స్కీ శాంతిని కోరుకోకుండా మరేదో ఆశిస్తున్నారని ట్రంప్ తెలిపారు. ఈ భేటీ అర్థాంతరంగా ముగిసిపోవడాన్ని రష్యా ఎద్దేవా చేసింది. అమెరికా పట్ల అమర్యాదగా ఉన్న ఉక్రెయిన్‌కు ఈ పరిణామం గట్టిదెబ్బ అని, జెలెన్ స్కీకి ఇలా జరగాల్సిందే అని దుయ్యబట్టింది. శుక్రవారం నాటి భేటీ తరువాత ఐరోపా దేశాల్లో ప్రకంపనలు కనిపించాయి. ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ తదితర ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌కు తమ అండదండలను పునరుద్ఘాటించాయి.

ఐరోపా దేశాలకు, అమెరికాకు మధ్య కొనసాగుతున్న అట్లాంటిక్ కూటమి విషయంలో అమెరికా రష్యా మైత్రి వల్ల వివాదాస్పద పరిస్థితి ఏర్పడవచ్చని, అందుకనే ఐరోపా దేశాలన్నీ ఉక్రెయిన్‌కు మద్దతు ఇచ్చే విషయంలో సమైక్యంగా, పటిష్టంగా ఉండాలని ఐరోపా యూనియన్ విదేశాంగ విధానం చీఫ్ కజా కల్లాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పుడు స్వేచ్ఛా ప్రపంచానికి కొత్త నాయకత్వం అవసరమని ఆమె పిలుపునిచ్చారు. ఐరోపా యూనియన్ దీన్ని ఒక సవాలుగా తీసుకోవాలని హెచ్చరించారు. ఉక్రెయిన్‌పై యుద్ధం విషయంలో భవితవ్యంపై చర్చించడానికి లండన్‌లో ఐరోపా దేశాల నాయకులు సమావేశం అవుతున్నారు. ఇదే విధంగా ప్రత్యేక ఐరోపా సదస్సు కూడా మార్చి 6న యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా నేతృత్వంలో ఏర్పాటవుతోంది. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీకి భరోసా ఇస్తూ యూరోపియన్ నేతలు సందేశాలు పంపిస్తున్నారు. 'మీరు ఒంటరివారు కాదు, మీ వెంట మేం ఉన్నాం' అని పోలెండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ వెల్లడించారు. జర్మనీ, ఇటలీ, స్వీడన్, న్యూజిల్యాండ్ ఈ విధంగా ఐరోపా దేశాలన్నీ తమ ఎక్స్ ద్వారా సందేశాలు పంపించడం విశేషం. దీనికి జెలెన్ స్కీ స్పందిస్తూ అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదిలా ఉండగా బైడెన్ ప్రభుత్వ కాలంలో ఉక్రెయిన్‌కు బిలియన్ల డాలర్ల కొద్దీ ఆర్థికసాయం అందించడానికి, అలాగే నౌకల ద్వారా ఆయుధాలను సరఫరా చేయడానికి తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు రద్దయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఉక్రెయిన్ రాజకీయ విశ్లేషకులు వొలొడిమీర్ ఫెసెంకో తన అభిప్రాయం వెల్లడించడం గమనార్హం.

# ప్రమాదాల నివారణపై అవగాహన అవసరం



జాతీయ భద్రతా దినోత్సవం ప్రతి సంవత్సరం మార్చి 4న నిర్వహించ బడుతుంది. హిందువులు, ముస్లిం లు, పార్సీలు, జైనులు, సిక్కులు, క్రైస్తవులు వివిధ మతాల ప్రజలకు చెందిన ప్రజలతో భిన్న సంస్కృతులు ఆచార వ్యవహారాలు, వివిధ రకాల వేడుకలు, ఉత్సవాలు జరుపుకునే పెద్ద లౌకిక దేశం మనది. చైనా తర్వాత రెండో అత్యధిక జనాభా కలిగిన దేశం. భిన్నత్వంలో ఏకత్వం సాధిస్తూ, దేశాన్ని ఒకటిగా నిలపడానికి అవాంఛిత సంఘటనల నుండి ప్రజలను రక్షించడానికి దేశ అన్ని రక్షణ దళాలు తమ కర్తవ్యంలో ఎల్లప్పుడూ ఉంటాయి. పోలీసులు, కమాండోలు, దేశంలో శాంతి భద్రతలను కాపాడు కోవడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న భద్రతా దళాల కృషిని అభినందించడానికి జాతీయ భద్రతా దినోత్సవాన్ని జరుపు కుంటారు. మార్చి 4వ తేదీని జాతీయ భద్రతా దినోత్సవం లేదా రాష్ట్రీయ సురక్ష దివాస్‌గా జరుపు కుంటారు. ప్రతి వ్యక్తికి దేశం పట్ల వారి వ్యక్తిగత బాధ్యతల గుర్తు చేయడం ఈ దిన లక్ష్యం. ముంబైలో కార్మికుల భద్రత గురించి చర్చ మొదలై, 1962లో జరిగిన రాష్ట్ర కార్మిక శాఖా మంత్రుల సమా వేశంలో ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన అంశాల మీద, ప్రమా దాల పట్ల అప్రమత్తత పెంచాలంటే చేయవలసిన ప్రచారంపైన, కార్మికు లలో భద్రతపట్ల అవగాహన పెంచ డం పైన నిర్వహణ కొరకు ప్రభుత్వ పరంగా ఒక సంస్థ అవసరమని ఒక నిర్ణయానికి వచ్చారు. ఆ తర్వాత 1965 డిసెంబర్ లో పారిశ్రామిక భద్రత గురించి తొలి సమావేశం ఢిల్లీలో నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, పలు సంస్థలు పాల్గొన్న ఆ సభలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో భద్రతా మండలి ప్రారంభించాలని నిర్ణయించారు. అలా 1966, మార్చి 4న జాతీయ భద్రతా మండలి ఏర్పడింది. సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం 1860 క్రింద సొసైటీగా నమోదు చేయ బడింది. తరువాత బాంబే పబ్లిక్ ట్రస్ట్ చట్టం 1950 ప్రకారం పబ్లిక్ ట్రస్ట్ గా నమోదు చేయబడింది. కార్మిక మంత్రిత్వ శాఖ కింద పనిచేసే ఆ మండలి ప్రారంభమయిన మార్చి 4నే "జాతీయ భద్రతా దినోత్సవం"గా జరపాలని నిర్ణయించారు.

నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ లాభా పేక్షలేని సంస్థ. ఇది ప్రమాదాలు, విపత్తుల నుండి ఉత్పన్నమయ్యే మానవ బాధలను, ఆర్థిక నష్టాలను నివారించడానికి, తగ్గించడానికి తగిన విధానాలు, పద్ధతులు, విధానాలను అవలంబించడానికి సమాజానికి తెలియ జేయడానికి, సమాజాన్ని ప్రభావితం చేయడానికి స్థాపించ బడింది. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఈ సంస్థ భద్రత, ఆరోగ్యం, పర్యావరణ అంశాలను దేశం లోని వివిధ ప్రాంతాలకు చేరవేయడం, పారిశ్రామిక రంగానికి చెందిన వారినందరినీ ఇందులో భాగస్వాములను చేయడం, భద్రత కల్పించ డంలో ప్రతి ఒక్కరూ తమవంతు పాత్రను గుర్తెరిగి అనుసరింప చేయడం లక్ష్యంగా కృషిచేస్తున్నది.

సాంప్రదాయకంగా జాతీయ భద్రతా మండలి పరిధిలో నేడు ఉగ్రవాదం నుండి భద్రత, ఆర్థిక భద్రత, శక్తి భద్రత, పర్యావరణ భద్రత, నేరాలను తగ్గించడం, ఆహార భద్రత, సైబర్ – భద్రత మొదలైన ఇతర సైనిక రహిత ప్రమాణాలు ఉన్నా యి. జాతీయ భద్రతా ప్రమాదాల పరిధిలోకి ఇతర దేశ – రాష్ట్రాలు మాత్రమే కాకుండా హింసాత్మక కార్యక్రమాలు, మాదక ద్రవ్యాల కేసులు, బహుళ జాతి సంస్థల చర్యలు కూడా ఉన్నాయి. ప్రకృతి వైపరీత్యాల ప్రభావాలు కూడా జాతీయ భద్రతలోకి వస్తాయి. ప్రతి పనిలోను ఏదో ఒక ప్రమాదం జరిగే అవకాశం ఉంటుంది. అధిక ప్రమాదాలు అజాగ్రత్తవల్ల సంభవిస్తున్నవే. రహదారి ప్రమాదాలైనా, పారిశ్రామిక ప్రమాదాలైనా మానవ నిర్లక్ష్యం వల్ల జరగడం దురదృష్ట కరం. క్రమక్రమంగా ప్రమాదాల సంఖ్య పెరుగు తున్నందున పారి శ్రామిక , రహదారి భద్రతల మీద ప్రత్యేక దృష్టి పెట్టి, ముందస్తు తగు జాగ్రత్తలు పాటించడం వల్ల కొంతై నా ప్రమాదాలను తగ్గించ వచ్చు. అనుకోకుండా జరిగే ప్రమాదాల నుంచి ఎలా బయట పడాలో అవగాహన ఉండడంవల్ల మరణాల సంఖ్యను తగ్గించే అవకాశం ఉంది. అందుకే ఈ సందర్భంగా సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, సెమినార్లు, ఉద్యోగులు, కార్మికులకు ప్రమాదాలు ఎలా జరిగే అవకాశాలు, అవి జరిగినప్పుడు ఎలా స్పందించాలనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యోగులు, సామాన్య ప్రజలు తమ జీవన విధానంలో, వృత్తుల్లో భద్రత, ఆరోగ్య రక్షణను ఒక అంతర్గత భాగంగా మలుచుకునేలా చేయడం వల్ల ప్రమాదాలను ఎలా నివారించ వచ్చునో పలు కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

# అనితర సాధ్యం...బులుసు త్యాగం




దేశ స్వాతంత్ర్య పోరాటంలో సర్వం త్యాగం చేసిన ఒక చిత్తశుద్ధి, అంకిత భావం, నిజాయితీ గల వ్యక్తి తీవ్ర నిరాదరణకు గురైన విషయం చాలా మందికి తెలియనిది. ఒక రాష్ట్రం ఏర్పాటు కోసం కృషి చేసిన నేతను రాష్ట్రం ఏర్పడిన సందర్భం లో ఆయన అహ్వానింప బడని బాధాకరమైన నేపథ్యం ఉంది. రాష్ట్ర శాసన సభాపతిగా పని చేసిన ఓ నేత స్వాతంత్ర్య సమర యోధుల పెన్షన్ పొందలేని దుస్థితికి, తిండిలేక భిక్షాటనం చేసిన హృదయ విదారక సన్నివేశాలకు ఆంధ్ర రాష్ట్ర చరిత్ర మౌన సాక్షీభూతంగా నిలిచి ఉంది. కాంగ్రెస్ పార్టీ, స్వాతంత్ర్యానికి ముందు, అధిక శాతం దేశభక్తుల, త్యాగ ధనుల పార్టీగా వుండేది. అలాంటి నిస్వార్థ త్యాగాల భాగ స్వామ్య ఫలితంగానే స్వాతంత్ర్య సాధన సాధ్యమైంది. చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్ముకునే నేటి నాయకుల లాగా కాకుండా, స్వాతంత్ర్య సాధనకు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని, ఎన్నో రకాలుగా లక్ష్య సాధనలో సకలం ఫణంగా పెట్టి పోరాడిన వారెందరో. లక్ష్య సాధన జరిగాక, నిర్లక్ష్యానికి గురైన వారింకెందరో. అలాంటి వారిలో అగ్రగణ్యుడు... బులుసు సాంబమూర్తి. సుఖమయ జీవితా న్ని గడపడానికి అన్ని అవకా శాలు అంది పుచ్చుకుని కూడా, దేశ స్వాతంత్ర్యం కోసం సర్వం త్యాగం చేసిన త్యాగధనుడు, అసలు సిసలైన దేశభక్తుడు బులుసు సాంబమూర్తి. స్వాతంత్ర్యోద్యమంలో ఆయన పాత్ర మరచి పోలేనిది. మహాత్మా గాంధీ కన్నా ముందుగానే కొల్లాయి కట్టి సామాన్య ప్రజలతో మమేక మైన నిస్వార్థ సేవా పరాయణుడు బులుసు సాంబమూర్తి అని, ఈతరం వారికి తెలియక పోవచ్చు. ఆయన తూర్పు గోదావరి జిల్లా, దుళ్ల గ్రామంలో 1886, మార్చి 4 న జన్మించారు. ఆయన తండ్రి సుబ్బావధానులు వేదపండితులు. కుటుంబమంతా దానధర్మాలు చేస్తూ ధార్మిక జీవనం సాగించే వారు. మద్రాసు విశ్వ విద్యాలయం నుండి బి.ఏ. పరీక్షల్లో ఉత్తీర్ణులై, విజయనగరం మహారాజా కళా శాలలో కొంతకాలం భౌతిక శాస్త్రం బోధించారు. స్వేచ్ఛా స్వభావి అయిన సాంబమూర్తికి ఈ ఉద్యోగం అంతగా నచ్చలేదు. ఉద్యోగానికి రాజీనామా చేసి న్యాయవాద వృత్తి చేపట్టాలని నిర్ణయించు కున్నారు. బి.ఎల్. పరీక్షల్లో ఉత్తీర్ణులై 1911లో కాకినాడలో న్యాయవాద వృత్తిని స్వీకరించి, మహాత్ముని పిలుపు నందుకొని న్యాయవాద వృత్తిని వదలి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. 1919లో హోంరూల్ ఉద్యమంలోను, 1930లో ఉప్పు సత్యాగ్రహంలోను, 1932లో శాసనోల్లంఘన ఉద్యమంలో, 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో, పలు సత్యాగ్రహాలలో పాల్గొని కారాగార శిక్షలు అనుభవించారు. 1927లో నాగపూరు పతాక సత్యాగ్రహ దళానికి నాయకులు గాను, 1928 లో హిందూస్థానీ సేవా దళానికి అధ్యక్షులుగా పని చేశారు. తరువాత తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెసు కమిటీకి అధ్యక్షులుగా, 1929లో అఖిల భారత కాంగ్రెసు కమిటీలో సభ్యులుగా వ్యవహ రించారు. 1930 ఉప్పు సత్యాగ్రహ సమయంలో తన సహచరులతో చొల్లంగి సముద్ర తీరానికి వెళ్ళి ఉప్పును తయారు చేశారు. సాంబ మూర్తిని అరెస్టుచేసి వెల్లూరు జైలు కు తరలించారు. 1935–37 మధ్య కాలంలో ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు కమిటీ కార్యదర్శిగా వ్యవహ రించారు. 1935లో మద్రాసు ప్రోవిన్షియల్ ఎస్సెంబ్లీకి జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి నప్పుడు, చక్రవర్తి రాజగోపాలాచారి ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. సాంబమూర్తి 1937 నుంచి 1942 వరకూ స్పీకరుగా ఉన్నారు. 1937లో కాంగ్రెసు మంత్రివర్గ పరిపాలనలో మద్రాసు రాష్ట్ర శాసనసభకు సభాపతిగా విధులను సంప్రదా యాలకు అనుగుణంగా, మర్యా దగా, అద్వితీయంగా నిర్వహించి సభకు గౌరవ ప్రతిష్ఠలను సమకూర్చారు. 1923 లో అఖిల భారత కాంగ్రెస్ మహాసభ కాకినాడలో మూడు రోజులపాటు నిర్వహించిన సభకు దేశంలోని ప్రముఖ కాంగ్రెస్ నాయకులు రాగా, ఆహ్వాన సంఘ అధ్యక్షులుగా దేశభక్త కొండ వెంకట ప్పయ్య, కార్యదర్శిగా ఉండగా, ఆ సమయంలోనే సాంబమూర్తి ఏకైక కుమారుడు మరణించాడు. అయినా ఏ విధమైన అసౌకర్యం కలగకుండా అద్భుతమైన బులుసు బాధ్యతగా ఏర్పాట్లు చేసారు. జరిగిన విషాదం తెల్సుకున్న గాంధీజీ ఆ సభ సెషన్‌ను ఆపేశారట. భారత కోకిల సరోజినీ నాయుడు సాంబమూర్తి స్థిత ప్రజ్ఞతకు చలించి అప్పటి కప్పుడు ఆ సభలో ఆశువుగా గీతాన్ని ఆలపించారట. ఉప్పు సత్యాగ్రహ సమయంలో ఉప్పు మీద పన్ను ఎత్తివేసే వరకు ఆహారంలో ఉప్పు వేసుకోనని ప్రతిజ్ఞ చేయడాన్ని బట్టి అయన వ్యక్తిత్వం అర్థం అవుతుంది. 1937లో మద్రాసు రాష్ట్ర శాసనసభకు స్పీకర్‌గా ఎన్నికై, పని చేసి, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనేందుకు ఆ పదవి వదులు కున్న దేశభక్తులు బులుసు. చెన్నపట్నంలో ఆంధ్ర మహాసల ఏర్పాటులో చురుకైన పాత్ర పోషిం చటమే కాక తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలన్న ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారు. తెలుగు రాష్ట్ర ఏర్పాటును రాజాజీ, నెహ్రూ వ్యతిరేకించారు. పొట్టి శ్రీరాములు నిరాహార దీక్షకు సిద్ధమైతే, ఆయన ను తన ఇంటినే వేదికగా చేసుకో మన్న నాయకుడు సాంబ మూర్తి, అమరజీవి ప్రాణత్యాగం చేసిన ఆ ఇంటిని స్మారక భవనంగా వదిలి కాకినాడకు చేరిన త్యాగమూర్తి బులుసు సాంబమూర్తి. 1953లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక, కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్ర అవతరణకు నెహ్రూ విచ్చేసినా, కాంగ్రెస్ నాయకులు నెహ్రూకు భయపడి బులుసు సాంబమూర్తికి కనీసం ఆహ్వానం కూడా పంపని నాటి కాంగీయుల వ్యవహార శైలి బులుసుకు చేసిన అవమానికి, నిర్లక్ష్యానికి, నిరాదరణకు పరాకాష్ట . దేశస్వాతంత్ర్యం కోసం ఆదాయం ఇచ్చే న్యాయవాద వృత్తిని ఆయన వదులు కున్నారు. ఆంధ్రరాష్ట్రం కోసం మద్రాసులో తన ఇల్లు వదులు కున్నారు. స్వాతంత్ర్యం వచ్చింది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. కానీ బులుసు లాంటి త్యాగమూర్తి ఒంటరివారయ్యారు. భార్య గతించింది. ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఇక మద్రాసులో నివాసం అనవసరంగా భావించి, సొంత ఊరు కాకినాడ చేరితే జీవితం బాగుపడుతుందని అనుకున్నారు. ఆయన నమ్ముకున్న కాకినాడలో పరిస్థితులు మరింతగా మారి పోయాయి. ఒకప్పుడు మహర్షి అని గుర్తింప బడి, ఆయన దర్శనం కోసం వెళుతున్నామని నలుగురిలో చెప్పుకుని బులుసు గారింటికి వెళ్ళటం గొప్పగా భావించిన కాంగ్రెస్ వాదులు, మహర్షి ఎదురుగా కనిపించినా పట్టించు కోని దుస్థితి. ఒకప్పుడు ఆయన్ని ఆరాధించిన వారే ముఖం చాటేశారు. ఆయన ఉన్నత స్థితిలో ఉన్నప్పుడు అన్నిరకాలుగా సహాయం పొందిన వారు, సాంబమూర్తి ఎదురు పడితే డబ్బులు అడుగుతాడని తప్పుకుని తిరిగారు. ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక, సాంబమూర్తికి వయసు మీద పడింది. పేదరికం వెంటాడింది. వేళకు తినలేని పరిస్థితి. ఆదుకునే వారు లేకుండా పోయారు. ఒకనాడు కాకినాడ వీధుల్లో ఖరీదైన వాహనం మీద లాయర్ గా తిరిగిన సాంబమూర్తి చివరి రోజుల్లో అదే వీధుల్లో కంటి చూపు మందగించి, కాళ్ళకు సరైన చెప్పులు లేక చిరిగిన దుస్తులతో, చేతికర్ర సహాయంతో తిరుగుతూ భిక్షాటనం చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రతిరోజూ సాయంత్రం వేళ దేవాల యాల దగ్గర సమయం గడిపే వారు. దేవాలయాలమ దర్శించి అక్కడి ప్రసాదాలతో కడుపు నింపుకున్నారు. కొన్ని సందర్భా లలో దేవాలయం ముందు బిచ్చగాళ్ళతో చేరి క్షుద్బాధ భరించ లేక చేతులు చాపాడని అంటారు. ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వానికి అర్జీ పంపితే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం నుండి... బులుసు సాంబమూర్తి అనే ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు అనేందుకు తగిన ఆధారాలు ప్రభుత్వ రికార్డులలో లేవని సమాధానం వచ్చిందట. దేశం, నాయకులు విస్మరించిన దేశభక్తుల జాబితాలోని ఒక ప్రముఖుడు మహర్షి బులుసు సాంబమూర్తి. పేదరికంలో మగ్గుతున్న సాంబమూర్తి గురించి తెలుసుకున్న నాటి కేంద్ర హోమ్ శాఖ మంత్రి గోవింద్ వల్లభ్ పంత్ మాత్రమే ఆర్థిక సహాయం అందించారని, రాష్ట్ర నేతలు పట్టించుకోలేదని చెపుతారు. పేదరికం దానికి తోడు మానసిక వ్యథ తోడు కాగా చివరికి 1958 ఫిబ్రవరి 3న కాకినాడలోనే బులుసు సాంబమూర్తి అంతిమ శ్వాస విడిచారు. రాజకీయాలను స్వార్థ ప్రయోజనాలకు వాడుకోవడం నిత్యం కనిపించే నేటి సమాజంలో అఖిలాంధ్ర ప్రజలచే మహర్షి అని గుర్తింప బడిన సాంబమూర్తి వంటి స్వార్థ త్యాగుల త్యాగ నిరతిని ప్రజలు గుర్తుకు చేసుకోవాల్సిన, ఈనాటి నాయకులు గుర్తు చేయాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. ఆయన చరిత్రను భావి తరాలకు గుర్తు చేసేందుకు పాఠ్య అంశంగా చేర్చాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

# సంగ్మా వర్ధంతి

లోక్ సభ చరిత్రలో, అన్ని రాజకీయ పార్టీల సార్వత్రిక మద్దతుతో, స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన మొదటి వ్యక్తి సంగ్మా. ప్రతిపక్షం నుండి స్పీకర్ పదవిని నిర్వహించిన మొదటి వ్యక్తి, అతి పిన్న వయస్కుడు.

పి.ఎ.సం.గ్మా (1947 సెప్టెంబరు 1 2016 మార్చి 4) ఒక ప్రొఫెసర్, న్యాయవాది, జర్నలిస్ట్, సీనియర్ రాజకీయ నాయకులు. భారత దేశ లోక్ సభా స్పీకరుగా 1096 నుండి 1998 వరకు పనిచేసారు. ఆయన మేఘాలయ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా 1988 నుండి 1990 వరకు పని చేసారు. 1996 నుంచి 1998 వరకు లోక్ సభ స్పీకర్ గా వ్యవహరించిన సంగ్మా, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్ పీపీ)కి ఆయన అధ్యక్షుడు కూడా.

పి.ఎ.సంగ్మా పూర్తిపేరు పూర్ణో అజితోక్ సంగ్మా. ఆయన 1947, సెప్టెంబరు 1న మేఘాలయ పశ్చిమ గారో పర్వత ప్రాంతంలోని ఛాపతి గ్రామంలో మరక్ సంగ్మా, చింగ్మీ సంగ్మా దంపతులకు జన్మించారు. షిల్లాంగ్ లోని ఆంటోనీ కాలేజీలో బీఏ (హానర్స్) పూర్తిచేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి సంఘంలో పని చేశారు. కాలేజీ చదువుల అనంతరం పూర్తికాలం రాజకీయ నేతగా కెరీర్ ప్రారంభించిన సంగ్మా. 1973లో మేఘాలయ యూత్ కాంగ్రెస్ కమిటీకి ఉపాధ్యక్షుడయ్యారు. తర్వాతి ఏడాది ఆ విభాగానికి జనరల్ సెక్రటరీ అయ్యారు. 1975–1980 మధ్య కాలంలో మేఘాలయ పీసీసీ సెక్రటరీగా వ్యవహరించారు. తురా ఎస్టీ నియోజకవర్గం నుంచి 1977లో (6వ లోక్ సభకు) పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన సంగ్మా, ఎంపీగా కొనసాగుతూ, 1996 మే 25 నుంచి 1998 మార్చి 23 వరకు (11వ లోక్ సభకు) లోక్ సభ స్పీకర్ గా వ్యవహరించారు. కేంద్రమంత్రి వర్గంలోనూ పలు శాఖలు నిర్వహించిన సంగ్మా. 1988 నుంచి 1990 వరకు మేఘాలయ ముఖ్యమంత్రిగా పని చేశారు. అటుపై మళ్లీ కేంద్ర పదవులు చేపట్టారు. ఈశాన్య ఎంపీల ఫోరం ఛైర్మన్‌గా మరణించే వరకూ ఉన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీపై 1999లో తిరుగుబాటు బావుటా ఎగరేసిన పీఏ సంగ్మా. శరద్ పవార్, తారీఖ్ అన్వర్ లతో కలిసి నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)ని ఏర్పాటు చేశారు. అయితే 2011లో రాష్ట్రపతి అభ్యర్థిగా బరిలో నిలవాలనుకున్న ఆయన నిర్ణయాన్ని ఎన్సీపీ సమర్థించక పోవడంతో ఆ పార్టీని వీడి సొంతగా నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్ పీ పీ )ని స్థాపించారు.



రాష్ట్రపతి ఎన్నికల్లో ప్రణబ్ ముఖర్జీపై పోటీచేసి ఓటమి పాలయినప్పటికీ గిరిజన నేతగా ఆయన చేసిన రాజకీయ పోరాటం చరిత్రలో నిలుస్తుంది. సుదీర్ఘ రాజకీయ జీవితంలో అజాత శత్రువుగా పేరుపొందిన ఆయన గిరిజనుల అభ్యున్నతి కోసం కృషిచేశారు.

సంగ్మాకు భార్య, కుమార్తె అగాథా, కుమారులు కొన్రాడ్, జేమ్స్ సంగ్మాలు ఉన్నారు. ఆయన ముగ్గురు పిల్లలు కూడా రాజకీయ రంగంలో రాణిస్తుండటం గమనార్హం. అగాథా సంగ్మాకు పార్లమెంట్‌కు ఎన్నికైన అతిపిన్న వయస్కురాలిగా, తర్వాత కేంద్ర మంత్రిగా రికార్డుఉంది. గుండెపోటుతో ఆయన 2016 మార్చి 4 న ఉదయం ఢిల్లీలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు.

# పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

## కలెక్టర్ కు వినతి పత్రం అందించిన మాజీ సర్పంచులు



నల్లబెల్లి, మార్చ్ 3(వుదయం ప్రతినిధి)గత ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని నల్లబెల్లి మండల సర్పంచ్ల పోరం మాజీ అధ్యక్షుడు నానబోయిన రాజారామ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం జిల్లా కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..... గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం అప్పులు చేసి పనులను పూర్తి చేసామని భార్యల మీద ఉన్న పుస్తెలతాల్లు కూడా కుదవపెట్టామన్నారు. ఎన్నోసార్లు ముఖ్యమంత్రి ఇతర మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చిన కూడా స్పందన కరువైందన్నారు. గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణం, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు డ్రైనేజీల నిర్మాణాలు, అంతర్గత రోడ్ల అభివృద్ధితో పాటు అనేక రకాల అభివృద్ధి, సంక్షేమ పనులను చేపట్టామన్నారు. పెండింగ్లో ఉన్న బిల్లులను విడుదల చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు నిర్వహించాలని ఇప్పటికే బిల్లులు రాక సుమారు 70 మంది సర్పంచ్ లు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. పెండింగ్ బిల్లులను విడుదల చేయకపోతే ముకుమ్మడి ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్లు తిరుపతి, గూబ తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# విజేతలకు బహుమతుల ప్రధానం



నారాయణపేట టౌన్ మార్చి 03(వుదయం ప్రతినిధి)క్రికెట్ పోటీలో గెలుపొందిన విజేతలకు నారాయణపేట క్రీడామైదానంలో బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు.లోకల్ బాయ్స్, కర్ణ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఎఫ్. పి. ఐ -2(ఫ్రెండ్స్ ప్రీమియర్ లీగ్ -2 లో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో ఎస్ఆర్ లెవెన్ - వర్సెస్ కర్ణ ఫ్రెండ్స్ మధ్య పోటీ జరిగింది.మొదట బ్యాటింగ్ చేసిన కర్ణ ఫ్రెండ్స్ 10 ఓవర్లు లో 127/3 చేసింది. తర్వాత బాటింగ్ కి దిగిన ఎస్ ఆర్ లెవెన్ టీం 9.2 ఓవర్లు లో 128/3 పరుగులను ఛేదించి 7 వికెట్ల నష్టానికి ఎస్ ఆర్ లెవెన్ టీం విజయం సాధించింది. మొదటి బహుమతి రూపాయలు 44,444 లోకల్ బాయ్స్, కర్ణ ఫ్రెండ్స్ వారు స్పాన్సర్ చేయగా 2వ బహుమతి రూపాయలు 22,222 ని ఋషి పళ్ళ వారు స్పాన్సర్ చేశారు. కార్యక్రమం విజయవంతం చేసిన స్పాన్సర్ కి కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిధిలకు, ఆర్గనైజర్స్ లోకల్ బాయ్స్,కర్ణ ఫ్రెండ్స్ వారి తరపున వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఐదవ తేదీన మందకృష్ణ మాదిగ రాకను విజయవంతం చేయండి.



మార్చి 3 భూపాలపల్లి వుదయం ప్రతినిధి.జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని మండలాల నాయకులకు కార్యకర్తలకు మండల అధ్యక్షులకు జిల్లా నాయకులకు రాష్ట్ర నాయకులకు పిలుపు మూడు దశాబ్దాల ఎమ్మార్పీఎస్ విజయంఎస్సీల ఏబిసిడి వర్గీకరణలో ఆగస్టు 1న వచ్చినటువంటి తీర్పును అనుసరించి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సమీమ్ అత్తర్ రిటైర్డ్ జడ్జి గారితో కమిటీ వేయడం జరిగినది కమిటీ నిర్ణయం మేరకు కాకుండా 15 లక్షలు ఉన్న మాల ఉప కులలకు ఐదు పర్సెంట్ రిజర్వేషన్లు 33 లక్షల పైచిలుకు ఉన్న మాదిగ ఉప కులాలకు 9% ఇవ్వడం పట్ల పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు మరో పోరాటానికి తెరలేపి మాదిగలకు 11% ఇవ్వాలనే డిమాండ్తో తెలంగాణ రాష్ట్రంలో లక్షల డప్పులు వేల గొంతులు అనే నినాదంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో వేలాది కార్యకర్తలతో కళాకారులతో మహా ప్రదర్శనలు చేయడానికి సర్కులర్ జారీ చేయడం జరిగినది దానిలో భాగంగా భూపాలపల్లి జిల్లాకి ఐదవ తారీకు ఉదయం 10 గంటలకు భూపాలపల్లి జిల్లాకు విచ్చేస్తున్నారు హనుమాన్ దేవాలయం నుండి అంబేద్కర్ కూడలి వరకు మహా ప్రదర్శన ఉంటుంది కాబట్టి డప్పు కళాకారులు మాదిగ కళాకారులు మరియు ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి ఎం వై ఎస్ ఎంఎంఎస్ మరియు అనుబంధ సంఘాలు మరియు అభిమాన సంఘాల నాయకులు కార్యకర్తలు తరలివచ్చి మహా ప్రదర్శనను విజయవంతం చేయవలసినదిగా మరియు ఈ యొక్క మహా ప్రదర్శన విజయవంతం చేయడానికి జన సమీకరణ బాధ్యతలు ఎం ఎస్ పి ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్ ఎఫ్ ఎం వై ఎస్ ఎం ఎస్ ఎం ఈ ఎస్ మరియు అనుబంధ సంఘాల రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల అధ్యక్షులు గ్రామ అధ్యక్షులు పూర్తి బాధ్యత తీసుకొని ప్రతి గ్రామము నుండి డప్పులతో ఒక వెహికల్ తీసుకొని వచ్చే విధంగా బాధ్యత తీసుకోవాల్సిందిగా అంబాల చంద్రమౌళి మాదిగ పిలుపునివ్వడం జరిగినదినీ ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జయశంకర్ భూపాలపల్లి జిల్లా సీనియర్ నాయకులు నోముల శ్రీనివాస్ మాదిగ తెలియజేశారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన.

## సీతారామ ప్రాజెక్ట్ ఎత్తిపోతల పనులను పరిశీలించిన తుమ్మల



దమ్మపేట, మార్చి03(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ ప్రాజెక్ట్ పంప్ హౌస్ 2 ను పరిశీలించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ కార్యక్రమంలో ఆయనపంప్ హౌస్ టు నుంచి గోదావరి జలాలను దిగువకు విడుదల చేశారు తదనంతరం కమలాపురం పంప్ హౌస్ 3 ను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

కృష్ణా జలాల పంపిణీ లో కేంద్రం నిమ్మకు నీరెత్తినట్టు గా ఉంది.తెలంగాణ కు నీటి కేటాయింపులు పై కేంద్ర జలశక్తి మంత్రి నీ కలిసేందుకు సీఎం రేవంత్ ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిల్లీ వెళ్లారు అని ఆయన తెలియజేశారు అదేవిధంగా దక్షిణాది రాష్ట్రాల పై కేంద్రం వివక్ష చూపిస్తుందిజనాభా నియంత్రణ చేస్తే బహుమతిగా నిధులు తగ్గిస్తున్నారు.రాజీవ్ కెనాల్ ద్వారా సాగర్ ఆయకట్టు కు సాగునీరు

సీతారామ ప్రాజెక్ట్ పంప్ హౌస్ లిఫ్ట్ లతో గోదావరి జలాలు తరలింపువైరా రిజర్వాయర్ కు గోదావరి జలాలు తరలింపు తో సాగర్ ఆయకట్టు స్థిరీకరణ లక్షా 30 వేల ఎకరాల్లో సాగు నీటి ఎద్దడి లేకుండా నీటి తరలింపుసీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి సీఎం రేవంత్ పట్టుదలగా ఉన్నారు. అని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో తుమ్మల వెంట స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

# అసంఘిటతరంగ కార్మికులకు కనీస వేతనం అందించాలి సిఐటియు



దమ్మపేట, మార్చి03(వుదయం ప్రతినిధి): పరిశ్రమలు, వివిధరంగాల్లో పనిచేసే అసంఘటితరంగా కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించి అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. సోమవారం 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ డ్రాఫ్ట్ కనీస వేతనాలజీవోలను సవరించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా దమ్మపేట లో పెట్రోల్ బంకులు షాపులు పరిశ్రమలు కార్మికులను కలుసుకొని వారి సమస్యలు తెలుసుకుని విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ లో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు జీవో ప్రతి ఐదు సంవత్సరాలకు సవరించాల్సి ఉన్నప్పటికీ గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వం నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రెండు పారిశ్రామిక యజమానులకు వత్తాసు పలికే విధంగా కార్మికుల వేతనాలు పెంచడం లేదని అన్నారు. పెరుగుతున్న దరలకు అనుగుణంగా ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు పెంచాల్సిన తరుణంలో జీవోల సవరణ పేరుతో తగ్గించి తన వర్గ నైజాన్ని సాటుకుందని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కూడా మినిమం ఫ్లోర్ లెవెల్ వేజ్ రోజుకు 178 రూపాయలుగా నిర్ణయించటం సిగ్గుచేటని నెలకు పెరుగుతున్న ధరలతో 4628 రూపాయలతో కార్మికులు ఎలా బతుకుతారని అన్నారు. కార్మికుల వేతనాల పట్ల కాంగ్రెస్ బిజెపికి తేడా ఏమీ లేదని బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల వేతనాలు సంక్షేమం కార్మిక సంఘాలపై తీవ్రమైన దాడి చేస్తున్నారని అన్నారు. 15వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ డాక్టర్ ఆ క్రాయిడ్ ఫార్ములా ప్రకారం కనీస వేతనాలు 26 వేల రూపాయలు నిర్ణయించి అమలు చేయాలని చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కుమారి, అజయ్,రమ్య, రాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ దోపిడీ: అధిక ధరల ఔషధాలు, రోగులకు భారమవుతున్న వైద్యం

మెడికల్ షాప్ ఔషధాలు

**జనరిక్ ఔషధాలు**



హైదరాబాద్,మార్చి03(వుదయం ప్రతినిధి): ఫార్మాస్యూటికల్ కంపెనీలు, ప్రైవేట్ ఆసుపత్రులు, మెడికల్ స్టోర్లు కలిసి ఔషధ వ్యాపారాన్ని లాభదోపిడీకి గురిచేస్తున్నాయి. ఉత్పత్తి ఖర్చుతో పోల్చితే కొన్ని మందులు 500% నుంచి 1000% అధిక ధరకు విక్రయించబడుతున్నాయి. డాక్టర్లు ప్రధానంగా ఖరీదైన బ్రాండెడ్ మెడిసిన్లను మాత్రమే సూచిస్తుండటం, తక్కువ ధరలో లభించే జెనరిక్ మందుల అందుబాటును తగ్గిస్తోంది.

హాస్పిటల్ ఫార్మసీల పెత్తనం

ప్రైవేట్ ఆసుపత్రులు తమ అనుబంధ మెడికల్ స్టోర్ల నుంచే మందులు కొనాలని రోగులపై ఒత్తిడి తెస్తున్నాయి. అదే మందులు ప్రభుత్వ మెడికల్ స్టోర్లలో 80% తక్కువ ధరకు లభిస్తున్నా, అవి ప్రిస్క్రైబ్ చేయడం లేదు.

డాక్టర్ల కమీషన్ వ్యవహారం

ఫార్మా కంపెనీలు డాక్టర్లకు అధిక కమీషన్ అందిస్తూ ఖరీదైన మందులను సూచిస్తున్నారు.

జనరిక్ మందులన్నీ అందుబాటులో ఉన్నప్పటికీ, రోగులకు బ్రాండెడ్ మందుల మళ్లీ మళ్లీ వ్రాయడం అనవసర భారంగా మారుతోంది.

విదేశీ టూర్లు, కాన్ఫరెన్స్ టికెట్లు, ఇతర గిఫ్టులు ఇచ్చి కంపెనీలు వైద్యుల్ని ప్రభావితం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా?

జనౌషధి కేంద్రాలు ప్రారంభించినా, ప్రజల్లో అవగాహన తక్కువగా ఉంది.మందుల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నా, కొన్ని కంపెనీలు కొత్త పేర్లతో కొత్త ప్రోడక్టులు లాంచ్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నాయి.

రోగులు మోసపోకుండా ఉండాలంటే?

జనరిక్ మెడిసిన్లు కొనుగోలు చేయండి % అదే రసాయనంతో తక్కువ ధరలో లభిస్తాయి.

ఆన్‌లైన్ మెడికల్ స్టోర్స్ (1 గ్రామ్ ఫార్మసీ) నుండి కొనుగోలు చేయండి.

డాక్టర్లను జనరిక్ పేర్లను వ్రాయాలని కోరండి.

మెడికల్ బిల్లు తప్పనిసరిగా తీసుకోండి, ఎమ్ ఆర్ పి కంటే ఎక్కువ వసూలు చేస్తే ఫిర్యాదు చేయండి.

ముగింపు

మెడికల్ రంగంలో పెరుగుతున్న లాభదోపిడీపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. రోగులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండాలంటే, మెడికల్ అవగాహన పెంపొందించుకోవడం చాలా అవసరం.

# త్రాసుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ భార్గవ్ గత నాలుగు రోజులుగా...



పినపాక నియోజకవర్గం మార్చి03(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్త గూడెం జిల్లా పినపాక మండలం ఉప్పాక ప్రాథమికోన్నత పాఠశాల దగ్గరలో గల పురాతన బావిలో పడి ఉన్న గోధుమ త్రాసు పామును, ములుగు జిల్లా వెంకటాపురానికి చెందిన స్నేక్యాచార్ భార్గవ్ పట్టుకున్నారు. సామాజిక కార్యకర్త బోడ లక్ష్మణరావు సోషల్ మీడియా వేదికగా ఇచ్చిన సమాచారం మేరకు, పినపాక మండల పంచాయతీ అధికారులు ఫారెస్ట్ అధికారులు చొరవ తీసుకొని స్నేక్ క్యాచర్ భార్గవ్ సహాయంతో పామును బయటకు తీసే విధంగా చర్యలు తీసుకున్నారు. భార్గవ్ మాట్లాడుతూ.. అంతరించిపోయే ప్రాణుల జాబితాలో గోధుమ త్రాసు సైతం ఉందని, వన్యప్రాణులకు ఎటువంటి హాని కలిగించొద్దని, ఇక్కడ ఏ ఇబ్బంది కలిగిన తనకు సమాచారం అందిస్తే తప్పకుండా వచ్చి సహాయం అందిస్తానని భార్గవ్ తెలిపారు. కార్యక్రమంలో పినపాక ఎంపీఓ కే.వెంకటేశ్వర్లు, ఫారెస్ట్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పై మంత్రి పొన్నం ఫైర్



హుస్నాబాద్ మార్చి03(వుదయం ప్రతినిధి): కేంద్రం నుండి రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు రాకుండా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నట్లు తమకు సమాచారం ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి పై మంత్రి నిప్పులు చెరిగారు. బండి సంజయ్ ని తొలగించి కేసీఆర్ బినామిగా కిషన్ రెడ్డి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యాడని ఆరోపించారు. తెలంగాణకు రావాల్సిన ప్రాజెక్టులు ఎందుకు కార్యరూపం దాల్చడం లేదో కిషన్ రెడ్డి చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఎయిర్పోర్ట్ కు సంబంధించి ఒక్క లేటర్ అయిన కేంద్రానికి రాశారా అని ప్రశ్నించారు. కిషన్ రెడ్డిది తెలంగాణ రక్తం అయితే తెలంగాణ అభివృద్ధికి అవసరమైన నిధులు, ప్రాజెక్టులు తీసుకురావాలన్నారు. కేంద్రం నుండి తెలంగాణకు నిధులు రాబట్టడంలో కిషన్ రెడ్డికి స్టాండ్ లేదని, దమ్ము లేక పక్క రాష్ట్ర మంత్రిని తీసుకువచ్చి ఎయిర్పోర్ట్ తీసుకువచ్చానని కిషన్ రెడ్డి గొప్పలు చెప్పించుకుంటున్నాడని మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధికి కిషన్ రెడ్డితో తాము కూడా కలిసి వస్తామని, కానీ రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడడం సరికాదన్నారు. కుల గణన రీ సర్వేకు సంబంధించి గత నెల 16 వ తేది నుండి 28 వరకు అవకాశం ఇచ్చామన్నారు. బిఆర్ఎస్ నాయకులు కేసిఆర్, కేటీఆర్, హరీష్ రావు కుల రీ సర్వేలో కూడా సమాచారం ఇవ్వలేదని, కాబట్టి వాళ్లకు కుల సర్వే పై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. బిసి రిజర్వేషన్లపై శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని, దాన్ని తమిళనాడు మాదిరిగా షెడ్యూల్లో పెట్టించాల్సిన బాధ్యత రాష్ట్ర బిజెపి నాయకులదేనన్నారు. హైదరాబాద్ - కరీంనగర్- నిజామాబాద్ వరకు 8 లైన్ల రహదారి వేయించాలని కేంద్రానికి నివేదించామని, కానీ దానికి ఇంతవరకు స్పందన లేదన్నారు.ఈ కార్యక్రమం లో సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, వైస్ చైర్మన్ బంక చందు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చిత్తారి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే మహిళా సంక్షేమం.!

## - పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్

## - కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం



హనుమకొండ, మార్చి 03(వుదయం జిల్లా ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసి వారి అభివృద్ధికి కృషి చేస్తుందని పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ తెలిపారు. పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం సోమవారం రోజున పరకాల పట్టణంలోని 6 7 వార్డులలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారెంటీ లపై కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ ,రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, భూమిలేని రైతు కూలీల కోసం ఆత్మీయ భరోసా తదితర కార్యక్రమాలపై కార్యకర్తలకు వివరించారు. దేశంలోనే ఎవరూ చేయని విధంగా రాష్ట్రంలో కులగనన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. దళితుల్లో సమన్యాయం కోసం ఎస్సీ వర్గీకరణ చేసిన మొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రమేనని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సమిష్టిగా కృషిచేసి అభ్యర్థుల విజయానికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి, చిన్నాల గోనాద్ ,బుర్ర రాజమౌళి, నల్లెల కుమార్, పసుల రమేష్, సదానందం గౌడ్, మడికొండ సంపత్ కుమార్, నల్లెల అనిల్ ,దుబాసి వెంకటస్వామి, మడికొండ శ్రీనివాస్, పబ్బ శ్రీనివాస్, సంజీవయ్య, విజయభాస్కర్, లడే శ్రీకాంత్, ఉడుత సంపత్, సతీష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జయశంకర్ భూపాలపల్లి మార్చి 03(వుదయం ప్రతినిధి) నేడు విద్యుత్ సరఫరా లో అంతరాయం జరుగుతుందని మహాదేవపూర్ విద్యుత్ శాఖ ఏ ఈ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు పెద్దంపెట్ సబ్స్టేషన్ పరిధిలోని అంబట్ పల్లి, పెద్దంపెట్ గ్రామలలో 33 కెవి విద్యుత్ లైన్ మరమ్మత్తుల దృశ్య ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

# ప్రభుత్వం కల్పించిన ఎల్ఆర్ఎస్ ను సద్వినియోగం చేసుకోండి.

**పరకాల కమిషనర్ సిహెచ్ వెంకటేష్.**

పరకాల మార్చి 3 (వుదయం ప్రతినిధి ): 2020 సంవత్సరంలో వెయ్యి రూపాయలు చెల్లించి ఎల్ఆర్ఎస్ కొరకు రిజిస్టర్ చేసుకున్న ప్లాట్ల యజమానులకు పేపర్ల మీద గీతలు చూసి కొనుగోలు చేసి ఇబ్బందులు పడుతున్న వారికి అనుమతి లే అవుట్లలోని ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకొనుటకు తెలంగాణ ప్రభుత్వం ఈనెల మార్చి 31వ తేదీ వరకు ఈ సదవకాశాన్ని కల్పించడమైనది. అనుమతి లేని లేఅవుట్లలో 10% ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయి.మిగతా కానీ వాటిని కూడా సబ్ రిజిస్ట్రేషన్ వారి కార్యాలయము నందు రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు ఎల్ ఆర్ ఎస్ రుసుము కూడా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. కావున మార్చి 31వ తేదీలోపు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించే వారికి ఎల్ఆర్ఎస్ రుసుములో 25% రాయితీ కూడా వస్తుందని పరకాల పురపాలక సంఘం కమిషనర్ సిహెచ్ వెంకటేష్ తెలిపారు. ఈ సదవకాశాన్ని పరకాల ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళాలి



నల్లబెల్లి, మార్చి 3(వుదయం ప్రతినిధి)మండల కేంద్రంలోని కారుణ్య జ్యోతి ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సుమారు 38 మంది విద్యార్థులు ఉపాధ్యాయ పాత్రలలో తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు.డీఈవో గా రితిక,ఎంఈఓగా మీనాక్షి,ప్రిన్సిపాల్ గా లాస్య,వైస్ ప్రిన్సిపాల్ గా రోహిత్,కరస్పాండెంట్ గా ఇర్ఫాన్ లు విధులు నిర్వర్తించారు.అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారాణి, కరెస్పాండ్ మరియా దాసు, వైస్ ప్రిన్సిపాల్ కుమారస్వామి, ఉపాధ్యాయులు సాంబమూర్తి,రాజేందర్,అజయ్ బాబు,హరి,రాజసబ్,అంజద్ అలీ, సునీత, సింధు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులు పునరావృత్తం కాకుండా వెంటవెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు.





మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా మార్చి03(వుదయం ప్రతినిధి): జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యల అర్జీలను లా ఆఫీసర్ చంద్రావతి, డిఆర్ఓ హరిప్రియల తో కలిసి మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్వీకరించారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో (100) ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులు పెండింగ్ లో ఉండటం వలన అభ్యర్థులు మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకోవడం జరుగుతుందని, ఇట్టి విషయాన్ని జిల్లా అధికారులు గమనించి, దరఖాస్తులు పునరావృత్తం కాకుండా వెంట వెంటనే పరిష్కరించాలని జిల్లా అధికారులను అదనపు కలెక్టరు ఆదేశించారు.వివిధ శాఖలలో ప్రజా సమస్యలను సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని వెంట వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.
అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు పోస్టర్ ను జిల్లా అధికారులతో కలిసి అదనపు కలెక్టరు విడుదల చేసారు.

## ఆటో కన్సల్టెన్సీ గూడ్స్ అండ్ ఓనర్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోశాధికారిగా



బాషిపాక సదయ్య
సంగెం మార్చి 3 వుదయం ప్రతినిధిఉమ్మడి వరంగల్ జిల్లా ఆటో కన్సల్టెన్సీ గూడ్స్ అండ్ ఓనర్ అసోసియేషన్ జిల్లా ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలను ఓటింగ్ పద్ధతిలో నిర్వహించగా సంగెం మండలంలోని గవిచర్ల గ్రామానికి చెందిన భాషిపాక సదయ్య ను ఉమ్మడి వరంగల్ జిల్లా ఆటో కన్సల్టెన్సీ జిల్లా కోశాధికారిగా భారీ మెజార్టీతో ఎన్నికయ్యారు. అలాగే ఆటో కన్సల్టెన్సీ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షులుగా పుప్పాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పేర్ల సాంబయ్య, ప్రధాన కార్యదర్శి గా బండ శ్రీనివాస్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కోశాధికారి సదయ్య మాట్లాడుతూ ఆటో కన్సల్టెన్సీ సమస్యలను అర్ధం చేసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు తాగేందుకు మంచినీల్లు దొరకని దుస్థితి నెలకొంది..



పినపాక నియోజకవర్గం మార్చి03(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపినపాక మండలం ఉప్పాక గ్రామంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తాగేందుకు మంచినీల్లు దొరకని దుస్థితి నెలకొంది. వివరాల్లోకెళ్తే పాఠశాలలో ఒకటి నుండి 5వ తరగతి చదివి విద్యార్థులు ఉన్నారు. గత కొంతకాలంగా చేతిపంపు పని చేయకపోవడంతో విద్యార్థులు నీళ్ల తాగేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అంతేగాకుండా వంట చేయడానికి సైతం నీళ్లులేక ఇబ్బంది పడాల్సి వస్తుంది. పురాతన కాలంగా గ్రామస్తులు పాఠశాల విద్యార్థులకు ఈ ఒక్క పంపు మాత్రమే జీవజల్లంగా దాహార్తిని తీరుస్తుంది. మండల విద్యాధికారి, ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు చొరవ చూపి తక్షణమే చేతి పంపును రిపేర్ చేసి వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు విద్యార్థులు కోరుతున్నారు.

## తునికి ఆకు ప్రూనింగ్ పనులను వెంటనే ప్రారంభించాలి

**–అఖిల భారత రైతు కూలీ సంఘం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి గుజ్జు దేవేందర్ ప్రభుత్వానికి డిమాండ్**




కొత్తగూడ మార్చి 03(వుదయం ప్రతినిధి) :2025 సంవత్సరంకు తునికి ఆకు టెండర్లను వేయడంలో ఆలస్యం అయినందున ఆదివాసి ప్రజలకు జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడినందున రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే టెండర్ల వేపించి ప్రూనింగ్ పనులు వెంటనే ప్రారంభించాలని కొత్తగూడ అటవీ శాఖ కార్యాలయంలోని జూనియర్ అసిస్టెంట్ మనోజ్ కు సోమవారం అఖిల భారత రైతు కూలీ సంఘం( ఏఐకేఎంఎస్) మండల కార్యవర్గం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించడం జరిగింది. అనంతరం ఏఐకేఎంఎస్ అఖిలభారత రైతుకులి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్ మాట్లాడుతూ
ఆదివాసుల జీవనాధారమైన రెండవ పంట తునికి ఆకుపంటని ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితంగా టెండర్ల పనులు సకాలంలో ప్రారంభించకపోవడంతో ఆదివాసులు నష్టపోవాల్సి వస్తుందని ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు.డిమాండ్స్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 50 ఆకుల తుని ఆకు కట్టకు రూ 6 రూపాయల చొప్పున చెల్లించాలి.తునికాకు కళ్ళ మీద జరిగే అన్ని రకాల పనులు కూలి రేట్లు ఉల్టా పల్టా రేట్లు పాత రేట్ల మీద 30% అదనంగా పెంచి ఇవ్వాలి
కళ్ళేదారులు గిర్ధవార్ల జీతాలు లోడింగ్ అన్లోడింగ్ వంటి అన్ని రకాల పనులకుపాత రేట్లపై అదనంగా 30% ధరలను పెంచివ్వాలి
తునికి ఆకు సేకరణ సందర్భంలో సంభవించే అన్ని రకాల ప్రమాదాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలి
తునికాకు ఆకు సేకరణ సందర్భంగా తగిన నష్టపరిహారం చెల్లించాలి ప్రాణాలు కోల్పోయిన వారికి 25 లక్షలు దెబ్బలు తగిలిన వారికి రెండు లక్షలు ఎక్స్గ్రేషియా చెల్లించాలి
పెండింగ్ లో ఉన్న బోనసులు వెంటనే చెల్లించాల నీ వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీసంఘం నాయకులు దేవులపల్లి మంగన్న,శ్రీశైలం,పైడి, వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ లో మరణించిన వారి కుటుంబానికి ప్రభుత్వం భరోసా...

ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పార్థివ దేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేలా చర్యలు...



కోరుట్ల మార్చి 03 (వుదయం ప్రతినిధి) ఇటీవల సౌదీలో కథలాపూర్ మండలం పోసానిపేట గ్రామానికి చెందిన గుంట హనుమంతు హత్యకు గురవ్వగా విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు ఈసందర్భంగా వారి మృతదేహాన్ని ఇండియాకు తెప్పించడానికి సౌది ఎంబసీ అధికారులతో మాట్లాడతానని తెలిపారు వారి కుటుంబ సభ్యులు మనో ధైర్యం కోల్పోకుండా ధైర్యంగా ఉండాలన్నారు వారి కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు

## వరంగల్ -హనుమకొండ జిల్లా ఫర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగుర్ల వెంకటేశ్వర్లు.

**శాలువాతో సత్కరించిన అరుణ ఫర్టిలైజర్ యాజమాని**




పరకాల మార్చి 3 (వుదయం ప్రతినిధి):వరంగల్ హనుమకొండ జిల్లా ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన నాగూర్ల వెంకన్న కి హార్దిక శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించిన అరుణ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ సీడ్స్ ప్రొప్రైటర్ గందే వెంకటేశ్వర్లు. గత 35 సంవత్సరాలుగా ఫర్టిలైజర్స్
,పెస్టిసైడ్స్అండ్ సీడ్స్ రంగంలో వరంగల్ హనుమకొండ జిల్లా ఫర్టిలైజర్ అసోసియేషన్ కి ఎనలేని సేవలు అందిస్తూ ఒక ప్రత్యేక పాత్రను పోషిస్తూ ఎరువుల పురుగుమందులు విత్తనం పై దుకాణాల యజమానుల సమస్యలను తెలుసుకొని సమస్యల పరిష్కారానికి అనునిత్యం కృషి చేస్తూ వరంగల్ జిల్లా ఫర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన నాగూర్ల వెంకటేశ్వర్లు కి ప్రత్యేక శుభాకాంక్షలు తెలపడం జరిగింది.

## శ్రీ కట్ట మైసమ్మతల్లి విగ్ర ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న ఈర్ల రాజు ముదిరాజ్



సంగారెడ్డి జిల్లా, అమీన్పూర్ మార్చి03(వుదయం ప్రతినిధి): మండలం, కిష్టారెడ్డిపేటపటాన్చెరు నియోజకవర్గ అమీన్పూర్ మున్సిపాలిటీ కిష్టారెడ్డి పెట్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ కట్ట మైసంబిక దేవాలయంలో మైసమ్మ తల్లి ప్రతిష్ట కార్యక్రమాల్లో పాల్గొని పూజలు నిర్వహించుకుని తీర్థ ప్రసాదాలు తీసుకున్న అమీన్పూర్ బిజెపి మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ వీళ్ళ రాజు మాట్లాడుతూ సనాతన ధర్మం హిందూ ధర్మం కాపాడబడాలంటే ఇలాంటి దేవాలయాలు ప్రతి గ్రామంలో నిర్మించవలసిన అవసరం ప్రతి హిందు నాయకుల పైన ఉందని అన్నారు ఈ ఆలయాన్ని నిర్మించిన కిష్టారెడ్డిపేట్ గ్రామ పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ ఏర్పుల కృష్ణ గారు. తాజా మాజీ వైస్ ఎంపీపీ దండ్ల సత్యనారాయణ.నాగుల్ సెట్ గౌడ్.వన్యాల నరసింహా గౌడ్.జి అంజిరెడ్డి. చీమలధారి శ్రీహరి.దొంతి పెంటేష్ ముదిరాజ్.ఏర్పుల దర్శన్.ప్రశాంత్ రెడ్డి.కమ్మరి శ్రీనివాస్ చారి.టి మాణిక్యం.దొంతి వెంకటేష్. కుమ్మరి శ్రీనివాస్.గొల్ల ఆంజనేయులు యాదవ్. ఏర్పుల నర్సింగరావు.గ్రామ నాయకులు పాల్గొన్నారు

## ముమ్మరంగా సాగుతున్న పారిశుద్ధ్య పనులు



ముధోల్, మార్చ్3 (వుదయం ప్రతినిధి) ముధోల్ మండల కేంద్రంలో వివిధ వార్డుల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. మురికి కాలువలను శుభ్రం చేసి ఎప్పటికప్పుడు తీసిన మట్టిని తొలగించే వనులు చేపడుతున్నారు. అదేవిధంగా చెత్తాచెదారాన్ని ఇంటింటా తిరుగుతూ సేకరించి వాహనంలో తరలిస్తున్నారు. ఈ సందర్భంగా ఈఓ అన్వర్ అలీ మాట్లాడుతు... ప్రజలు తమ వంతు బాధ్యతగా గ్రామపంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. చెత్తను మురుగు కాలువల్లో వేయకుండా చెత్త బండిలోనే వేయాలన్నారు. ప్రజల సహకారంతో పారిశుద్ధ్య పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. ఇప్పటికే వార్డుల వారీగా మురుగు కాలువలను శుభ్రం చేసే పనులు చేపట్టడం జరిగిందని వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

## ఉమెన్స్ అండ్ మెన్స్ ఫైనల్ కబడ్డీ పోటీలను ప్రారంభించిన కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి

**పాల్గొన్న ఐరా రియాలిటీ పోషం నర్సిరెడ్డి**
**తిలకించిన శాగంరెడ్డి పద్మ గోవిందరెడ్డి, కొట్టే పద్మసైదేశ్వరావు, కాకునూరి భాస్కర్ రెడ్డి ఇంద్రారెడ్డి**
**ముఖ్యఅతిథిగా పాల్గొన్న పోషం వెంకటరెడ్డి మల్లమ్మ దంపతులు**



మేళ్లచెరువు /హుజూర్నగర్ మార్చి3 (వుదయం ప్రతినిధి): సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలో ఐదు రోజుల నుండి అంగరంగ వైభవంగా జరుగుతున్న మహాశివరాత్రి జాతరలో భాగంగా ఉమెన్స్ అండ్ మెన్స్ కబడ్డీ ఫైనల్ పోటీలను ప్రారంభించిన కోదాడ ఎమ్మెల్యే మరియు ఎస్టిమేట్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ పద్మావతి రెడ్డి. ఈ కార్యక్రమంలో ఉత్తం పద్మావతి రెడ్డి మాట్లాడుతూ కబడ్డీ పోటీలను నిర్వహించిన కన్వీనర్ పోశం వీరారెడ్డి కి మరియు కబడ్డీ పోటీలకు, ఎద్దుల పందాలకు సహాయ సహకారాలు అందించిన మైహెూం ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కబడ్డీ పోటీలను రాష్ట్ర స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు తీసుకువెళ్లాలని భారీ నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖామాత్యులు ఉత్తం కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆయన యొక్క సూచనలు సలహాలతో కబడ్డీ హబ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కబడ్డీ పోటీలు ఎద్దుల పందాల వలననే మేళ్లచెరువు మహాశివరాత్రి జాతరకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందని భవిష్యత్తులో వీటికి మరింత గుర్తింపు ఉండేలా చేస్తామని తెలిపారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పోషం నర్సిరెడ్డి మాట్లాడుతూ నెల రోజుల నుంచి శ్రమిస్తూ ఈ కబడ్డీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కమిటీ సభ్యులకు పేరుపేరునా,రిఫరీస్ కు మైక్ సెట్ వారికి తిలకించటానికి వచ్చిన జన సందోహానికి ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. ఉమెన్స్ ఫైనల్ మ్యాచ్ చిత్తూరు, మెన్స్ ఫైనల్ మ్యాచ్ దొండపాడు కైవసం చేసుకోవడం జరిగింది. అనంతరం బహుమతుల ప్రధానోత్సవం జరిగిందిఈ కార్యక్రమంలో నాగేళ్ల శంబిరెడ్డి, సీనియర్ కాబట్టి క్రీడాకారులు ముడెం అప్పిరెడ్డి కమిటీ సభ్యులు భోగాల శంకర్ రెడ్డి,మంద రవి బారెడ్డి విజయసింహారెడ్డి, కొర్లపాటి నరేందర్, మేళ్లచెరువు నాగరాజు, బోగాల కొండారెడ్డి, కందుల సురేష్, ఎసిరెడ్డి గౌతమ్ రెడ్డి,నరాల శెట్టి నిరంజన్, ఊట్ల సాయి కబడ్డీ అధ్యక్షులు నామానరసింహారావు ,యాంకర్ సౌమ్య, రిఫరీస్ తదితరులు పాల్గొన్నారు.

## బీరాపల్లి సెక్టర్లో అంగన్వాడీ టీచర్లు, ఆయాల పదవి విరమణ



సత్తుపల్లి/ వేంసూర్ మార్చ్ 3 (వుదయం ప్రతినిధి) వేంసూరు మండల పరిధిలోని బీరాపల్లి సెక్టర్లో ముగ్గురు అంగన్వాడీ టీచర్లు , ఐదుగురు ఆయాలు పదవి విరమణ మహెూత్సవ కార్యక్రమం ఐసిడిఎస్ సూపర్వైజర్ భవాని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పదవి విరమణ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఆయాలు మాట్లాడుతూ తమ వద్ద విద్యను అభ్యసించిన పిల్లలు ప్రభుత్వ ఉద్యోగాల్లో విదేశాల్లో ప్రైవేట్ కంపెనీలో మంచి వివిధ హెూదాలో ఉద్యోగాలు చేస్తున్నారని గర్వంగా తెలిపారు. 35 సంవత్సరాలుగా అంగన్వాడి సెంటర్లో విధులు నిర్వహించామని తెలిపారు . కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న వేతనాలను విడుదల చేయండి



నారాయణపేట టౌన్ మార్చి 03 (వుదయం ప్రతినిధి)నాలుగు నెలలుగా పెండింగులో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వెంకట్రామారెడ్డి, కార్యదర్శి బలరాం లు గ్రామపంచాయతీ అధికారి కృష్ణ కు సోమవారం వినతిపత్రం అందజేశారు. నారాయణపేట జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్లో ఉన్నాయని వెంటనే విడుదల చేయాలని వారు ఈ సందర్భంగా అధికారికి ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కార్మికులు అప్పుల పాలవుతున్నారని డిపిఓ దృష్టికి తీసుకెళ్లారు ,వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. దీనికి స్పందించిన జిల్లా అధికారి రెండు మూడు రోజుల్లో కార్మికుల ఖాతాలలో వేతనాలు పడే విధంగా చూస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

## ఎల్ఆర్ఎస్ గడువు మార్చి 31 వరకు పొడిగింపు...

కోరుట్ల మార్చి 03 (వుదయం ప్రతినిధి) కోరుట్ల మున్సిపల్ పరిధిలో 2020 సంవత్సరంలో వెయ్యి రూపాయలు చెల్లించి ఎల్ఆర్ఎస్ కొరకు రిజిస్టర్ చేసుకున్న ప్లాట్ యజమానులకు అనుమతి లేఔట్లలోని ఖాళీ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకొనుటకు తెలంగాణ ప్రభుత్వం 2025 సంవత్సరం మార్చి 31 వరకు అవకాశాన్ని కల్పించింది కావున అనుమతి లేని లేఅవుట్లలో 10 శాతం ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయ్యి మిగతా కానీ వాటికి కూడా సబ్ రిజిస్టర్ కార్యాలయం నందు రిజిస్ట్రేషన్ తో పాటు ఎల్ఆర్ఎస్ రుసుము కూడా చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని మార్చి 31వ తేదీలోగా ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించే వారికి 25% రాయితీ కూడా ప్రకటించింది కావున ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోగలరని మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి కోరారు

## విద్యుత్ షాట్ సర్క్యూట్ తో పూరి గుడిసె దగ్ధం...

**లక్ష రూపాయల ఆస్తి నష్టం**



కోరుట్ల మార్చి 03 (వుదయం ప్రతినిధి) విద్యుత్ షాట్ సర్క్యూట్ తో పూరి గుడిసె దగ్ధమైన ఘటన కథలాపూర్ మండలం పోతారంలో చోటుచేసుకుంది స్థానికుల సమాచారం ప్రకారం కథలాపూర్ మండలం పోతారం గ్రామానికి చెందిన గొళ్ళెం హన్మక్క 62 పూరి గుడిసె లో నివసిస్తుంది ఈ క్రమంలో సోమవారం ఉదయం 9 గంటల సమయంలో తను నివసిస్తున్న పూరి గుడిసెలో ఒక్కసారిగా షాట్ సర్క్యూట్ జరగడంతో గుడిసె పూర్తిగా కాలిపోయింది అందులో ఉన్న బట్టలు సరుకులు పూర్తిగా ఒక లక్ష రూపాయలు ఆర్థిక నష్టం కాగా తలదాచుకునే పరిస్థితి లేకుండా పోయిందని హన్మక్క ఆవేదన వ్యక్తం చేసింది విషయం తెలుసుకున్న పోతారం మాజీ ఎంపీటీసీ కథలాపూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చెర్ పర్సన్ పులి శిరీష హరిప్రసాద్ లు తన వంతు ఆర్థిక సహాయంగా 5 వేల రూపాయలను హ్యన్మక్క కు అందించి ఔదార్యాన్ని చాటారు మరికొంత మంది ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు

# బీసీ బిడ్డపై మండల బీజేపీ నాయకుల వివక్ష

## -ఏకపక్షంగా పార్టీ నుండి బహిష్కరణ
## -తక్షణమే తనపై సస్పెండ్ ఎత్తివేయాలి: బిజెపి బహిష్కృత నేత మందపల్లి శ్రీనివాస్

ఎండపల్లి,మార్చి 04 (వుదయం విలేఖరి):బీసీ నాయకుడిని అనే కారణంతో తనపై వివక్ష చూపుతూ ఏకపక్షంగా తన వివరణ లేకుండా బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు రావు హనుమంత రావు బీజేపీ పార్టీ నుండి సస్పెండ్ చేయడం పార్టీ నియమాలకు విరుద్ధమని తన సస్పెండ్ ను తక్షణమే ఎత్తివేయాలనీ బిజెపి బహిష్కృత నేత మందపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.సోమవారం ఎండపల్లి మండల ప్రెస్ క్లబ్ (ఐజేయూ) లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీసీ నాయకుడిగా దేశ ప్రధాని మోదీ ని ఆదర్శంగా




తీసుకొని బిజెపి పార్టీలో చేరానని, మండల పార్టీ అధ్యక్షుడు తనపై మొదట నుండి బీసీ నాయకుడు అని వివక్ష చూపుతూ పార్టీ కార్యకలాపాలకు సంబంధించి ఎటువంటి సమాచారం అందించకుండా అడ్డుపడ్డారని ఇదే విషయమై ప్రశ్నించగా తనపై కక్షగట్టి అగ్రకుల పార్టీ నాయకుడు తనను వివరణ అడగకుండా ఏకపక్షంగా సస్పెండ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సస్పెండ్ విషయాన్ని జిల్లా పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీని సంస్థాగతంగా సమన్వయం చేసుకుంటూ బలోపేతం చేయాల్సిన నాయకుడు బిసి బిడ్డలపై వివక్ష చూపుతూ పార్టీలో బీసీ నాయకులను అడ్డుకుంటున్నారని విమర్శించారు. తన వివరణ తీసుకొని తనపై ఉన్న సస్పెన్షన్ ను తక్షణమే ఎత్తివేయాలని పార్టీ అధిష్టానానికి సూచించారు.

# రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతుంది.

**రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ పేరుతో ఓ వర్గానికి వంత పాడుతూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తుంది.**
**వెంటనే ఎస్ఎస్సి ఇ ఆర్టి తీసుకున్న దిక్కుమాలిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని పరీక్ష సమయాలు ఉదయం వేళలో నిర్వహించాలి.**
**ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్.**

నర్సంపేట వుదయం ప్రతినిధి మార్చి 3.అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయం రంజాన్ మాసం పేరు చెప్పి పదవ తరగతి ప్రీ ఫైనల్ పరీక్ష వేళలో మార్పులు చేసన్రా ఎస్సీఈఆర్టీ తీసుకున్న దిక్కుమాలిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ డీఈఓ కి వినతి పత్రం



అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ మాట్లాడుతూ వేసవికాలంలో ఎర్రటి ఎండలను చూసి తల్లిదండ్రులు మరియు విద్యావేత్తలు వైద్యులు ఒంటిపూట బడులు నడపాలని విజ్ఞప్తి చేస్తుంటే, తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ పాఠశాల విద్యార్థుల ప్రాణాలతో ఈ దిక్కుమాలిన నిర్ణయాన్ని తీసుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఈనెల 6వ తేదీ నుండి జరిగే పదవ తరగతి ప్రీ ఫైనల్ పరీక్ష వేళలో రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్నము 12:15 నుండి 3:15 వరకు సమయం నిర్ణయిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఒక సర్కులర్ ను రిలీజ్ చేయడం జరిగింది. ఈ నిర్ణయాన్ని ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుంది. రంజాన్ మాసం కు విద్యార్థుల పరీక్షలకు ఏం సంబంధం ఉందో విద్యాశాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి విద్యార్థులకు సమాధానం చెప్పాలని విద్యార్థి మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో మిట్టమధ్యాహ్నం మండుటెండల్లో పరీక్షలు నిర్వహించమని ఏ విద్యావేత్తలు వైద్య నిపుణులు సలహా ఇచ్చారో రాష్ట్రవ్యాప్తం తెలియజేయాలి. ఈ రాష్ట్రం ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేయడం సిగ్గుచేయదానికి మండివడ్డారు. ఎస్సీఈఆర్టీలో పనిచేస్తున్న అధికారుల మతిభ్రమించినట్టుందనీ అందుకే ఇలాంటి పనికిమాలిన నిర్ణయాలు తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష సమయాలు ఉదయం వేళలో నిర్వహించాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందనీ లేదంటే జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఏబీవీపీ హెచ్చరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట కార్యదర్శి రాకం రాకేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోల్ల అజయ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు జాతీయ మెరిట్ స్కాలర్ షిప్.

**మా విద్యార్థులు ఎంపిక కావడం మాకెంతో గర్వకారణం అంటున్నా ప్రధాన ఉపాధ్యాయుడు పోడం కాంతారావు.**

నర్సంపేట వుదయం ప్రతినిధి మార్చి 3. నర్సంపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు జాతీయ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ ఎం ఎం ఎస్) లో బాగంగా గత సంవత్సరం నవంబర్ -24 తేదీన 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన విద్యార్థులకు జాతీయ మెరిట్ స్కాలర్షిప్ స్కాలర్ షిప్ పోటీ పరీక్ష లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికల నర్సంపేట నుండి ముగ్గురు విద్యార్థిని, విద్యార్థులు యం. మహేందర్, బి. సహస్ర, యం. డి. సమీరా లు ఎంపిక కావడం వలన పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోడెం కాంతారావు మరియు ఉపాధ్యాయిని, ఉ



పాధ్యాయులు వారిని అభినందించడం జరిగింది. ఈ పథకంలో ఎంపికైన విద్యార్థులకు నాలుగు(4) సంవత్సరాలకు గాను( ప్రతి సంవత్సరం రూ. 12000/-చొప్పున )రూ. 48000/-మంజూరు చేయబడతాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఈ లాంటి పోటీ పరీక్షలలో పాల్గొనడం వల్ల విద్యార్థులలో ఆత్మ విశ్వాసం పెంపండమే కాక పోటీతత్వాన్ని అలవర్చు కోవడానికి ఉపయోగ పడుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు . బి. రాజేష్, సౌరి, అసంతీన, రాధిక, సురేష్ కుమార్, రవీందర్ రెడ్డి, రవి, రాజామౌళి, రమేష్, సుజాత, నిర్మల, స్వామి, స్వరూప, పద్మ, శ్రీలత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై సమిష్టి పోరాటాం

## -జనగాంలో సభ్యత్వ నమోదు ప్రారంభం

హైదరాబాద్ వుదయం ప్రతినిధి మార్చి 03.తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు ఏ విధంగానైతే ఏకమై పోరాడారో అదే స్ఫూర్తితో సమస్యలపై పోరాడాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. సోమవారం జనగాం జిల్లా కేంద్రంలోని గబ్బెట గోపాల్ రెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....





తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జర్నలిస్టులకు మేలు కంటే కీడే ఎక్కువగా జరిగిందని, దాదాపు పదేళ్ల అధికారంలో కొనసాగిన గత టీఆర్ ఎస్-బీఆర్ ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. ప్రభుత్వాలతో పాటు కొన్ని జర్నలిస్టు సంఘాలు కూడా జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నాయని, జర్నలిస్టుల పక్షాన ఉండాల్సిన సంఘాలు పాలకుల పక్షాన నిలిచి సమస్యలను పక్కన పెడుతున్నాయని ఆయన విమర్శించారు. ఒక యూనియన్ పదేళ్ల ప్రభుత్వానికి తొత్తుగా మారి జర్నలిస్టుల సమస్యలను పట్టించుకోలేదు. ఇప్పుడు ఇంకొక యూనియన్ ప్రభుత్వానికి కీలుబొమ్మగా మారి జర్నలిస్టులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇలాంటి సంఘాలను నమ్మి జర్నలిస్టులు మోసపోతున్నారని, జర్నలిస్టులు అప్రమత్తంగా ఉండాలని, హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాపితంగా జర్నలిస్టులు సమస్యలపై సమిష్టిగా పోరాటాలకు కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య మాట్లాడుతూ.... జర్నలిస్టులకు గత ప్రభుత్వం చేసిన ద్రోహం దేశంలో మరే ప్రభుత్వం చేయలేదని అన్నారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, రాబోయే రోజుల్లో సమస్యలపై ఫెడరేషన్ పోరాటం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, కార్యదర్శి కొలుపుల వివేకానంద, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడు భాస్కర్, నాయకులు నరేష్, రమేష్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు నిరంతర పర్యవేక్షణ జరగాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి మార్చి 03(వుదయం ప్రతినిధి) ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు నిరంతర పర్యవేక్షణ జరగాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల వద్ద ఇసుక లభ్యత, అనుమతుల కొరకు ప్రతిపాదనలు ఇవ్వడం,నూతన రీచ్‌లు ఏర్పాటు, ఇసుక అక్రమ రవాణా నియంత్రణ వంటి అంశాలపై రెవెన్యూ, మైనింగ్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పటిష్టమైన పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. అనుమతులు లేని ఇసుక తవ్వకాలను కఠినంగా అరికట్టేందుకు రెవెన్యూ, పంచాయతి రాజ్, పోలీస్, రవాణా శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, నిరంతరం తనిఖీలు జరిపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రవాణా జరుగు ప్రాంతాలల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు తనిఖీలు విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో ఉన్న ఇసుక లభ్యతపై ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. నూతన ఇసుక రీచ్‌ల ఏర్పాటుకుప్రతిపాదనలు పంపాలని జిల్లా స్థాయి ఇసుక కమిటి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.అక్రమ రవాణా జరిగినట్లయితే వాహనాలను సీజ్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఇసుక అక్రమంగా తరలిస్తే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, మైనింగ్ ఎడి జయరాజు, టిజిఎండిసి పిఓ శ్రీకాంత్, డిపిఓ నారాయణరావు ,ఇరిగేషన్ ఈ ఈలు పరశురాం, యాదగిరి, తిరుపతి, ఆర్డిఓ రవి, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ కు మెమోరండం అందజేసిన మాజీ ఎం ఎల్ ఎ సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి



కుకునూర్ పల్లి మార్చి 03/వుదయం:ఈరోజు సిద్దిపేట అడిషనల్ కలెక్టర్ ను తూముకుంట నర్సారెడ్డి కలసి మల్లన్న సాగర్ నుండి తపస్పాలి రిజర్వేయర్ లోకి మెదినిపూర్ లకుడారం తపస్ పల్లి అండర్ గ్రౌండ్ కాల్వను త్వరగా కంప్లీట్ చేసి రైతులకు వారి భూములకు త్వరగా డబ్బులు ఇవ్వాలని అలాగే మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుండి మర్పడగ రాంపల్లి దుద్దెడ బందారం అంకిరెడ్డిపల్లి గ్రామాల్లోకి కాల్వలను త్వరగా పూర్తిచేసి కలెక్టర్కు మెమొరండ్ అందజేయడం జరిగింది జరిగింది గత ప్రభుత్వంలో కొన్ని కారణాలవల్ల ఈ గ్రామాలకు కాలువలు ఆగిపోవడం జరిగింది కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చలవతో తొందరగా పూర్తి చేస్తామని మాట్లాడడం జరిగింది తూముకుంట నర్సారెడ్డి గారి వెంట డిసిసిబి ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి మాజీ హౌసింగ్ చైర్మన్ భూమిరెడ్డి కొండపాక మండల పార్టీ అధ్యక్షులు మాజీ సర్పంచ్ వాసర లింగారావు కాంగ్రెస్ నాయకులు బంగారం పరుశరాములు గంగాధర్ కోపరేట్ డైరెక్టర్ బూర్గుల సురేందర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

# రెంటాల కేశవరెడ్డికి డాక్టర్ ప్రధానం...

రాయపర్తి మార్చి 3(వుదయం ప్రతినిధి) :కేంబ్రిడ్జి యూనివర్సిటీ వారు డాక్టరేట్ బిరుదును ఢిల్లీలో జరిగిన కన్వెన్షన్ హాల్ లో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం రాగన్న గూడెం గ్రామానికి చెందిన రెంటల కేశవరెడ్డి కి డాక్టరేట్ ను శనివారం ప్రధానం అందజేశారు. కేం బ్రిడ్జి యూనివర్సిటీ ఎంఏ సోషలిజం పి జి డి సి ఏ పీజీ డిప్లమా ఇన్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం చేసినా రెంటాల కేశవరెడ్డి ఉద్యోగ సంఘాలలో పని చేసినారు.గెజిటెడ్ ఆఫీసర్ సంఘానికి ఉమ్మడి వరంగల్ జిల్లాలో కీలక పాత్ర పోషించారు .ప్రస్తుతంసామాజికకార్యక్రమంలోచురుగ్గాపాల్గొంటున్నారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మందికి చేయూతనిస్తూ పూట గడవని నిరుపేదలకు వలస కార్మికులకు ఎంతోమందికి నిత్యవసర నరుకులు అందిసన్రా హెల్త్ క్యాంపులు పెట్టిసన్రా సేవా కార్యక్రమంలోపాల్గొన్నారు.ఇంటర్నేషనల్ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న



అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్బు ఇంటర్నేషనల్ కరోనా వారియర్ బిరుదు ఇచ్చారు.రాయపర్తి మండలంలో ప్రజలు రాగన్న గూడెం గ్రామస్తులు కొనియాడారు ప్రస్తుతం శ్రీ నగరి అపార్ట్మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా వరల్డ్ నైజ్ కంజు మరు రైట్స్ అండ్ ప్రొటెక్షన్ తెలంగాణ స్టేట్ వైస్ చైర్మన్ గాకొనసాగుతున్నారు .పలువురు మండల నాయకులు అభినందనలు తెలియజేశారు.

# మంత్రి తుమ్మలను కలిసిన మండల కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు వేముల నరేష్....





అన్నపురెడ్డిపల్లి, మార్చి 03 :(వుదయం ప్రతినిధి ) ములకలపల్లి మండలం కమలాపురం సీతారామ ప్రాజెక్టు కెనాల్ లోని పంప్ హౌస్ ప్రారంభోత్సవ సందర్భంగా సోమవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి మండలంలోని సమస్యల గురించి చర్చించడం జరిగింది మండల కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షుడు వేముల నరేష్ పత్రికా సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావును మండలంలోని వ్యవసాయ భూములలో వేసిన వరి పంటలు ఎండి పోతున్నాయని త్వరగా సీతారామ ప్రాజెక్ట్ కాలువ ద్వారా నీళ్లు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా మండలంలోని పలువురు రైతులకు రుణమాఫీ సమస్యపై వివరించడం జరిగిందని, ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లేళ్ళ భరత్, బోయినపల్లి అరవింద్ కుమార్, బోయినపల్లి అనీష్ కుమార్ , బీరపోగు కొండలు తదితరులు పాల్గొన్నారు...

# ముక్రం జాహి మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా రంజాన్ ఉపవాస దీక్షలు



మధిర మార్చి 3 (వుదయం ప్రతినిధి) మధిర పట్టణంలో ఆదివారం ఘనంగా రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమైనట్లు ముస్లిం పెద్దలు ముక్రం జాహి మజీద్ కమిటీ అధ్యక్షుడుమొహమ్మద్ అస్మతుల్లా, ఉపాధ్యక్షుడు షేక్ జహంగీర్ తెలిపారు. ముస్లింలకు అత్యంత పవిత్ర ఖురాన్ గ్రంథం ఆవిర్భవించిన అత్యంత ప్రశస్త్యమైన మాసం రంజాన్ నెల. రంజాన్ నెలవంక దర్శించుకుని ముప్పై రోజులపాటు కఠిన నియమాలతో రంజాన్ ఉపవాస దీక్షలు పాటించే ముస్లిం సోదర సోదరీమణులు ఉదయం 5 గంటల నుండి ఉపవాస దీక్షలో ఉండి పలుమార్లు మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం 6:30 గంటలకు మసీదులలో ఇఫ్తార్ లో పాల్గొని విందు స్వీకరించారు. ఆదివారం మొదలుకొని మరల నెలవంక కనిపించేంతవరకు నెలరోజుల పాటు ఈ ఉపవాస దీక్షలు ఉంటాయని తెలిపారు. సాటివారిని, పేదవారిని, బాధల్లో ఉన్న బంధుమిత్రులను ఆదుకుని అండగా నిలవాలనే దాతృత్వ గుణాన్ని ఉద్బోధించిన అల్లాహ్ బోధనలు ఖురాన్ ద్వారా అందించిన మహమ్మద్ ప్రవక్త మార్గంలో పయనిస్తున్న ముస్లిం సోదర సోదరీమణులు ప్రతి ఒక్కరికి ఈ రంజాన్ నెలలో ఉపవాస దీక్షలు పాటించే శక్తిని ఆరోగ్యాన్ని కారుణ్యమూర్తి అల్లాహ్ ప్రసాదించాలని కోరుకుంటూ ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు

# పీఎం విశ్వకర్మ పథకం జాప్యం పై కేంద్ర సహాయ మంత్రికి ఫిర్యాదు



నల్లబెల్లి,మార్చి 3(వుదయం ప్రతినిధి) పీఎం విశ్వకర్మ పథకం జాప్యంపై కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి మండల బీజేపీ అధ్యక్షుడు తడుక వినయ్ కరీంనగర్ కేంద్రం లో గల ఆయన కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో మండల పరిషత్ అధికారలు,బ్యాంక్ అధికారులు చేస్తున్నా జాప్యం గురించి కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు.కేంద్రమంత్రి జిల్లా కలెక్టర్ కి ఫోన్ చేసి విశ్వకర్మ పథకంలో ఎటువంటి ఆలస్యం చెయ్యకుండా పెడింగ్ లో ఉన్న అప్లికేషన్లు జారీ చేసి లబ్ధిదారులకు అందిచలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఊటుకూరి చిరంజీవి, గుగులోతు తిరుపతి, దికొండ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం.

## పట్టణ అధ్యక్షుడు కోయ్యాడ శ్రీనివాస్.



పరకాల మార్చి 3 (వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసి వారి అభివృద్ధికి కృషి చేస్తుందని పరకాల పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ తెలిపారు. పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం సోమవారం రోజున పరకాల పట్టణంలోని( 6,7 )వార్డులలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆరు గ్యారెంటీ లపై కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ ,రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ, గృహ అవసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, భూమిలేని రైతు కూలీల కోసం ఆత్మీయ భరోసా తదితర కార్యక్రమాలపై కార్యకర్తలకు వివరించారు. దేశంలోనే ఎవరూ చేయని విధంగా రాష్ట్రంలో కులగనన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. దళితుల్లో సమన్యాయం కోసం ఎస్సీ వర్గీకరణ చేసిన మొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రమేనని తెలిపారు. కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సమిష్టిగా కృషిచేసి అభ్యర్థుల విజయానికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒంటేరు రామ్మూర్తి, చిన్నాల గోనాద్ ,బుర్ర రాజమౌళి, నల్లెల కుమార్, పసుల రమేష్, సదానందం గౌడ్, మడికొండ సంపత్ కుమార్, నల్లెల అనిల్ ,దుబాసి వెంకటస్వామి, మడికొండ శ్రీనివాస్, పబ్బ శ్రీనివాస్, సంజీవయ్య, విజయభాస్కర్, లడే శ్రీకాంత్, ఉ దుత సంపత్, సతీష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శాంతిఖని గని లాంగ్ వాల్ ప్రాజెక్టును అడ్డుకోవాలి

## ఓసి ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ పిలుపి



బెల్లంపల్లి, మార్చి3 (వుదయం ప్రతినిధి) రైతులు సమిష్టిగా సింగరేణి యాజమాన్యం చేపట్టనున్న ఓపెన్ కాస్ట్, శాంతిఖని గని లాంగ్ వాల్ ప్రాజెక్ట్ ను అడ్డుకోవాలని కార్మిక సంఘం నాయకులు రాజన్న కోరారు. ఆదివారం బెల్లంపల్లి మండలంలోని పెరిక పల్లి గ్రామంలో లాంగ్ వాల్ ప్రాజెక్టు వ్యతిరేఖ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో నిర్వాసిత రైతులతో మాట్లాడారు. లాంగ్ వాల్ ప్రాజెక్టుకు అడ్డుకునేందుకు స్థానిక నాయకులు జెండాలు, ఎజెండాలను పక్కనపెట్టి ఐక్యంగా ఉద్యమించాలన్నారు. లాంగ్ వాల్ ప్రాజెక్ట్ ఏర్పాటు వల్ల రైతుల జీవనాధారం పూర్తిగా దెబ్బతింటుందన్నారు. శాంతిఖని గని లాంగ్ వాల్ ప్రాజెక్ట్ 700 మీటర్ల నుండి 900 మీటర్ల లోతులో తీయడం వల్ల గని పరిసరాల్లో బోరు బావులు ఇంకిపోయే పరిస్థితి ఉందన్నారు.

లాంగ్ వాల్ ప్రాజెక్ట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు టీ. మణిరామ్ సింగ్ మాట్లాడుతూ... శాంతిఖని గని ఓపెన్ కాస్ట్ చేస్తామని మందమరి జిఎం వెల్లడించి బెల్లంపల్లి కార్మిక ప్రాంతంలో చిచ్చు రేపారన్నారు. రైతుల నుండి వ్యతిరేకత వ్యక్తంగడంతో జిఎం మాట మార్చి శాంతిఖని గని లాంగ్వాజ్ ప్రాజెక్టుగా చేస్తామని చెబుతున్నారని అన్నారు. శాంతిఖని 2 ఓపెన్ కాస్ట్ ప్రతిపాదన సింగరేణి ఆలోచనలో ఉందని చెప్పారు. సింగరేణి ప్రతిపాదించిన శాంతిఖని లాంగ్ వాల్ ప్రాజెక్టు వల్ల పెరిక పల్లి, బట్వాన్ పల్లి, గురిజాల, ఆకనపల్లి, పాత బెల్లంపల్లి, లింగాపూర్ గ్రామాల్లో రైతుల బ్రతుకులు నాశనమవుతాయన్నారు.

రైతులంతా సమిష్టిగా శాంతిఖని గని లాంగ్ వాల్ ప్రాజెక్టు పనులను అడ్డుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కార్మిక పోరాటాల ఐక్యవేదిక నాయకులు గోగర్ల శంకర్, మాజీ సర్పంచ్ సింగతి సత్యనారాయణ, దొరిశెట్టి రాజన్న, ఆకి రెడ్డి శంకర్, చదువుల వెంకటరమణ , సింగతి రవి తో పాటు గ్రామానికి చెందిన నిర్వాసిత గ్రామాలకు చెందిన వంద మంది రైతులు పాల్గొన్నారు.

# మహిళల ఆరోగ్యంపై అవగాహనే లక్ష్యంగా.. 'టుగెదర్ ఫర్ హర్ వెల్ బీయింగ్' ప్రారంభం

## – అపోలో క్రెడిల్, చిల్డ్రన్ హాస్పిటల్, ఎంఎస్డీ భాగస్వామ్యంతో..



హైదరాబాద్, మార్చి 3, 2025: మహిళల ఆరోగ్యంపై అవగాహనే లక్ష్యంగా అపోలో క్రెడిల్, చిల్డ్రన్ హాస్పిటల్, ఎంఎస్డీ ఫార్మాస్యూటికల్స్ సంయుక్తంగా 'టుగెదర్ ఫర్ హర్ వెల్ బీయింగ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించాయి. భారత్‌లో 2022లో 1.5 లక్షలకు పైగా కొత్త హెచ్పీవీ సంబంధిత క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. సర్వైకల్ క్యాన్సర్ భారతీయ మహిళల్లో రెండో అత్యధిక క్యాన్సర్ కారణంగా నిలిచింది. ఈ అనారోగ్య సమస్యల నేపథ్యంలో బంజారా హిల్స్ లోని తాజ్ డెక్కన్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ (జూబ్లీ హిల్స్) సీనియర్ కన్సల్టెంట్, ప్రసూతి, గైనకాలజీ డాక్టర్ మహితా రెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళా తన ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గైనకాలజిస్టును కలవడం, హెచ్పీవీ వ్యాక్సిన్ వంటి టీకాల సమాచారం తెలుసుకోవడం, స్క్రీనింగ్, నిరోధక చర్యలు పాటించడం ద్వారా మహిళలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ఇది కేవలం చికిత్స కాదని, భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉండేందుకు ముందుగా తీసుకోవాల్సిన చర్యల కూడా అన్నారు. ఈ సందర్భంగా అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ (కొండాపూర్) సీనియర్ కన్సల్టెంట్, ప్రసూతి, గైనకాలజీ డాక్టర్ పద్మిని శిల్ప మాట్లాడుతూ ప్రతి మహిళ తనను తాను రక్షించుకునే శక్తిని కలిగి ఉందన్నారు. ముఖ్యంగా హెచ్పీవీ వ్యాక్సినేషన్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. దీనివల్ల హెచ్పీవీ సంబంధిత వ్యాధులు, గర్భాశయ, గర్భాశయ క్యాన్సర్ వంటి వాటిని నివారించవచ్చన్నారు. గైనకాలజిస్టును ప్రతి ఏడాది కలవడం, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం చేయాలన్నారు. లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ముందుగానే చర్యలు తీసుకోవడం ఉత్తమం అన్నారు. ఈ చిన్నపాటి చర్యలు మహిళల ఆరోగ్యాన్ని గొప్పగా రక్షించగలవన్నారు. అందుకే ప్రతి మహిళా ముందడుగు వేయాలన్నారు. ఆరోగ్య భద్రత కోసం, భవిష్యత్తును సంరక్షించుకునేందుకు వైద్యులను సంప్రదించాలని కోరారు.

ఈ సందర్భంగా అపోలో క్రెడిల్ %డ% చిల్డ్రన్స్ హాస్పిటల్ (కొండాపూర్) సీనియర్ కన్సల్టెంట్ ప్రసూతి, గైనకాలజీ, లాప్రోస్కోపీ %డ% రోబోటిక్ సర్జన్ డాక్టర్ జాస్మిన్ రాథ్ మాట్లాడుతూ ఈ రోజుల్లో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం చాలా సాధారణం అన్నారు. కానీ శరీరంలో మార్పులను గమనించడం, నివారణా చర్యలు తెలుసుకోవడం, ఏటా వైద్య పరీక్షలు చేయించుకోవడం, స్క్రీనింగ్‌లో పాల్గొనడం ద్వారా మన ఆరోగ్యంపై గొప్ప ప్రభావం చూపించగలం అన్నారు. ఈరోజే వైద్యుడిని సంప్రదించడం ఉత్తమమైన నిర్ణయం అవుతుందన్నారు.

గైనకాలజిస్టుల సిఫారసులు..

12 నుంచి 16 ఏళ్ల మధ్య వయస్సు వచ్చిన అమ్మాయిలు గైనకాలజిస్టును సందర్శించాలి. నెలసరి ప్రారంభం అయినా, కాకపోయినా ప్రతి సంవత్సరం వైద్యుడి వద్ద తనిఖీలు చేయించుకోవడం మంచిది. ప్రతి మహిళా తనకు అవసరమైన టీకాల వివరాలు తెలుసుకోవాలి. తల్లి అయిన వారు తమ పిల్లల టీకా షెడ్యూల్‌ను గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. హాని కలిగించే వ్యాధుల బారిన పడక ముందే రక్షణ తీసుకోవడం ఉత్తమం. ముఖ్యంగా హెచ్పీవీ వ్యాక్సిన్, ఎంఎంఆర్, హెపటైటిస్ బీ, వరిసెల్లా వంటి టీకాలు తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి రక్షణ పొందవచ్చు. అవసరమైన ఆరోగ్య పరీక్షల గురించి డాక్టర్‌తో మాట్లాడడం ద్వారా వ్యాధులను ముందుగానే గుర్తించి తగిన చికిత్స పొందవచ్చు. పాప్ స్మియర్, బ్రెస్ట్ స్క్రీనింగ్ వంటి పద్ధతుల ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధులను తొందరగా గుర్తించి నివారించవచ్చు. ఏదైనా అనారోగ్య సంకేతాలు కనిపించిన వెంటనే వైద్య సలహా తీసుకోవడం ద్వారా పెద్ద సమస్యలు రాకుండా నిరోధించవచ్చు. ఆహారం, వ్యాయామం, ఒత్తిడి నియంత్రణ, శరీర బరువు నిర్వహణ చాలా ముఖ్యం. హార్మోన్ల సమతుల్యతకు పోషకాహారం కీలకం. ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ డీ, ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ వంటి పోషకాలు గర్భాశయ ఆరోగ్యానికి మద్దతు ఇస్తాయి. ఆకుకూరలు, గింజలు, గింజల నూనెలు, పాల పదార్థాలు లేకుండా చేసే డైట్స్ హార్మోన్ల సమతుల్యతకు సహాయపడతాయి. నిరంతర ఒత్తిడి, తగిన నిద్ర లేకపోవడం వల్ల రుతు చక్రం క్రమబద్ధంగా లేకపోవడం, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చు. ధ్యానం, యోగా, తగిన నిద్ర వంటి జీవన శైలి మార్పులు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

# పార్టీ కోసం కష్టపడ్డ వారికే పదవులు ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి





నారాయణపేట టౌన్ మార్చి 03(వుదయం ప్రతినిధి) కాంగ్రెస్ పార్టీ ని అధికారంలోకి తీసుకోని రావడానికి ఎంతో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకే పదవులు ఇస్తామని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్. చిట్టెం. పర్ణిక రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి అధ్యక్షత న జిల్లా పంచాయతీ రాజ్ సంఘటన్ రివ్యూ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పంచాయతీ రాజ్ సంఘటన్ అధ్యక్షులు రాచమల్లు సిద్దేశ్వర్, నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్. చిట్టెం. పర్ణిక రెడ్డి లు హాజరై మాట్లాడారు. గత ప్రజా వ్యతిరేక పాలన లో పార్టీ పరంగా కొట్లాడి పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరిని గుర్తించాలని కొత్తగా వచ్చిన టిపిసిసి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ సూచించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ద్వారా నేరుగా గ్రామ పంచాయతీలకు నిధులు అందించాలని భావించి అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ఐదు అంచెల విధానాన్ని దేశమంతట ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. కానీ గత పదేళ్లలో రాష్ట్రంలోని బీఆర్ఎస్, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించకుండా గ్రామ పంచాయతీలు నిర్లక్ష్యానికి గురయ్యాయి అన్నారు. టిఆర్ఎస్ బిజెపి పార్టీలు ఇటు రాష్ట్రాన్ని అటు దేశాన్ని అప్పుల కుప్పగా మార్చరన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామ పంచాయతీ ల అభివృద్ధికి కృషి చేస్తున్నారని,ఆరు గ్యారెంటీ పథకాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపయోగపడే విధంగా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కష్టపడ్డ వారికే టికెట్లు ఇచ్చి వారిని గెలిపించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, మద్దూర్ పిఏసిఎస్ చైర్మన్ జి నరసింహ,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రసన్నారెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు శివకుమార్, కిసాన్ సెల్ అధ్యక్షులు ఎండి గౌస్, వివిధ మండలాల అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎండి సలీం,జి. సుధాకర్ నరహరి,కోట్ల రవీందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి,యూసఫ్ తాజ్, జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్షులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో గురుకుల విద్యాలయాలు విజ్ఞాన భాండాగారాలు.

## పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి.



పరకాల మార్చి 3 (వుదయం ప్రతినిధి): ఆత్మకూరు మండలం గుడేప్పడ్ లోని పెద్దాపూర్ మహాత్మ జ్యోతిరావు పూలే వసతి గృహం నందు అన్యువల్ డే సెలబ్రేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి హాజరై అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి, చిన్నారులు చేసినటువంటి నృత్యాలను తిలకించారు. పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యుత్ లైట్లు, వాటర్ మోటర్ తదితర సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...తల్లిదండ్రులకు ఆస్తులు పిల్లలే అని తల్లిదండ్రుల ఆశయాలకు పునాదులు మీరే అని వారి ఆశయాలకనుగుణంగా చదువుకొని నెరవేర్చే బాధ్యత మీదే అని అన్నారు.గురుకుల విద్యాలయాలు విజ్ఞాన భాండాగారాలు తల్లిదండ్రులను మరిపించేలా ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయం అని తెలిపారు.తల్లిదండ్రుల కన్నా గురువులే మిన్న అని విద్యార్థులకు సూచించారు.విద్యార్థినిలు జాగ్రత్త గా ఉండాల్సిన బాధ్యత ఉందని,పట్టుదలతో ఉపాధ్యాయుల సూచనలతో ముందుకు పోతూ మంచి భవిష్యత్తును ఎంచుకోవాల్సిన దశ అని అన్నారు.మహిళా సాధికారితకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదని,అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని,మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో పోటీపడి ఉన్నత స్థాయిలో ఉండేలా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ప్రభుత్వ గురుకుల విద్యాలయాలలో చదివి విద్యార్థిలకు ఆరోగ్యం ముఖ్యమని ఆరోగ్యంగా ఉంటే, చదువుపై దృష్టి పెడతారని మంచి ఆహారం అందించాలని మెస్ ఛార్జీలు పెంచడం జరిగిందని అన్నారు. ప్రైవేటు భవనాలలో ఉన్న గురుకుల పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరకాలలో మంజూరి ఇచ్చారని త్వరలో పరకాలలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలో మీరు చదువుకొని ఉన్నత ప్రమాణాలతో విద్య పొందబోతున్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ సంక్షేమ గురుకుల పాఠశాలలకు పెద్ద పీట వేస్తుందని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు.అన్ని వర్గాల పిల్లలు ఒకే దగ్గర ..ఒక కుటుంబంలగా చదువుకునేల ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఉండబోతున్నాయి అని,కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు.గురుకుల పాఠశాలాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని,పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తెలియజేయాలి అన్నారు.

# జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి...

## జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్







జగిత్యాల మార్చి 03 (వుదయం ప్రతినిధి) సోమవారం జిల్లా కలెక్టరేట్ లోనీ సమావేశ మందిరంలో చీఫ్ సూపరిండెంట్ డిపార్ట్మెంట్ ఆఫీసర్స్ సిట్టింగ్ స్క్వాడ్ ఫ్లయింగ్ స్పాడ్ అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణ పై అదనపు కలెక్టర్ బిఎస్ లత తో కలసి సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుంచి మార్చి 25 వరకు ఇంటర్ పరీక్షల ఉదయం 9 గంటల నుంచి 12 మధ్యాహ్నం గంటల వరకు నిర్వహణకు జిల్లాలో కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలన్నారు ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం 28 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశామని అధికారులు తెలిపారు పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్స్ గాని స్మార్ట్ వాచ్లు అనుమతి లేదన్నారు అన్ని పరీక్ష కేంద్రాలలో శానిటేషన్ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు ప్రతి పరీక్ష కేంద్రాలో సీసీ టీవీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించబడతాయన్నారు విద్యార్థులకు పరీక్ష హాల్స్ లో త్రాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు ప్రతి పరీక్ష కేంద్రంలో ఫ్యాన్స్ లైటింగ్ వంటి ఏర్పాటు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారులకు తెలిపారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బిఎస్ లత జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి నారాయణ సంబంధిత ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రొసీడింగ్ ఒక చోట మీ సేవ కేంద్రం మరో చోట

బెల్లంపల్లి, మార్చి3 (వుదయం ప్రతినిధి)ప్రజలకు సులభంగా, వేగంగా సేవలందుకోండంటూ\గ్రామీణ ప్రాంతాల్లో పారదర్శక పాలన అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 'మీ సేవ' కేంద్రాలు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. తాండూరు మండలానికి ప్రభుత్వం ఏడూ మీ సేవ కేంద్రాలు మంజూరు చేయగా కొన్ని మాత్రమే నిబంధనలకు అనుగుంగా ఉన్నాయి. మరికొన్ని స్థానికంగా లేక నిబంధనలకు విరుద్ధంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసుకోగా ప్రజలు ధ్రువీకరణ పత్రాల దరఖాస్తు, వివిధ రెవిన్యూ సేవల కోరకు మళ్ళీ ఐబీ బాట పడుతున్నారు. దింతో ప్రజలు దూర వ్యయ ప్రయసాలకు గురై ఆర్థికంగా నష్టపోతున్నారు. ఫలితంగా మండల కేంద్రానికి దూరంగా ఉన్న ప్రజలు 'మీ సేవ'కో దండం అంటు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మీ సేవ ల ఏర్పాటుకు ఎక్కడ ప్రొసీడింగ్ ఇచ్చిందో అక్కడే ఉండాలని మండల ప్రజావాణిలో పలుమార్లు పిర్యాదు చేసిన ఏ అధికారి పట్టించుకున్న పాపాన పోలేదు. మాకేం కాదు మమ్మల్ని ఎవ్వరు మార్చలేరు ఎక్కడి పోమని కొందరు మీ సేవ నిర్వహుకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబందిత మండల జిల్లా అధికారులు స్పందించి ఎక్కడి మీ సేవలు అక్కడే ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఫిర్యాదులు స్వీకరించిన మెదక్ డిఎస్పీ



మెదక్, ( 2025 మార్చ్ 03 వుదయం ప్రతినిధి : మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్.పి. డి.ఉదయ్ కుమార్ రెడ్డి అధెశాలమేరకు మెదక్ డిఎస్పీ ప్రసన్న కువమార్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల యొక్క ఎస్ఐ, సిఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా ఎస్.పి. డి.ఉదయ్ కుమార్ రెడ్డి తెలియజేశారు.

ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలియజేశారు.

# ఘనంగా పిజేపిఎస్ 8 వ వార్షికోత్సవం.

## ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక.
## నూతన అధ్యక్షునిగా కోదాటి గోపాలకృష్ణ.



నర్సంపేట వుదయం ప్రతినిధి మార్చి 3.పాకాల పత్రిక విలేకరుల పరస్పర సహకార సంఘం 8 వ వార్షికోత్సవం నర్సంపేట పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్ లో సంఘం అధ్యక్షుడు కారుపోతుల విజయ్ కుమార్ గౌడ్ అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. నర్సంపేట ప్రింట్ మీడియా ఆధ్వర్యంలో జర్నలిస్టుల అభివృద్దే లక్ష్యంగా గత 8 సంవత్సరాలు జర్నలిస్టుల పరపతి సహకార సంఘం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఒకరికొకరు పరస్పరం సహకారం చేసుకుంటూ ముందుపోవాలని ఈ సందర్భంగా సూచించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఏకగ్రీవంగా నూతన కార్యవర్గం ఎన్నిక

పాకాల పత్రిక విలేకరుల పరస్పర సహకార సంఘం నూతన కమిటీని ఎన్నికల అధికారులుగా పోడేటి అశోక్, కాసర్ల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా కోదాటి గోపాలకృష్ణ, కార్యదర్శిగా రడం శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులుగా పాలంచ సత్యనారాయణ, కోశాధికారిగా సామల అనిల్ కుమార్, సహాయ కార్యదర్శిగా కందుల శ్రీనివాస్ గౌడ్, గౌరవ అధ్యక్షులుగా వేములపల్లి వెంకటరామయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పిట్టల కుమారస్వామి, శీలం రమేష్, వడ్లకొండ పవిత్రన్ గౌడ్, తాళ్లపల్లి చంద్రమౌళి గౌడ్, కర్ల వెంకటరెడ్డి, మచ్చిక రమేష్ గౌడ్, పెండెం శివానంద్,జూలూరి హరిప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఆవిష్కరణలతోనే విద్యార్థుల్లో సృజనాత్మకత

## అలరించిన విద్యార్థుల విజ్ఞాన ప్రదర్శనలు



ధర్మపురి,మార్చి 04(వుదయం విలేకరి):నూతన ఆవిష్కరణలతోనే విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కేశిపెద్ది స్వప్న ప్రియ అన్నారు.సోమవారం మండలంలోని దోనూర్ గ్రామ మండల పరిషత్ పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శన వేడుకలు నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులచే తయారు చేయబడిన చిట్టి పొట్టి విజ్ఞాన ప్రదర్శనలు వీక్షకులను అలరించాయి. విద్యార్థులచే తయారు చేయబడ్డ పర్యావరణ, రోడ్డు భద్రత, మూఢనమ్మకాలు, పౌష్టికాహారం మొదలైన అంశాలపై ప్రదర్శనలు విద్యార్థులు ప్రదర్శించగా విద్యార్థి తల్లిదండ్రులను, గ్రామస్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కేశి పెద్ది స్వప్నప్రియ, ఉపాధ్యాయులు కాశెట్టి రమేష్ , కళ్యాడపు రజిత, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ ఆర్ ఎస్ పై సమీక్ష సమావేశం




మెదక్, ( 2025 మార్చ్ 03 వుదయం ప్రతినిధి : మెదక్ జిల్లాలోని మున్సిపల్, గ్రామ పంచాయతీ ప్రాంతాలలో దరఖాస్తు చేసుకున్న ఎల్ఆర్ఎస్ లను క్షేత్ర స్థాయిలో ప్రత్యేక బృందాలు పరిశీలించి, ఎటువంటి సమస్యలు లేని దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి. నీటిపారుదల శాఖ ఎఫ్ టి ఎల్, రెవెన్యూ ప్రభుత్వ భూమి చెరువు శికం, దేవాదాయ నాల మొదలైన వాటిని తనిఖీ చేయాలి, డాక్యుమెంటేషన్ తయారీ పరంగా మున్సిపల్ పంచాయతీ సిబ్బంది తనిఖీ చేయాలి... ఉమ్మడి సర్వే బృందం దరఖాస్తుదారులకు ముందుగానే సమాచారం ఇచ్చి, వివరాలు, వాస్తవాలను తెలుసుకోవడానికి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ భుజంగరావు, మెదక్ ఆర్డీవో రమాదేవి, డిపిఓ యాదయ్య, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్, అధికారులు ఎం బి ఓ, సంబంధిత సిబ్బంది ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

# మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా శనిగారపు అనిత నియామకం

## – నియామక పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి



హనుమకొండ, మార్చి 03(వుదయం జిల్లా ప్రతినిధి) : వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా శనిగారపు అనిత నియమిస్తూ సోమవారం రోజున హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా నియమిస్తూ తనకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్ నాగరాజు లకు శనిగారపు అనిత ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ మహిళల అభ్యున్నతకు నిరంతరం పాటుపడతానని అనిత తెలిపారు.... ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు

# ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమం పగడ్బందీగా అమలు : కలెక్టర్



మెదక్, ( 2025 మార్చ్ 03 వుదయం ప్రతినిధి : సోమవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్వేర్ రూపొందించిన బెంగుళూరు బృందంతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభుత్వ పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో బెంగుళూరు బృందం పర్యటించి ఈ కార్యక్రమంలో సాఫ్ట్వేర్ లో సమస్యలను నివృత్తికి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంగ్లీష్ ,తెలుగు సబ్జెక్టులలో నెలకొన్న సమస్యల గురించి కలెక్టర్ సాఫ్ట్వేర్ రూపొందించిన బృందానికి వివరించగా సమస్యలను నివృత్తి చేసి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాఫ్ట్వేర్ రూపొందించిన బృందం సభ్యులు అనంతి ఆకాష్, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

# టీడబ్ల్యూజేఎఫ్ సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

## –రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పిలుపు



హైదరాబాద్ వుదయం ప్రతినిధి మార్చి 03. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలపై పోరాడే ఏకైక సంఘం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. రాబోయే రోజుల్లో జర్నలిస్టుల సమస్యలపై బలమైన పోరాటాలు నిర్వహించేందుకు ఫెడరేషన్ ను బలోపేతం చేయాలని అన్నారు. సోమవారం హన్మకొండ జిల్లా కేంద్రంలోనిలో ఆ జిల్లా కమిటీ చేపట్టిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయనతో పాటు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, బండి విజయ్ కుమార్, వల్లాల జగన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలపై పోరాటాలు చేసేందుకు ఫెడరేషన్ నాయకత్వం మరింత బలోపేతం కావాలని సూచించారు. జర్నలిస్టుల పరిస్థితులు దయనీయంగా మారుతున్నాయని, హక్కులు హరింపబడుతున్నాయని, పాలకులు ఏ ఒక్క సమస్యను పరిష్కరించకుండా దాటవేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండు సార్లు అధికారంలో కొనసాగిన గత ప్రభుత్వాలు జర్నలిస్టుల సమస్యలను పూర్తిగా విస్మరించి తీరని అన్యాయం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు,హెల్త్ కార్డులు ఇవ్వలేక పోయిందని, జీవో 239 సమీక్ష పేరుతో కమిటీ వేసి కాలయాపన చేస్తుందని విమర్శించారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, పెన్షన్ స్కీం, హెల్త్ కార్డులు, దాడుల నివారణకు ప్రత్యేక కమిటీలు, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తదితర డిమాండ్ల సాధనకై ఫెడరేషన్ ఆధ్వర్యంలో బలమైన ఉద్యమాలు చేయాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాపితంగా ఫెడరేషన్ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమైందని, జర్నలిస్టులంతా సభ్యులుగా చేరాలని ఆయన పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలో టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ ను మరింత బలోపేతం చేయాలని మామిడి సోమయ్య కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య మాట్లాడుతూ,జర్నలిస్టులకు గత ప్రభుత్వం చేసిన ద్రోహం దేశంలో మరే ప్రభుత్వం చేయలేదని అన్నారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, రాబోయే రోజుల్లో సమస్యలపై ఫెడరేషన్ పోరాటం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు కొలుపుల వివేకానంద, బొక్క దయాసాగర్, జిల్లా అధ్యక్ష,కార్యదర్శుల టీవీ రాజు,గోపాల్, నాయకులు ఐలయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పంట పొలాలకు చివరి ఆయకట్టు వరకు నీరు అందించే విధంగా చర్యలు : కలెక్టర్



మెదక్, ( 2025 మార్చ్ 03 వుదయం ప్రతినిధి : సోమవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మెదక్ మాచారం, రాంపూర్ ఏరియాలో గల వనదుర్గ ప్రాజెక్ట్ నుండి పొలాలకు సాగునీరు అందించే ఎం ఎన్ కెనాల్ కాలువను, దానికి సంబంధించిన పిల్లకాలుల ద్వారా పంట పొలాలకు అందించే సాగునీరును సంబంధిత ఇరిగేషన్ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ ప్రాజెక్టు పరిధిలో పంటలు ఎండిపోకుండా ఉండేందుకు నీటి సరఫరా సమర్థవంతంగా అమలు చేసేందుకు నీటి పారుదల శాఖాధికారులు చర్యలు చేపట్టారని చెప్పారు. ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వల ఆధారంగా సాగు నీటిని పొదుపుగా వాడుకునేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నారని వివరించారు. సింగూర్ ప్రాజెక్ట్ నుండి 4.06 టీ.ఎం.సీ సాగునీరు వనదుర్గ ప్రాజెక్ట్ కు అలికేషన్ ఉన్నదని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో 21 వేల 625 ఎకరాలకు సాగు నీరు సరఫరా చేయాల్సి ఉందని వెల్లడించారు. జనవరి 15 నుండి ఏప్రిల్-చివరి వరకు సాగునీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

ఎలాంటి అంతరాయం లేకుండా పటిష్ట ప్రణాళికతో పది విడుదలలో సాగునీరు సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 4 విడతల్లో సరఫరా చేయడం జరిగిందని చెప్పారు. చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించే బాధ్యత నిర్వహించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈ.ఈ శ్రీనివాసరావు, ఏఈ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ జిల్లా ప్రజల దశాబ్దాల కల మామునూరు ఎయిర్ పోర్టు.

## పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి.




పరకాల మార్చి 3 (వుదయం ప్రతినిధి): హనుమకొండలోని డిసిసి భవన్ లో ఏర్పాటుచేసిన పత్రిక,మీడియా మిత్రుల సమావేశంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...మరికొద్ది రోజుల్లోనే వరంగల్ లో విమాన రాకపోకలు జరగనున్నాయని, విమాన రాకపోకలు ప్రారంభమైతే వరంగల్ కు మరిన్ని పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. ఇప్పటికే కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో పరిశ్రమలు నడుస్తున్నాయని, కేంద్ర ప్రభుత్వం మామునూరు ఎయిర్పోర్ట్ కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మరిన్ని పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. 150 కిలోమీటర్ల పరిధిలో నిర్మించకూడదని షరతులు పెట్టిన జీఎంఆర్ సంస్థను ను ఒప్పించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్ ఓ సి తెప్పించారని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్లనే 10 సంవత్సరాలుగా మామునూరు ఎయిర్పోర్ట్ వెనుకబడిందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో మరెన్నో మార్పులు వస్తాయని తెలిపారు.

# పవిత్ర రంజాన్ కు ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలి



మెదక్, ( 2025 మార్చ్ 03 వుదయం ప్రతినిధి : సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఎస్పీ ప్రసన్నకుమార్,తో కలిసి రంజాన్ మాసం పండుగ నిర్వహణ ఏర్పాట్ల పై సంబంధిత శాఖల అధికారులు, శాంతి కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్యారోగ్య, ఆర్%డ%బీ, విద్యుత్, పౌరసరఫరాలు, తదితర శాఖల అధికారులతో పాటు పలువురు మత పెద్దలు పాల్గొని ఏర్పాట్ల విషయమై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేసి ఉంచాలన్నారు. ఈద్గాల వద్ద తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. తాగునీరు అవసరమైన చోట్ల అదనంగా నీటి ట్యాంకర్ ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. మసీదుల వద్ద చెత్త డబ్బాలను ఖచ్చితంగా ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా పరిశుభ్రతా చర్యలు చేపట్టాలన్నారు. అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలన్నారు. అలాగే దుకాణాల వద్ద ఆహార భద్రత నియమనిబంధనలను తప్పకుండా అనుసరించాలని, వివిధ పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, స్పష్టం చేశారు.ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. మతపెద్దలు సూచించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ లైన్ నంబర్ ను ఏర్పాటు చేయాలని, తద్వారా ఏమైనా సమస్యలు ఏర్పడినట్లయితే ఆ నంబర్ లో సంప్రదించాలని కోరారు. ఈ సమన్వయ సమావేశంలో ఆర్డీఓలు మెదక్ ఆర్డిఓ రమాదేవి మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జమ్మల నాయక్ మునిసిపల్ కమిషనర్స్, సంబంధిత ఇతర శాఖల అధికారులు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.





# బిజినెస్





## చిక్కుల్లో సెబి మాజీ చీఫ్ మాధబి

### ఎఫ్ఐఆర్ నమోదుకు ప్రత్యేక కోర్టు ఆదేశం

ముంబయి: సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) మాజీ చైర్‌పర్సన్ మాధబి పురీబచ్ మరోమారు చిక్కుల్లో పడ్డారు. స్టాక్ మార్కెట్ అవకతవకలు, నియంత్రణల ఉల్లంఘనకు సంబంధించిన ఆరోపణలపై ఆమెతో సహా ఐదుగురు అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అవినీతి నిరోధక బ్యూరో (ఎసిబి)ను ముంబయిలోని ప్రత్యేక న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు పిటిఐ వార్తా సంస్థ ఆదివారం ఒక కథనం ప్రచురించింది. 'స్టాక్ మార్కెట్ మోసం, ఉల్లంఘన విషయంలో ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. న్యాయమైన, నిష్పాక్షిక దర్యాప్తు అవసరం' అని ఎసిబి ప్రత్యేక కోర్టు జడ్జి శశికాంత్ ఏక్‌నాథరావు బంగర్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ దర్యాప్తును కోర్టు పర్యవేక్షిస్తుందని, 30 రోజుల్లోగా స్టేటస్ రిపోర్టు ఇవ్వాలని ఆదేశాల్లో స్పష్టం చేశారు. సెబీలోని జరిగిన ఆర్థిక మోసాలు, నియమాల ఉల్లంఘన, అవినీతి నేరాలపై దర్యాప్తు చేయాలని ఒక పాత్రికేయుడు కోర్టును ఆశ్రయించగా కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది.

## ఓలా ఆర్థిక సవాళ్లు ఉద్యోగాల కోతలు






బిజినెస్ : ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ మరోసారి ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమవుతోంది. సంస్థలో ప్రస్తుతానికి పనిచేస్తున్న సుమారు 1,000 మంది ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించే యోచనలో ఉందని సమాచారం. ఆర్థిక నష్టాలను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. కంపెనీ ఖర్చులను తగ్గిస్తూ, నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరచేందుకు ఓలా చర్యలు తీసుకుంటోందని మీడియా కథనాలు సూచిస్తున్నాయి. ప్రొక్యూర్‌మెంట్, కస్టమర్ రిలేషన్స్, ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వంటి విభాగాల్లో ఈ తొలగింపులు జరిగే అవకాశముందని తెలుస్తోంది. ఈ వార్తలు వెలువడిన వెంటనే ఓలా ఎలక్ట్రిక్ షేర్లు 5 శాతం తగ్గాయని సమాచారం. కేవలం ఐదునెలల్లోనే ఇది రెండోసారి ఉద్యోగాల కోతగా మారింది..! గతేడాది నవంబర్‌లో సుమారు 500 మంది ఉద్యోగులను తొలగించిన ఓలా, ఇప్పుడు మరింత ఎక్కువ మంది ఉద్యోగులపై వేటు వేయాలని నిర్ణయించుకుంది.

ఆర్థిక ఇబ్బందులు

ఓలా ఎలక్ట్రిక్ గణనీయమైన ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటోంది. డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ నష్టాలు 50 శాతం పెరిగాయి. ఆగస్టు 2023 లో బలమైన ఐపీఓ అరంగేట్రం తరువాత కంపెనీ స్టాక్ గరిష్ట స్థాయి నుండి 60 శాతానికి పైగా పడిపోయింది. ఉద్యోగుల తొలగింపు వార్తలు కంపెనీ షేరును మరింత ప్రభావితం చేశాయి. ఇది 5 శాతం పడిపోయి 52 వారాల కనిష్టాన్ని తాకింది.

వ్యూహాత్మక పునర్నిర్మాణం

పునర్నిర్మాణ ప్రయత్నాలలో భాగంగా ఓలా ఎలక్ట్రిక్ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, ఖర్చులను తగ్గించడానికి కస్టమర్ అనుభవాన్ని పెంచడానికి తన కస్టమర్ సర్వీస్ కార్యకలాపాలలో కొన్ని విభాగాలను ఆటోమేట్ చేస్తోంది. ఖర్చులను తగ్గించుకోవడానికి కంపెనీ తన లాజిస్టిక్స్, డెలివరీ వ్యూహాలను పునరుద్ధరిస్తోంది. ఓలా షోరూమ్‌లు, సర్వీస్ సెంటర్లలో ఫ్రంట్ ఎండ్ సేల్స్, సర్వీస్, వేర్‌హౌస్ సిబ్బంది తొలగింపుతో ప్రభావితమయ్యారు.

మార్కెట్ స్థానం.. పోటీ

ఒకప్పుడు భారతదేశంలో అగ్రగామి ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థగా ఉన్న ఓలా ఎలక్ట్రిక్ ఇప్పుడు ప్రత్యర్థుల చేతిలో పరాజయం పాలవుతోంది. డిసెంబర్ లో బజాజ్ ఆటో లిమిటెడ్ ఓలా ఎలక్ట్రిక్ ను అధిగమించి అత్యధికంగా అమ్ముడైన ఎలక్ట్రిక్ స్కూటర్ బ్రాండ్ గా టీవీఎస్ మోటార్ కంపెనీ తరువాత మూడవ స్థానానికి చేరుకుంది. వాహన రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వ డేటా ప్రకారం 2023 చివరి నాటికి దేశంలోని టాప్ 10 ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్లలో తొమ్మిదింటిలో ఓలా ఎలక్ట్రిక్ తన నాయకత్వ స్థానాన్ని కోల్పోయింది.

భవిష్యత్తు కోసం ప్రయత్నాలు

సవాళ్లు ఉన్నప్పటికీ, ఓలా ఎలక్ట్రిక్ తన మార్కెట్ ఉనికిని బలోపేతం చేసుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. తన పరిధిని విస్తరించడానికి, సర్వీస్ నాణ్యత గురించి వినియోగదారుల ఫిర్యాదులను పరిష్కరించడానికి కంపెనీ ఇటీవల 2023 డిసెంబర్‌లో 3,200 కొత్త అవుట్‌లెట్లను ప్రారంభించింది. ఏదేమైనా అధిక మొత్తంలో కస్టమర్ ఫిర్యాదులు, ఎబిటాను చేరుకోవడానికి దాని అమ్మకాల లక్ష్యాలను సాధించాల్సిన అవసరంతో సహా కంపెనీ గట్టి అడ్డంకులను ఎదుర్కొంటోంది.

## జిఎస్‌టి ఖజానా గలగలా..




న్యూఢిల్లీ : వస్తు సేవల పన్నుల (జిఎస్‌టి) వసూళ్లతో ప్రభుత్వ ఖజానా గలగలా మంటోంది.

ంఅధిక పన్ను రేట్లు కేంద్ర ఆదాయాన్ని పెంచేస్తోంది. ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో జిఎస్‌టి వసూళ్లు 9.1 శాతం పెరిగి రూ.1.83,646 కోట్లకు చేరడమే ఇందుకు నిదర్శనం. 2024 ఇదే నెలలో రూ.1,62,758 కోట్ల పన్నులు వసూళ్లయ్యాయి. గడిచిన నెల జిఎస్‌టి ఆదాయంలో దేశీయ రెవెన్యూ వసూళ్లు 10.2 శాతం మేర పెరిగి రూ.1.42 లక్షల కోట్లకు చేరాయి. దిగుమతుల ద్వారా వచ్చే ఆదాయం 5.4 శాతం పెరిగి రూ.41,702 కోట్లుగా చోటు చేసుకుంది. మొత్తం వసూళ్లలో సెంట్రల్ జిఎస్‌టి నుంచి రూ.35,204 కోట్లు, స్టేట్ జిఎస్‌టి నుంచి రూ.43,704 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి నుంచి రూ.90,870 కోట్ల చొప్పున వసూళ్లయ్యాయి. సెస్సుల రూపంలో మరో రూ.13,868 కోట్లు రాబడి వచ్చిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ శనివారం వెల్లడించిన గణంకాల్లో తెలిపింది. ఈ ఏడాది జనవరిలో అత్యధికంగా రూ.1.96 లక్షల కోట్లు వసూళ్లయిన విషయం తెలిసిందే.

తెలుగు రాష్ట్రాల్లోనూ వృద్ధి

గడిచిన నెలలో తెలంగాణ రాష్ట్రంలో జిఎస్‌టి వసూళ్లు 1 శాతం పెరిగి రూ.5,280 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే నెలలో రూ.5,211 కోట్ల జిఎస్‌టి వసూళ్లయ్యింది. ఇదే నెలలో ఆంధ్రప్రదేశ్‌లో రూ.3,678 కోట్ల పన్నులు నమోదు కాగా.. గడిచిన ఫిబ్రవరిలో 4 శాతం పెరిగి రూ.3,817 కోట్లకు చేరాయి.

## చిన్న షేర్ల విలవిల రెండంకెల పతనం



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస పతనంతో చిన్న షేర్లు విలవిలలాడుతున్నాయి. గడిచిన ఒక్క నెలలోనే రెండంకెల స్థాయిలో నష్టాలు చవి చూశాయి. అమెరికా టారీఫ్ బెంబేలు, ఎఫ్ఐఐలు తరలిపోవడంతో మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి..

చిన్న షేర్లను చతికిల పడేలా చేస్తోన్నాయి. ఫిబ్రవరి నెలలో మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 10.4 శాతం, 13.7 శాతం చొప్పున రెండంకెల స్థాయిలో నష్టపోవడంతో మదుపర్లు తీవ్ర ఆందోళనకు గురైతున్నారు. గడిచిన ఐదేళ్లలో ఒక్క నెలలో ఇంత భారీ నష్టం ఇదే తొలిసారి. కరోనా దెబ్బతో 2020 మార్చిలో స్మాల్ క్యాప్ సూచీ 30 శాతం నష్టపోయింది.

ఫిబ్రవరి 28తో ముగిసిన వారంలో బిఎస్ఇ లార్జ్ క్యాప్ సూచీ 3.4 శాతం, మిడ్‌క్యాప్ 4.4 శాతం, స్మాల్ క్యాప్ 6 శాతం చొప్పున నష్టపోయాయి. తక్కువ విలువ కలిగిన మిడ్, స్మాల్ క్యాప్ షేర్లలో అత్యధికంగా సాధారణ రిటైల్ మదుపర్లు ఎన్నో ఆశలతో పెట్టిన పెట్టుబడులు ఆవిరి అయిపోతున్నాయి. ఇటీవల నెలన్నర రోజులుగా వరుసగా పడిపోతున్న స్టాక్ మార్కెట్లు ఏ దశలోనూ కోలుకోకపోవడంతో ఇన్వెస్టర్లలో తీవ్ర నిరాశ నెలకొంది. 282 స్మాల్ స్టాక్స్ ఏడాది కనిష్టానికి పడిపోయాయి. గడిచిన వారంలో బిఎస్ఇ సెన్సెక్స్ 2,112.96 పాయింట్లు లేదా 2.80 శాతం పతనమై 73,198 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 671 పాయింట్లు లేదా 2.94 శాతం నష్టంతో 22,124.7 వద్ద నమోదయ్యింది.

ఎఫ్ఐఐలు పరార్..

భారత స్టాక్ మార్కెట్ల వరుస నష్టాల నుంచి తప్పించుకోవడానికి విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ)లు భారీగా తరలిపోతున్నాయి. ఐటి, ఆటో, ఫార్మా స్టాక్స్ నుంచి పెట్టుబడులను వెనక్కి తీసుకెళు న్నారు. ఫిబ్రవరిలో దాదాపు రూ.34,574 కోట్ల ఈక్విటీలను తరలించుకుపోయారు. 2025లో ఇప్పటి వరకు రూ.1,12,601 కోట్ల ఎఫ్ఐఐలు వెనక్కి వెళ్లిపోయాయి.

## ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




కోదాడ (సూర్యాపేట) మార్చి 3(వుదయం) జిల్లాలో మార్చి 5 నుండి 25 వరకు ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఇంటర్ వార్షిక పరీక్షలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు.సూర్యాపేట జిల్లాలో మొత్తం 32 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. సూర్యాపేటలో 13 పరీక్ష కేంద్రాలు, కోదాడలో 8, నడిగూడెం లో 2,హుజూర్నగర్ లో 2,మఠంపల్లి లో 1,నేరేడుచర్ల లో 1,తిరుమలగిరి లో 2,తుంగతుర్తి లో 2,ఆత్మకూరు (ఎస్ )మండలంలో 1 పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని ఒక్క రోజు ముందుగానే చూసుకోవాలని ప్రతిరోజూ పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

## వాహనాల వేలం

పరకాల మార్చి 3 (వుదయం ప్రతినిధి): ఎక్సైజ్ స్టేషన్ పరకాల నందు వివిధ నేరాల పై పట్టుబడిన వాహనాలను జిల్లా ప్రో.%డ% ఎక్సైజ్ అధికారి వరంగల్ రూరల్ ఆదేశానుసారం ఈ నెల తేదీ.05 బుధవారం ) రోజున ఉదయం 11:00 గంటలకు ప్రో. & ఎక్సైజ్ స్టేషన్ పరకాల నందు వేలం నిర్వహించబడును. కావున ఆసక్తి కలిగినవారు ప్రో.%డ% ఎక్సైజ్ స్టేషన్ పరకాల నందు వాహనం అప్ సెట్ ప్రైస్ పై 50% డిపాజిట్ గా చెల్లించి వేలంలో పాల్గొనాలని వర్ధీకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలి



జయశంకర్ భూపాలపల్లి మార్చి 03(వుదయం ప్రతినిధి) శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని మహాదేవపూర్ ఎస్సై కే పవన్ కుమార్ అన్నారు మహాదేవపూర్ మండలం ఎన్కపల్లి గ్రామంలో సోమవారం మహదేవపూర్ పోలీసులు కార్డెన్ సేర్చ్ నిర్వహించారు. అందులో భాగంగా ఇంటింటా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనుమానస్పదంగా ఏమైనా కనిపిస్తే వాటి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాహన పత్రాలను పరిశీలించారు. నెంబర్ ప్లేటు లేని వాహనాలను గుర్తించి వాటికి జరిమానా విధించారు. అనంతరం గ్రామంలో ప్రధాన కూడలి వద్ద గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ కార్యక్రమంలో మహదేవపూర్ ఎస్సై కే.పవన్ కుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరి%శీ%చాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని, మైనర్లకు బండి ఇవ్వవద్దని,గ్రామంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు మహాదేవపూర్ కాటారం మండలాల పరిధిలో లో గల అడవి ప్రాంతంలో పెద్దపులి సంచరిస్తుందని అటవీశాఖ అధికారులు గుర్తించడం జరిగిందని గ్రామస్తులు అడవుల్లోకి వెళ్ళవద్దని తెలిపారు,నిషేధిత పదార్థాలైన గుడుంబాను, గుట్కా లను ప్రోత్సహించవద్దని, ఒకవేళ ఎవరైనా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత బాగా చదువుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పున్నం, చంద్రమోహన్, తిరుపతి, గ్రామస్తులతోపాటు యువకులు పాల్గొన్నారు.

## ఎన్కపల్లి గ్రామంలో గుడుంబా పట్టివేత

జయశంకర్ భూపాలపల్లి మార్చి 03(వుదయం ప్రతినిధి) ఎన్కపల్లి గ్రామంలో నిషేధిత గుడుంబాను పట్టుకున్నట్లు మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు మహాదేవపూర్ మండలం ఎన్కపల్లి గ్రామానికి చెందిన కాపుల శ్రీశైలం అను వ్యక్తి తన ఇంట్లో నిషేధిత గుడుంబా అక్రమంగా విక్రయిస్తున్నాడని నమ్మదగిన సమాచారం రాగా, వెంటనే తన సిబ్బందితో యుక్తంగా కాపుల శ్రీశైలం ఇంట్లో తనిఖీ చేయగా పది లీటర్ల నిషేధిత గుడుంబా దొరికిందని గుడుంబాను స్వాధీనపరచుకొని, పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

## కౌలు రైతు ఆత్మహత్య



మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ / ( వుదయం ప్రతినిధి) యువ కౌలు రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ఉయ్యాలవాడ గ్రామంలో చోటుచేసుకుంది..

కుటుంబం సభ్యులు తెలిపిన ప్రకారం పోటు సాయి గత 4, సంవత్సరాల నుండి సుమారు 5, ఎకరాలు కౌలు భూమి తీసుకొని మిర్చి సాగు చేస్తున్నారు మిర్చి పంట పండుతున్న సరైన ధర లేకపోవడంతో వ్యవసాయానికి అప్పు చేసి పెట్టిన పెట్టుబడి కూడా తీరక పోవడంతో మనోవేదనకు గురై శనివారం రోజునా గడ్డ మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు.. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రైవేట్ హాస్పిటల్ సాయి ని తరలించారు.. చికిత్స పొందుతు ఈరోజు ఉదయం 9, గంటలకు మృతి చెందాడు.. సాయి మృతితో ఉయ్యాలవాడ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి . ఈ సందర్భంగా సాయి తండ్రి పోటు వెంకటి,మాట్లాడుతూ.. నా కుమారుడు సాయి కౌలు భూమిలో మిర్చి పంట వేశాడు ఈ మధ్య కాలంలో మిర్చి అమ్మిన డబ్బులు కూలిలకు కూడా సరిపోలేదని .. మిర్చి సాగుకు తెచ్చిన పెట్టుబడి సుమారు 12 లక్షలు, అప్పు తీరదని ఆత్మహత్యకు పాలుపడ్డాడు తెలిపారు.. వ్యవసాయ అవసరాలకు మూడు లక్షల తో ఫైనాన్స్ ద్వారా ట్రాక్టర్ తెచ్చాడని.. ట్రాక్టర్ ఫైనాన్స్ ఒత్తిడి కూడా ఇందులో బాగావైందని తెలిపారు..మృతిడు సాయి కి ఇద్దరు కుమారులు ఉన్నారు.. కుటుంబాన్ని పోషించే వ్యక్తి చనిపోవడంతో తిక్కు తోచిన స్థితిలో సాయి కుటుంబం ఉందని ప్రభుత్వం ఆదుకోవాలి కోరారు..

## కోలాటంలో జిల్లా మొదటి బహుమతి సాధించిన మాటూరు పేట వెల్లంగిని మాతా బృందం



మధిర మార్చి 3 (వుదయం ప్రతినిధి) ఖమ్మం పట్టణంలోని కరుణగిరి మేరీ మాత ఉత్సవాలలో భాగంగా చర్చి నిర్వాహకులు ఆదివారం నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి కోలాట పోటీలలో మధిర మండలం మాటూరుపేట గ్రామంలోని ఆర్.సి.ఎం చర్చ్ కోలాట బృందమైన వెల్లంగిని మాతా బృందం ప్రథమ బహుమతి 10,116 రూపాయలు పొందారు. ఈ పోటీలలో మొత్తం ఉమ్మడి జిల్లా నుంచి 25 కోలాట బృందాలు పాల్గొనగా మాటూరుపేట ఆర్.సి.ఎం చర్చ్ వెల్లంగిని మాత బృందాన్ని చర్చ్ నిర్వాహకులు సత్కరించారు.

# జాతీయం – అంతర్జాతీయం

## హిమాని కేసులో బిగ్ ట్విస్ట్



న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేత హిమాని నర్వాల్ దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో పోలీసులు సోమవారం ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ వ్యక్తి హిమాని అత్యంత స్నేహితుడిగా పోలీసులు అనుమానిస్తున్నారు. కానీ ఇతని పేరును మాత్రం పోలీసులు వెల్లడించలేదు. నిందితుడు ఢిల్లీకి చెందిన వ్యక్తి అని.. హిమాని ఇంటికి దగ్గరలోనే నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. పలుమార్లు హిమాని అతడిని బెదిరించి డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు కూడా ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది. కాగా, హర్యానాలోని రోహతక్ జిల్లాలో శనివారం హిమాని నర్వాల్ దారుణ హత్యకు గురయ్యారు. ఆమెను హత్య చేసి.. మృతదేహాన్ని సూట్‌కేసులో పెట్టి.. సంప్లా బస్టాండ్ సమీపంలో పడేశారు. ఈ హత్య స్థానికంగా కలకలం రేగింది. హిమాని తల్లి సవిత సంచలన ఆరోపణలు చేసింది.

కాంగ్రెస్ పార్టీలోని కొందరు రాజకీయాల్లో తన కుమార్తె ఎదుగుదలను చూసి తట్టుకోలేక హత్య చేసి ఉంటారని ఆమె ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం తన కుమార్తె ఎన్నో త్యాగాలు చేసిందని.. తన కుమార్తెకు న్యాయం జరిగే వరకు ఆమె అంత్యక్రియలు నిర్వహించనని ఆమె అన్నారు.

## మహిళలపై వేధింపులు, నేరాలు పెరుగుతున్నాయి : సచిన్ పైలట్



అజ్మీర్ : మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఎన్ఎస్‌యుఐ (నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా) సైకిల్ ర్యాలీ చేపట్టింది.

నేడు పాలిలో జరిగిన ఈ సైకిల్ ర్యాలీలో కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ఎన్ఎస్‌యుఐ చేపట్టిన ఈ ర్యాలీ మంచి సందేశాన్నిస్తోంది. అందుకే నేను కూడా ఈ ర్యాలీలో పాల్గొని మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వెళుతున్నాను. పాలిలో జరిగే ర్యాలీలో పాల్గొనబోతున్నాను' అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళలపై పెరుగుతున్న నేరాలపై మీడియాతో మాట్లాడారు. ఇటీవల విజరు నగర్‌లో ఓ మహిళపై బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడ్డారు. ఈ కేసుపై పైలట్ ఆ రాష్ట్రం అధికారంలోని బిజెపి ప్రభుత్వాన్ని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచింది. వారు అధికారంలోకి వచ్చే ముందు అనేక హామీలిచ్చారు. కానీ నిజానికి ఆ హామీల్ని అమలు చేయడం లేదు. ప్రత్యేకించి రాష్ట్రంలో ఉన్న మహిళలపై వేధింపులు, నేరాలు పెరిగిపోతున్నాయి. మహిళలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు తగిన చర్యలు బిజెపి ప్రభుత్వం తీసుకోవడం లేదు.

మాపై ఆరోపణలు చేయడం సరికాదు. మేము ఇప్పుడు అధికారంలో లేము. అసలు ఇప్పటివరకు వారు ఏం చేశారో చెప్పాలి. అమలులో ఉన్న పథకాలు ఆగిపోయాయి. అసలు మంత్రి ఎవరో కారో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది' అని ఆయన అన్నారు.

## అమెరికా అధికారిక భాషగా ఇంగ్లీష్

### ఉత్తర్వులపై ట్రంప్ సంతకం

వాషింగ్టన్: అమెరికా అధికారిక భాషగా ఇంగ్లిష్‌ను పేర్కొంటూ, ఇందుకు సంబంధించిన కార్యనిర్వాహక ఆదేశాలపై నూతన అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. తాజా ఆదేశాలు ఫెడరల్ ప్రభుత్వ నిధులతో నడిచే ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలకు తమ సేవలను, పత్రాలను ఇంగ్లిషేతర భాషల్లో కొనసాగించాలా, వద్దా? అని ఎంచుకునే అవకాశాన్ని కల్పిస్తాయి. 'ఇంగ్లిష్ అధికారిక భాషగా ఏర్పాటు చేయడం వల్ల సంభాషణలు క్రమబద్ధీకరించడమే కాకుండా ఉమ్మడి




జాతీయ ప్రయోజనాలు బలోపేతం అవుతాయి. సమ్మిళిత, సమర్థవంతమైన సమాజాన్ని నిర్మించుకోవచ్చు' అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ చర్య దేశంలో ఐక్యతను ప్రోత్సహిస్తుందని.. ప్రభుత్వ కార్యక్రమాల్లో సమర్థతను నెలకొల్పుతుందని తెలిపారు. ఇంగ్లిష్‌ను అధికారిక భాషగా గుర్తిస్తూ ఇప్పటికే అమెరికాలోని 30 రాష్ట్రాలు చట్టం చేశాయి. అయితే, అమెరికా అధికార భాషగా ఇంగ్లీష్ గుర్తింపు కోసం కాంగ్రెస్ చట్టసభ సభ్యులు దశాబ్దాలుగా ప్రయత్నాలు చేసినప్పటికీ అవి సఫలం కాలేదు. ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన కొన్ని గంటల్లోనే వైట్‌హౌస్ వెబ్‌సైట్ స్పానిష్ వెర్షన్‌ను తొలగించారు. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడయ్యాక ఇదే విధంగా చేసినప్పటికీ.. బైడెన్ వచ్చిన తర్వాత దాన్ని పునరుద్ధరించడం గమనార్హం.

## బ్రిటన్-ఉక్రెయిన్ ల మధ్య మరో ఒప్పందం

లండన్ : ఉక్రెయిన్ తో కొత్తగా 2 బిలియన్ డాలర్ల ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ ఆదివారం ప్రకటించారు. దీని ద్వారా ఉక్రెయిన్ 5,000 వైమానిక రక్షణ క్షిపణులను కొనుగోలు చేయవచ్చు. ఉక్రెయిన్ కోసం తేలికైన-బహుళ పాత్ర క్షిపణులను థేల్స్ తయారు చేస్తారని బ్రిటన్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. క్షిపణులు 6 కి.మీ కంటే ఎక్కువ దూరం ప్రయాణించే పరిధిని కలిగి ఉన్నాయని, వాటిని భూమి, సముద్రం, గాలిలోని వివిధ ప్లాట్‌ఫారమ్‌ల నుండి ప్రయోగించవచ్చని థేల్స్ చెప్పారు. "ఇప్పుడు కీలకమైన మౌలిక సదుపాయాలను రక్షించడానికి, శాంతిని కాపాడుకోవడంలో ఉక్రెయిన్‌ను బలోపేతం చేయడానికి ఇది చాలా ముఖ్యమైనది" అని స్టార్మర్ లండన్‌లో జరిగిన ఒక శిఖరాగ్ర సమావేశంలో విలేకరులతో అన్నారు. రష్యా గత వారం రాత్రిపూట 200 కంటే ఎక్కువ డ్రోన్‌లను ప్రయోగించింది. మూడు సంవత్సరాల క్రితం యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి జరిగిన అతిపెద్ద దాడి ఇది అని ఉక్రెయిన్ పేర్కొంది.




## ఉపాధి అవకాశాలు పెరిగినా



న్యూఢిల్లీ : భారత్‌లో ఉపాధి అవకాశాలు పెరిగాయని, కానీ ఉద్యోగుల నిజవేతనాలు పెరగడం లేవని ఆర్థికవేత్త, నీతిఅయోగ్ సభ్యులు అరవింద్ విర్మాణీ పేర్కొన్నారు. జనాభా పరంగా భారత్‌కు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

ం ఇందుకోసం బోధన, శిక్షణ నాణ్యతను మెరుగుపరుచుకోవడం అత్యవసరమని పేర్కొన్నారు. ఆదివారం ఆయన జాతీయ మీడియాతో మాట్లాడారు. పీరియాడికల్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్) నివేదిక ప్రకారం.. గత ఏడేళ్లలో కార్మికుల-జనాభా నిష్పత్తి స్పష్టంగా పెరుగుతోంది. అంటే జనాభా పెరుగుదల కంటే ఉద్యోగాల సంఖ్య పెరుగుతోంది. ఇందులో కూడా హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ ఉద్యోగాల సంఖ్య పెరుగుతోందని అన్నారు. 2023-24 (జులై-జూన్)లో అన్ని వయస్సుల కార్మిక-జనాభా నిష్పత్తి 43.7శాతానికి పెరిగింది. ఇది 2017-18 నాటి 34.7శాతం కంటే దాదాపు పదిశాతం పెరిగింది. పిఎల్ఎఫ్ఎస్ నివేదికను పరిశీలిస్తే, ఏడేళ్లలో రోజువారీ కూలీల జీతాలు పెరిగాయి. అదే సమయంలో వారి పరిస్థితి కూడా మెరుగుపడిందని గణాంకాలు నిర్ధారిస్తున్నాయి. కానీ నెలవారీ జీతం పొందే రెగ్యులర్ ఉద్యోగుల జీతాల్లో మాత్రం పెరుగుదల లేదని .. ఈ ఏడేళ్లలో ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వారి నిజవేతనాలు పెరగలేదని అన్నారు. ద్రవ్యోల్బణం ప్రకారం వేతనాలు పెరగకపోవడానికి ప్రధాన కారణం నైపుణ్యాల కొరత. నైపుణ్యం కలిగిన ఉద్యోగులను నియమించడం లేదు. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ ఇప్పటికీ బలహీనమైన స్థితిలో ఉందని అన్నారు. నైపుణ్యం పెరిగితే ఉత్పాదకత పెరుగుతుందని అన్నారు. ఇప్పటికే పనిచేస్తున్న వారికే కాకుండా కొత్తగా ఉద్యోగాల్లో చేరువారికి కూడా నైపుణ్యాభివృద్ధి అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. నాణ్యమైన విద్య, నైపుణ్యాలు లేకపోవడమే ప్రధాన సమస్య. ప్రతి స్థాయిలో నైపుణ్యాలు మెరుగుడాలని సూచించారు. ఉన్నత విద్య పొందుతున్న వారికి మాత్రమే కాకుండా మధ్యలోనే చదువు ఆపేసిన వారికి కూడా అందించాలని అన్నారు. ముఖ్యంగా వారి గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.

## 'డోజ్'పై అమెరికన్ల ఆగ్రహం

### -టెస్లా కార్యాలయాల ఎదుట నిరసనల హోరు




వాషింగ్టన్ : అమెరికాలో ప్రభుత్వ సమర్థత పేరిట సంక్షేమ పథకాలను కుదిస్తూ నిధుల కోత విధిస్తుండటంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ మిత్రుడు, టెస్లా గ్రూపు సంస్థల అధినేత ఎలాన్ మస్క్ నేతృత్వంలో ప్రభుత్వ వ్యయాలను తగ్గించేందుకు ప్రత్యేకంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిసియన్సీ (డోజ్)ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ట్రంప్, ఎలాన్ మస్క్ తీరును, డోజ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ అమెరికాలోని టెస్లా కార్యాలయాల ఎదుట ఆందోళనకారులు ఆదివారం భారీ నిరసన చేపట్టారు. ఉత్తరఅమెరికా, ఐరోపాలో ట్రంప్ విధ్వంసకర పాత్రకు పెరుగుతున్న వ్యతిరేకతకు ఈ ప్రదర్శనలు నిదర్శనం. దీనిలో భాగంగా టెస్లా కొనుగోళ్లను అడ్డుకోవాలని, ఆటంకం కలిగించాలని ఆందోళనకారులు భావిస్తున్నారు. ఇంగ్లండ్, స్పెయిన్ మరియు పోర్చుగల్‌తో పాటు యునైటెడ్ స్టేట్స్‌లోని పలు ప్రాంతాల్లో మరిన్ని నిరసనలు చేపట్టనున్నట్లు ఆందోళనకారులు పేర్కొన్నారు. టెక్సాస్, అరిజోనా సహా సెయింట్ లూయిస్, న్యూయార్క్ నగరం, డేటన్, ఒహియోబీ షార్లెట్, మరియు పాలో ఆల్టో, కాలిఫోర్నియాల్లో కూడా ఇటీవల భారీ ప్రదర్శనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఎలాన్ మస్క్, ట్రంప్ విధానాలను నిరసిస్తూ కొంతమంది టెస్లా కార్ల యజమానులు తమ వాహనాలను ధ్వంసం చేసినట్లు స్థానిక మీడియా తమ కథనాల్లో పేర్కొంది. ఇటీవల ట్రంప్, మస్క్ వేల సంఖ్యలో ఫెడరల్ ఉద్యోగుల తొలగించడంతో పాటు ఒప్పందాలను రద్దు చేశారు. యుఎస్ఏజన్సీఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్‌తో సహా ప్రభుత్వ విభాగాలను మూసివేశారు. మస్క్ చర్యలు అమెరికా బడ్జెట్‌ను నియంత్రించడానికి, తన సందపను పటిష్టపరుచుకోవడానికి అనేకమార్గాలను అందించి, కాంగ్రెస్‌ను ధిక్కరిస్తున్నాయని పలువురు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్శిటీల్లో కొనసాగుతున్న సమ్మె

కోల్‌కతా : సిపిఎం విద్యార్థి విభాగం ఎస్ఎఫ్ఐ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్శిటీల్లోనూ విద్యార్థులు సోమవారం సమ్మె చేపట్టారు. విద్యాశాఖ మంత్రి బ్రత్యా బసు రాజీనామా చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. కోల్‌కతాలోని జాదవ్‌పూర్, ప్రెసెడెన్సీ విశ్వవిద్యాలయాల్లో సమ్మె కొనసాగుతోంది. ఈ సమ్మెకు అధ్యాపకులు, ఇతర సిబ్బంది దూరంగా ఉన్నారు. కోల్‌కతా యూనివర్శిటీ, రవీంద్రభారతి యూనివర్శిటీ, నార్త్ బెంగాల్ యూనివర్శిటీ, బుర్ద్వాన్ యూనివర్శిటీలు పాక్షికంగా ప్రభావితమయ్యాయి. సెమిస్టర్ పరీక్షలు నిర్వహించినప్పటికీ.. కొన్నియూనివర్శిటీల్లో తరగతలను రద్దు చేశారు. సెమిస్టర్ పరీక్షల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా విద్యార్థులు సమ్మె చేపడుతున్నారు. పశ్చిమబెంగాల్‌లో సోమవారం నుండి ఇంటర్ పరీక్షలు కూడా ప్రారంభమయ్యాయి. మార్చి1న జాదవ్‌పూర్ యూనివర్శిటీలో టిఎంసి-అలైన్డ్ టీచర్స్‌బాడీ చైర్మన్‌గా పశ్చిమబెంగాల్ కాలేజ్ అండ్ యూనివర్శిటీ ప్రొఫెసర్స్ అసోసియేషన్ (డబ్ల్యుబిసియుపిఎ) ఎజిఎంకి మంత్రి బ్రత్యాబసు హాజరై తిరిగి వెళుతుండగా విద్యార్థులు అడ్డుకున్నారు. విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణపై చర్చ జరపాలంటూ డిమాండ్ చేశారు. మంత్రి కాన్వారు విద్యార్థులపైకి దూసుకువెళ్లడంతో ఇద్దరు



విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనలో మంత్రి కారు విండ్‌షీల్డ్ ధ్వంసం కావడంతో పాటు స్వల్పగాయాలయ్యాయి. డబ్ల్యుబిసియుపిఎ ఎజిఎం సందర్భంగా టిఎంసి మద్దతుతో కొందరు బయటి వ్యక్తులు యూనివర్శిటీలో హింస, విధ్వంసాన్ని సృష్టించినట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు షువాజిత్ సర్కార్ పేర్కొన్నారు.

విద్యార్థులు విసి సమక్షంలో మంత్రితో మాత్రమే చర్చలు జరపాలని కోరుకున్నారని ఆయన అన్నారు. కానీ మంత్రి వారితో అనుచితంగా ప్రవర్తించారని, క్యాంపస్ నుండి బయటకు వెళ్లడానికి యత్నించారని అన్నారు. చర్చలు జరపాలని డిమాండ్ చేసినప్పటికీ పట్టించుకోకుండా కారులో ఎక్కి బయటికి వెళ్లేందుకు యత్నించారు. నిరసన చేపడుతున్న విద్యార్థులపైకి కారు దూసుకు వెళ్లిందని అన్నారు. ఇద్దరు విద్యార్థుల గాయాలకు బ్రత్యా బసు బాధ్యత వహించాలని, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## ద్రవ్యోల్బణం.. కరెన్సీ పతనం

### ఇరాన్ ఆర్థిక మంత్రిపై అభిశంసన వేటు

టెహ్రాన్ : ఇరాన్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతోంది. ఒకవైపు ద్రవ్యోల్బణం ఆకాశమే హద్దుగా అంతకంతకూ ఎగబాకుతుంటే మరోవైపు అంతర్జాతీయ మారకాలతో పోల్చితే ఇరాన్ కరెన్సీ రియాల్ విలువ పాతాళానికి పరుగులు గీస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇరాన్ ఆర్థిక మంత్రి అబ్దొల్‌నాజెర్ హెూమ్మతి అభిశంసనకు గురయ్యారు. పార్లమెంటులో ఈ మేరకు ఆదివారం ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా 273 మంది సభ్యుల్లో 182 మంది ఓటేసినట్లు స్పీకర్ ఖాలిబఫ్ ప్రకటించారు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం..పార్లమెంటులో తీర్మానం ఆమోదం పొందిన వెనువెంటనే మంత్రి తొలగింపు అమల్లోకి వస్తుంది. ఇరాన్‌లో మసూద్ పెజెష్కియాన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల వ్యవధిలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఓటింగ్ ప్రక్రియ సందర్భంగా దేశాధ్యక్షుడు పెజెష్కియాన్ మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ప్రస్తుతం పశ్చిమ దేశాలతో పోరాటంలో చిక్కుకుందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థ కఠినమైన పరిస్థితులు ఎదుర్కొంటోందని ఆర్థికశాఖ మంత్రి హెమ్మతి తెలిపారు. ద్రవ్యోల్బణం 35 శాతంగా ఉందని అంగీకరించిన ఆయన.. ఈ సమస్యను పరిష్కరించేందుకు కషి చేస్తున్నట్లు తెలిపారు. అయితే, దీనికి సమయం పడుతుందని చెప్పారు.

అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ రెండో సారి



అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇరాన్ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. కరెన్సీ కుప్పకూలిపోవడంపై స్థానికంగా తీవ్ర ఆందోళనలు నెలకొన్నాయి. ఆర్థిక నిర్వహణలో లోపాలు ఉన్నాయంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. అణ్వస్త్ర కార్యక్రమాల కారణంగా అంతర్జాతీయ ఆంక్షల నేపథ్యంలో ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కొన్నేళ్లుగా పతనావస్థలో ఉంది. 2015లో అగ్రరాజ్యంతో అణు ఒప్పందం చేసుకునే నాటికి ఒక డాలర్‌కు 32 వేల రియాల్స్ ఉండేవి. కొంతకాలంగా భారీగా క్షీణిస్తూ వస్తున్న కరెన్సీ విలువ.. గతేడాది జులైలో పెజెష్కియాన్ అధికారం చేపట్టే సమయానికి 5.84 లక్షల రియాల్స్‌కు పడిపోయింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల నాటికి 7.03 లక్షలకు చేరుకుంది. ఇటీవల అది మరింత పతనమై దాదాపు 9.30 లక్షల రియాల్స్‌కు పడిపోయింది.

# చక్కని ఆరోగ్యం



## షుగర్ ఉన్నవారు తేనె తినడం మంచిదేనా..?

తేనె ఒక సహజ తీపి పదార్థం. ఇందులో ఐరన్, విటమిన్ సి, ఫోలేట్, మెగ్నీషియం, పొటాషియం, కాల్షియం, యాంటీ–ఆక్సిడెంట్లు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఆయుర్వేద గుణాలు సైతం సమృద్ధిగా ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. అయితే, ఆరోగ్య ప్రయోజనాలు ఎక్కువగా ఉన్న తేనె అందరికీ సరిపోతుందా..? మధుమేహం ఉన్నవారు తేనె తింటే మంచిదేనా..? అనే సందేహం చాలా మందిని వెంటాడుతుంది. షుగర్ ఉన్నవారు తేనె తీసుకుంటే ఎలా తీసుకోవాలి. నేటి ఆధునిక జీవనశైలి కారణంగా చాలా మంది డయాబెటిస్ ఇబ్బంది పడుతున్నారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా మధుమేహం వెంటాడుతోంది. పూర్తిగా నివారించలేని షుగర్ వ్యాధిని మంచి లైఫ్‌స్టైల్‌ని పాటిస్తూ.. సరైన ఆహారాన్ని తీసుకుంటూ, శారీరక శ్రమ ద్వారా కంట్రోల్ చేసుకోవచ్చు అంటున్నారు నిపుణులు. అయితే, షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారు తక్కువ మోతాదులోనే తేనె తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. షుగర్ ఉన్నవారు తేనెను పరిమితంగానే వాడాలి. తేనెలో రోగనిరోధక శక్తి ఉన్నప్పటికీ ఇందులో చక్కెరలు అధికంగా ఉంటాయి.. తేనెలో ఉండే గ్లైసెమిక్ ఇండెక్స్ చక్కెర కంటే తక్కువ స్థాయిలో ఉంటుంది. కానీ ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతుంది. కాబట్టి తేనె విషయంలో జాగ్రత్తగా ఉండటం తప్పనిసరి అంటున్నారు నిపుణులు. తేనె తెల్ల చక్కెర కంటే తియ్యగా ఉంటుందని మీరు గుర్తుంచుకోవాలి. కాబట్టి దీనిని తక్కువ పరిమాణంలో మాత్రమే వాడాలి. తేనెలోని చక్కెరలు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. కాబట్టి మీ బ్లడ్‌షుగర్ ఎక్కువగా ఉంటే, మీరు తేనె తీసుకోవడం మానుకోవాలి. లేకపోతే, సమస్య మరింత పెరిగే అవకాశం ఉందని సూచిస్తున్నారు. మీరు సాధారణంగా చక్కెరను ఉపయోగించే చోట తేనెను తక్కువ మొత్తంలో ఉపయోగించవచ్చు. కానీ, తేనె తీసుకునే ముందు, మీరు మీ వైద్యుడిని సంప్రదించాలి. వైద్యుడిని సంప్రదించకుండా తేనె తీసుకోవడం ప్రమాదకరం. ఒక రోజుకు ఒక టీస్పూన్ కంటే ఎక్కువ తేనె తీసుకోవద్దు. తేనెలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కనిపిస్తాయి. ఇది దగ్గును తగ్గించడంలో సహాయపడుతుంది. మీరు కూడా దీన్ని తినాలి. మీకు చాలా ఉపశమనం లభిస్తుంది. తేనెలో యాంటీ–ఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు కనిపిస్తాయి. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడుతుంది.

## షుగర్ ఉన్నవాళ్లు దొండకాయ తింటే ఏమౌతుందో తెలుసా..?

ఈ కూరగాయ తింటే తెలివితేటలు తగ్గిపోతాయని, బుద్ధి మందగిస్తుందని, మతిమరుపు వస్తుందని చాలా మంది భావిస్తుంటారు. అందుకే తల్లిదండ్రులు సైతం ఈ కూరగాయను పిల్లలకు పెట్టడానికి ఇష్టపడరు. అయితే ఇలాంటి అపోహలను నమ్మవద్దని పోషకాహార నిపుణులు అంటున్నారు. పైగా దొండకాయతో ఆరోగ్య ప్రయోజనాలు సైతం పుష్కలంగా ఉన్నాయని చెబుతున్నారు. ఆయుర్వేదంలో కూడా దొండకు చాలా ప్రాధాన్యత ఉందని చెబుతున్నారు. అన్ని కూరగాల్లో దొండకాయ కూడా ఒకటి. కానీ, ఈ దొండ కాయ తినాలంటే మాత్రం చాలా మంది మూతి తిప్పేసుకుంటుంటారు.

.ఎందుకంటే.. ఈ కూరగాయ తింటే తెలివితేటలు తగ్గిపోతాయని, బుద్ధి మందగిస్తుందని, మతిమరుపు వస్తుందని చాలా మంది భావిస్తుంటారు. అందుకే తల్లిదండ్రులు సైతం ఈ కూరగాయను పిల్లలకు పెట్టడానికి ఇష్టపడరు.

అయితే ఇలాంటి అపోహలను నమ్మవద్దని పోషకాహార నిపుణులు అంటున్నారు. పైగా దొండకాయతో ఆరోగ్య ప్రయోజనాలు సైతం పుష్కలంగా ఉన్నాయని చెబుతున్నారు. ఆయుర్వేదంలో కూడా దొండకు చాలా ప్రాధాన్యత ఉందని చెబుతున్నారు. దొండకాయలో ఫైబర్, విటమిన్ బి1, బి2, బి3, బి6, బి9, విటమిన్ సి, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, ఫాస్పరస్, పొటాషియం, సోడియం, జింక్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. దొండకాయను మధుమేహానికి ఔషధంగా ఉపయోగిస్తారు. ఇందులో యాంటీ–అడిపోజెనిక్ ఏజెంట్లు ఉంటాయి.

ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి. కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులు వారానికి ఒకసారి దొండ తినడం లేదా దాని ఆకుల రసం తాగడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. అంతే కాదు బరువు తగ్గాలనుకునే వారికి దొండ కాయ తీసుకోవడం చాలా మంచిది. ఇందులో స్థూలకాయాన్ని నిరోధించే గుణాలు పుష్కలంగా ఉన్నాయి. అలాగే జీవక్రియ



రేటును పెంచుతుంది. ఐరన్ లోపంతో బాధపడేవారు దొండ తినడం వల్ల ప్రయోజనం పొందవచ్చు. అంతేకాదు..

దొండకాయలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇందులో థయామిన్ కూడా ఉంటుంది. దొండ కార్బోహైడ్రేట్లను గ్లూకోజ్‌గా కూడా మారుస్తుంది. దీని వల్ల జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. ఇది అల్సర్, గ్యాస్ వంటి సమస్యలను దూరం చేస్తుంది. దొండ తింటే మగత, మెంటల్ రిటార్డేషన్ సమస్యలు వస్తాయని అంటుంటారు. నిజానికి, దొండ ఆహారంలో తీసుకోవడం వల్ల నాడీ వ్యవస్థను బలపరుస్తుందని, అల్జీమర్స్ వంటి లక్షణాలను తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

## ఖాళీ కడుపుతో వేప నీరు తాగితే

### శరీరంలో ఇన్ని మార్పులా..?

ఉదయం ఖాళీ కడుపుతో వేప ఆకుల నీటిని తీసుకోవటం వల్ల వైరల్, బ్యాక్టీరియా వ్యాధుల నుండి ఉపశమనం కలిగిస్తుంది. శరీరం రోగనిరోధక శక్తిని బలపరుస్తుందని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. లేత ఆకుల వేప రసంలో అనేక ఔషధ గుణాలు నిండివున్నాయని చెబుతున్నారు. ఇవి క్యాన్సర్



కణాలను నాశనం చేయగలవని అధ్యయనంలో తేలింది. అంతేకాదు.. వేప గింజలలో ఒక క్రియాశీల సమ్మేళనం ఉంటుంది. ఇది జుట్టు, చర్మానికి హాని కలిగించే పరాన్నజీవులకు వ్యతిరేకంగా పోరాడుతుంది. వేప ఒక ఔషధ మూలిక. ఆయుర్వేదంలో ఉపయోగించే ప్రసిద్ధ పదార్థాలలో వేప కూడా ఒకటి. ఆయుర్వేదంలో వేప చెట్టులోని ఆకులు, పండ్లు, నూనె, వేర్లు, బెరడు, వేప రసం వంటి ప్రతి భాగాన్ని ఔషధ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారు. అయితే, వేప ఆకుల నీటితో కలిగే లాభాలు చాలా మందికి తెలియకపోవచ్చు..ఉదయం లేవగానే ఈ తాజా వేప రసాన్ని తాగడం వల్ల జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

వేప నీరు తాగితే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాము. ఉదయం ఖాళీ కడుపుతో వేప ఆకుల నీటిని తీసుకోవటం వల్ల వైరల్, బ్యాక్టీరియా వ్యాధుల నుండి ఉపశమనం కలిగిస్తుంది. శరీరం రోగనిరోధక శక్తిని బలపరుస్తుందని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. లేత ఆకుల వేప రసంలో అనేక ఔషధ గుణాలు నిండివున్నాయని చెబుతున్నారు. ఇవి క్యాన్సర్ కణాలను నాశనం చేయగలవని అధ్యయనంలో తేలింది. అంతేకాదు.. వేప గింజలలో ఒక క్రియాశీల సమ్మేళనం ఉంటుంది. ఇది జుట్టు, చర్మానికి హాని కలిగించే పరాన్నజీవులకు వ్యతిరేకంగా పోరాడుతుంది. వేప ఆకు పదార్థాలు లేదా రసం గాయాలను నయం చేయడానికి దోహదపడతాయి. వేప పుల్లలతో దంతాలను తోముకుంటుంటే అది నోటి ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఇందుకోసం ఒక 10 తాజా లేత వేప ఆకులను తీసుకుని శుభ్రం చేసుకోవాలి.. వాటిని కావాల్సిన నీటిలో వేసుకుని 5 నిమిషాలు నానబెట్టి ఆ తర్వాత వాటిని వడగట్టుకుంటే వేప నీరు సిద్ధమవుతుంది.

## తమలపాకును నీళ్లలో మరిగించి తాగితే ఎన్ని లాభాలో తెలుసా..?





తమలపాకులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. తమలపాకు నీరు తాగడం వల్ల అజీర్ణం, గ్యాస్ సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. తమలపాకు నీరు జీవక్రియను పెంచడం ద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. తమలపాకులతో తయారుచేసిన నీటిని తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి తమలపాకును నీళ్లలో మరిగించి తాగితే ఎన్ని లాభాలో తెలుసా..? ఆయుర్వేదంలో తమలపాకు ఔషధ గుణాలకు ప్రసిద్ధి చెందింది. తమలపాకులో అనేక ఆరోగ్య ప్రయోజనాలు అందుతాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. ఈ ఆకుల్లో విటమిన్ సి, థయామిన్, నియాసిన్, రైబోఫ్లావిన్, కెరోటిన్, కాల్షియం వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. తమలపాకులను నమలడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయి. అయితే, తమలపాకులను నీళ్లలో వేసి మరిగించి తీసుకోవడం వలన మన శరీరానికి మరింత మేలు జరుగుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. తమలపాకులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. తమలపాకు నీరు తాగడం వల్ల అజీర్ణం, గ్యాస్ సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. తమలపాకు నీరు జీవక్రియను పెంచడం ద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. తమలపాకులతో తయారుచేసిన నీటిని తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి నియంత్రించబడుతుంది, ఇది మధుమేహ రోగులకు ప్రయోజనకరం. తమలపాకు నీరు శరీరాన్ని విషరహితం చేస్తుంది, చర్మాన్ని ఆరోగ్యంగా కనిపించేలా చేస్తుంది. ఈ నీటిని తాగడం వల్ల కీళ్ల నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుంది, దాని శోథ నిరోధక లక్షణాలు నొప్పి నుండి ఉపశమనం కలిగిస్తాయి. తమలపాకును వేడి నీటిలో మరిగించి తాగడం వల్ల గొంతు నొప్పి తగ్గుతుంది. తమలపాకులు నోటి నుండి దుర్వాసనను తొలగించడంలో సహాయపడతాయి, దంతాలను మెరిసేలా చేస్తాయి.

## డ్రై ఫ్రూట్స్ నానబెట్టి తింటున్నారా..?

ముఖ్యంగా గ్యాస్, అజీర్తి సమస్యలు దరిచేరవని అంటున్నారు. రాత్రంతా నీళ్లలో నానబెట్టిన నట్స్‌లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. వీటితో ఆక్సిడేటివ్ స్ట్రెస్ కూడా తగ్గుతుందని వివరిస్తున్నారు. సాధారణ గింజల కంటే నానబెట్టిన గింజల్లో కేలరీల సంఖ్య కాస్త ఎక్కువగానే ఉంటుందని నిపుణులు



చెబుతున్నారు. రెండిట్లో పోషకాలు అన్నీ సమానంగానే ఉన్నా.. నానబెట్టిన గింజలతో లాభం కాస్త ఎక్కువగానే ఉంటుందని తెలిపారు. డ్రై ఫ్రూట్స్ ఇవి ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తాయో మనందరికీ తెలిసిందే.. ఐతే ఈ గింజలను నానబెట్టుకుని తింటే ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలు రెట్టింపవుతాయంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాము.

బాదం పప్పులను నానబెట్టి తింటే మన శరీరానికి పోషకాలను గ్రహించే శక్తిని కలిగిస్తాయి. గుమ్మడి గింజలను రాత్రంతా నానబెట్టుకుని తింటే అందులోని ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరానికి అందుతాయి. నానబెట్టిన డ్రై ఫ్రూట్స్‌ను తీసుకోవడం వల్ల శరీరం వేగంగా పోషకాలను గ్రహిస్తుందని నిపుణులు అంటున్నారు. నివేదిక ప్రకారం.. ఇంకా పచ్చి వాటితో పోలిస్తే నానబెట్టిన గింజలు తీసుకోవడం వల్ల తేలికగా జీర్ణం అవుతాయని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా గ్యాస్, అజీర్తి సమస్యలు దరిచేరవని అంటున్నారు. రాత్రంతా నీళ్లలో నానబెట్టిన నట్స్?లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయని నిపుణులు అంటున్నారు. వీటితో ఆక్సిడేటివ్ స్ట్రెస్ కూడా తగ్గుతుందని వివరిస్తున్నారు. సాధారణ గింజల కంటే నానబెట్టిన గింజల్లో కేలరీల సంఖ్య కాస్త ఎక్కువగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రెండిట్లో పోషకాలు అన్నీ సమానంగానే ఉన్నా.. నానబెట్టిన గింజలతో లాభం కాస్త ఎక్కువగానే ఉంటుందని తెలిపారు. నీళ్లను పీల్చుకున్న గింజల్లో రుచి ఎక్కువగానే ఉంటుందని అనేక అధ్యయనాల్లో తేలిందని పేర్కొన్నారు. బాదం, ఎండు ద్రాక్ష, వాల్?నట్, జీడిపప్పు, పిస్తా వంటి వాటిని నానబెట్టి తీసుకోవడమే ఉత్తమమని వివరిస్తున్నారు.

## వెల్లుల్లి ఖాళీ కడుపుతో తినండి..

### డయాబెటిస్ సహా ఈ వ్యాధులన్నీ పరార్..!



వెల్లుల్లి పేరు వినగానే మనకు తెల్లటి తొక్కతో కూడిన బలమైన వాసన, రుచి కలిగిన మసాలా దినుసులు గుర్తుకు వస్తాయి. వెల్లుల్లిని శతాబ్దాలుగా భారతీయ వంటకాలలో ఉపయోగిస్తున్నారు. కానీ, వెల్లుల్లి రుచితో పాటు ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుందని మీకు తెలుసా. ఆయుర్వేదంలో వెల్లుల్లిని శక్తివంతమైన ఔషధంగా పరిగణిస్తారు. ఇది శరీరాన్ని లోపలి నుండి ఆరోగ్యంగా ఉంచుతుంది. ముఖ్యంగా మీరు దీన్ని పచ్చిగా, ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటుంటే అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చునని చెబుతున్నారు. పచ్చి వెల్లుల్లి గుండెకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది రక్తంలో కొలెస్ట్రాల్ మొత్తాన్ని తగ్గిస్తుంది. బిపిని నియంత్రిస్తుంది. వెల్లుల్లిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, సల్ఫర్ సమ్మేళనాలు గుండెను బలపరుస్తాయి. దీని రెగ్యులర్ వినియోగం గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. పచ్చి వెల్లుల్లి గుండెకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది రక్తంలో కొలెస్ట్రాల్ మొత్తాన్ని తగ్గిస్తుంది. బిపిని నియంత్రిస్తుంది. వెల్లుల్లిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, సల్ఫర్ సమ్మేళనాలు గుండెను బలపరుస్తాయి. దీని రెగ్యులర్ వినియోగం గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. పచ్చి వెల్లుల్లి శరీర రోగనిరోధక శక్తిని కూడా బలపరుస్తుంది. ఇందులో ఉండే యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్ లక్షణాలు శరీరానికి వ్యాధులతో పోరాడే శక్తిని ఇస్తాయి. ఇది జలుబు, దగ్గు, ఫ్లూ వంటి సమస్యలను తొలగించడంలో సహాయపడుతుంది. పచ్చి వెల్లుల్లి కడుపును శుభ్రపరచడంలో సహాయపడుతుంది. ఇది కడుపులో గ్యాస్, ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఖాళీ కడుపుతో వెల్లుల్లి తినడం వల్ల శరీరంలోని విష వ్యర్థాలు తొలగిపోతాయి. పచ్చి వెల్లుల్లి మధుమేహ రోగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. వెల్లుల్లిలో ఉండే సల్ఫర్ సమ్మేళనం ఇన్సులిన్‌ను నియంత్రిస్తుంది. ఇది డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. పచ్చి వెల్లుల్లి బరువు తగ్గడానికి కూడా సహాయపడుతుంది. ఇది జీవక్రియను పెంచుతుంది. ఇది కేలరీలను బర్న్ చేసే ప్రక్రియను వేగవంతం చేస్తుంది. వెల్లుల్లి తినడం వల్ల ఆకలిని నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. ఇది అతిగా తినే అలవాటును తగ్గిస్తుంది. బరువును నిర్వహిస్తుంది. పచ్చి వెల్లుల్లి శరీరం లోపలి నుండి విషాన్ని తొలగిస్తుంది. వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరం నుండి హానికరమైన రసాయనాలను తొలగిస్తాయి. కణాలు దెబ్బతినకుండా నిరోధిస్తాయి. తద్వారా వృద్ధాప్య సంకేతాలను తగ్గిస్తాయి.



# సినిమా



## సినీ ప్రియులకు కిరణ్ అబ్బవరం గిఫ్ట్



సినీ ప్రియులకు బంపర్ ఆఫర్ ఇచ్చారు నటుడు కిరణ్ అబ్బవరం ఆయన నటించిన కొత్త చిత్రం 'దిల్‌రూబా' కథేంటో చెబితే సినిమాలో తాను వాడిన బైక్‌ను బహుమతిగా ఇస్తానని ప్రకటించారు. అది అంటే తనకెంతో ఇష్టమని చెప్పారు. ఈ మేరకు ఆ బైక్‌ను చూపిస్తూ నేడు ప్రత్యేక వీడియో షేర్ చేశారు. "కోపం, ప్రేమల సమ్మేళనంగా తెరకెక్కిన చిత్రమే 'దిల్ రూబా'. ఈ బైక్ అంటే నాకెంతో ఇష్టం. మా ఆర్ట్ డైరెక్టర్ ఎంతో శ్రమించి సినిమా కోసం దీనిని తయారు చేశారు. మార్కెట్‌లో ఇది మీకు ఎక్కడా దొరకదు. అందుకే దీనిని మీకు బహుమతిగా ఇచ్చేయాలనుకుంటున్నా. ఈ బైక్‌ను మీ సొంతం చేసుకోవడానికి మీరు చేయాల్సిందల్లా ఒక్కటే.. ఇప్పటివరకూ విడుదలైన మా సినిమా పాటలు, వీడియోలు, ప్రమోషన్స్‌లో మేము మాట్లాడిన విషయాలను ఆధారంగా చేసుకుని కథ ఏమిటనేది మీరు ఆలోచించి చెప్పాలి. క్రియేటివ్‌గా చెప్పిన వాళ్లకు ఈ బైక్ బహుమతిగా ఇస్తా. ఈ బైక్ గెలుచుకున్న వ్యక్తితో ఫస్ట్ డే ఫస్ట్‌షోకు వెళ్తా" అని కిరణ్ చెప్పారు. విశ్వకరుణ్ దర్శకత్వం వహించిన చిత్రమిది. రుక్సర్ థిల్లాన్ కథానాయిక. మార్చి 14న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

## అట్లీతో సినిమా.. అదే సమస్య

అల్లు అర్జున్ తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతోందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. త్వరలో అఫీషియల్‌గా ఈ విషయం బయటకు రానుందని కూడా టక్ నడుస్తోంది. వీరిద్దరి కలయిక అంచనాలు భారీగా ఉంటాయి. ప్రస్తుతం అట్లీ వరుస హిట్‌లతో మంచి ఫామ్‌లో ఉన్నాడు. అయితే.. అట్లీతో ఓ సమస్య వుంది. ఈ మధ్యన ఆయన రెమ్యునరేషన్ రూ.100 కోట్లకు పెంచేశారు. ఇది చూసి బడా నిర్మాతలే వెనక్కు తగ్గుతున్నారు. 'జవాన్' సినిమా తరవాత అట్లీ రేంజ్ మారింది. పుష్ప సినిమాతో అల్లు అర్జున్ రేంజ్ కూడా జాతీయ స్థాయిని దాటుకుపోయింది. ఆయన కూడా రూ. 150 కోట్లు రెమ్యునరేషన్‌లో ఉన్నాడని టాక్ నడుస్తోంది. ఈ సినిమా గీతా ఆర్ట్స్‌లో చేసినా పారితోషికం అయితే ఇవ్వాల్సిందే. అంటే దర్శకుడుకీ, హీరోకీ రూ.250 కోట్లు అయిపోతుంది. బన్నీ మార్కెట్ ఉంద కాబట్టి, ఆమాత్రం ఇవ్వడానికి నిర్మాతలు కూడా సిద్దంగానే ఉంటారు. అయితే అట్లీ రూ.100 కోట్లు ఇచ్చే స్థాయి ఉందా? అన్నది ప్రశ్న. అట్లీకి అంత ఇవ్వలేకే.. తమిళ నిర్మాతలు సైడ్ అయిపోతున్నారు. ఇప్పుడు బన్నీ అట్లీ ప్రాజెక్ట్ ఎవరు తీసుకున్నా.. పారితోషికం దగ్గరే ఇష్యూ వస్తుంది. బన్నీకి ఇవ్వడానికి ఏ నిర్మాత వెనకడుగు వేయడు. అట్లీకి రూ.100 కోట్లు ఇవ్వడమే సమస్య. తమిళ నిర్మాతలే అట్లీని నమ్మకపోతే తెలుగులో ఎవరు నమ్ముతారు? అట్లీకి ఉన్న క్రేజ్‌ను బట్టి డిమాండ్ ఉండటం సహజం. కానీ మరీ రూ.100 కోట్లు అనే సరికి నిర్మాతలు వెనకడుగు వేస్తున్నారు. మరి ఈ సమస్యకు పరిష్కారం ఎలా ఉంటుందో చూడాలి.






## నితిన్ 'రాబిన్‌హుడ్'కి పోటిగా వస్తున్న 'మ్యాడ్ స్క్వేర్'

టాలీవుడ్ హీరో నితిన్ వెంకీ కుడుముల కాంబోలో వస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్ భీష్మ సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. ఈ సినిమా విషయానికి వస్తే.. నితిన్ ఇందులో రాబిన్ హుడ్ అనే దొంగ పాత్రలో నటిస్తున్నాడు. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా.. వెన్నెల కిషోర్, రాజేంద్రప్రసాద్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అయితే ఇదే రోజు మరో క్రేజీ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌజ్ సితార ఎంటర్‌టైనమెంట్స్ నుంచి వస్తున్న తాజా ఎంటర్‌టైనర్ మ్యాడ్ స్క్వేర్ "మ్యాడ్" చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోన్న ఈ చిత్రం యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రాబోతుంది. ఈ చిత్రంలో నార్నే నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, విష్ణు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాను సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా.. మార్చి 28, 2025న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రెండు చిత్రాలు ఒకే సమయంలో రావడంతో బాక్సాఫీస్ వద్ద పోటీ ఉండే అవకాశం కనిపిస్తోంది. అయితే "రాబిన్‌హుడ్" ఒక యాక్షన్ థ్రిల్లర్‌గా రాబోతుండగా.. "మ్యాడ్ స్క్వేర్" యూత్‌ని ఆకట్టుకునే కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతుండడంతో ప్రేక్షకుల ఏ జానర్ నచ్చితే ఆ జానర్‌లో సినిమాకి వెళ్లే అవకాశం కనిపిస్తుంది.

## ఓటీటీలోకి వచ్చేసిన సంక్రాంతికి వస్తున్నాం

విక్టరీ వెంకటేష్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. మీనాక్షి చౌదరి ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటించారు. ఈ సంక్రాంతి పండుగకు ప్రేక్షకుల ముందుకు వచ్చిన బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అందుకుంది. అయితే ఈ సినిమా ఓటీటీలోకి ఎప్పుడు వస్తుందా అని ప్రేక్షకులు ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఒకేసారి అటు టీవీతో పాటు ఓటీటీలో విడుదల చేసింది. జీటీవీలో నిన్న ప్రీమియర్ అయిన ఈ చిత్రం.. ప్రస్తుతం ఓటీటీ వేదిక జీ5లో తెలుగుతో పాటు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది.



# నిర్మానుష్యంగా మహాకుంభమేళ ప్రాంతం







**లక్నో :** ప్రయాగ్ రాజ్‌లో దాదాపు 45 రోజుల పాటు సాగిన మహా కుంభమేళ యాత్రికులతో కిక్కిరిసిపోయింది. 144 ఏళ్లకు ఒక్కసారి వచ్చే ఆ మహా కుంభమేళలో అమృత స్నానాన్ని చేసేందుకు దేశ విదేశాల నుంచి యాత్రికులు ప్రయాగ్ రాజ్‌కు పోటెత్తారు. జనవరి 13వ తేదీ నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు సాగిన ఈ మహా కుంభమేళ.. జనసంద్రంగా మారింది. ఈ కుంభమేళ ఇటీవల ముగియడంతో.. ప్రయాగ్ రాజ్ పరిసర ప్రాంతాలన్నీ నిర్మానుష్యంగా మారాయి.

ఇక ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమం ప్రాంతంతోపాటు పరిసర ప్రాంతాలను 15 రోజుల్లో శుభ్రం చేసేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది. దీనిని ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభించింది. అందులోభాగంగా యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన టెంట్లను తీసి వేస్తున్నారు. అలాగే సంగమం ఘాట్లు, రహదారులను శుభ్రం చేస్తున్నారు. ఇక యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక మౌలిక సదుపాయాలను సైతం తొలగిస్తున్నారు. అదీకాక.. 45 రోజుల పాటు యాత్రికులతో జనసంద్రంగా మారిన ఆ ప్రాంతం ప్రస్తుతం అతి కొద్ది మంది యాత్రికులతో ఉంది.

**ఆయన ఆధ్వర్యంలో..**

ఇక ఈ ప్రాంతంలో పరిశుభ్ర పరిచే కార్యక్రమాన్ని ప్రత్యేక అధికారి ఆకాంక్ష రానా పర్యవేక్షిస్తున్నారు. స్వచ్ఛతా మిత్రా, గంగా సేవా దుత్‌లో ఈ ప్రాంతాన్ని శుభ్రపరుస్తున్నారు. అలాగే ఈ ప్రాంతంలోని వ్యర్థాలను నైనీలోని నిర్వీర్యం చేసేందకు బస్వార్ ప్లాంట్‌కు తరలిస్తున్నారు. మరోవైపు ఈ మహాకుంభమేళలో యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు.. పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు 15 వేల పారిశుధ్య పనివారితోపాటు 2 వేల గంగా సేవా దూత్‌లను ఉత్తరప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

**గిన్నిస్ రికార్డులు..**

దీంతో మహాకుంభమేళ జరిగినన్ని రోజులు.. ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచారు. ఇక 45 రోజుల పాటు సాగిన ఈ మహాకుంభమేళలో రోజుకు 1.5 కోట్ల మంది భక్తులు ఈ సంగమంలో స్నానం చేశారు. ఇది మూడు గిన్నిస్ ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది. అదే విధంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీతోపాటు ఆయన కేబినెట్ మంత్రులు, వివిధ రంగాల ప్రముఖులు సైతం ఈ మహాకుంభమేళకు హాజరయ్యారు. విదేశీ ప్రముఖులు సైతం ప్రయాగ్ రాజ్ విచ్చేశారు.

**తప్పలేదు తొక్కిసలాట..**

జనవరి 29వ తేదీ మౌని అమావాస్య. ఈ రోజు మహాకుంభమేళలో తొక్కిసలాట జరిగింది. ఇందులో 30 మంది మరణించారు. మరో 60 మంది తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ఈ మహాకుంభమేళలో పలుమార్లు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అందులో పలువురు గాయపడిన సంగతి తెలిసిందే. ఇక యాత్రికుల రద్దీతో దాదాపు 300 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఏదీ ఏమైనా.. దాదాపు 144 ఏళ్లకు ఒక్కసారి మాత్రమే వచ్చే ఈ మహాకుంభమేళ.. రికార్డు సృష్టించింది.

## 9,000 హార్స్‌పవర్ రైలు ఇంజిన్ సిద్ధం




**న్యూఢిల్లీ:** భారతీయ రైల్వే దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిదని అంటారు. దేశంలోని చాలామంది రైళ్లపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అటు ప్రయాణికులను, ఇటు వస్తువులను తరలించేందుకు రైళ్లు రవాణా రంగంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. రైల్వేలు ఒకవైపు ఆధునికత దిశగా పరిగెడుతూ, మరోవైపు ప్రయాణికులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నాయి. తాజాగా భారతీయ రైల్వే అత్యంత శక్తివంతమైన ఇంజిన్‌ను రూపొందించింది. ఈ ఇంజిన్ వచ్చే నెలలో ట్రాక్‌లపై పరుగులు తీయనున్నదని సమాచారం. ఈ అత్యంత శక్తివంతమైన ఇంజిన్‌ను గుజరాత్‌లోని దాహెూద్ ఫ్యాక్టరీలో తయారు చేశారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తాజాగా ఈ ఇంజిన్ తయారు చేసిన ఫ్యాక్టరీని సందర్శించారు. ఇక్కడ గూడ్స్ రైలు ఇంజన్లు తయారు చేస్తుంటారు. ప్రస్తుతం మొదటి అత్యంత శక్తివంతమైన ఇంజిన్ సిద్ధం అయ్యింది. ఈ రైల్వే కర్మాగారాన్ని 'మేక్ ఇన్ ఇండియా' ధ్యేయంలో భాగంగా ఏర్పాటు చేశారు. ఈ కర్మాగారానికి 2022లో ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. కేవలం మూడేళ్లలో ఈ కర్మాగారం దేశంలోనే అత్యంత శక్తివంతమైన రైలు ఇంజిన్‌ను నిర్మించి, ట్రాక్‌పైకి తీసుకువచ్చింది. భారతీయ రైల్వే ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌లను 6000 హార్స్‌పవర్ నుండి 9000 హార్స్‌పవర్‌కు అప్‌గ్రేడ్ చేస్తోంది. ఇంజినీరింగ్ కంపెనీ సీమెన్స్ గుజరాత్‌లోని దాహెూద్‌లో రూ.20,000 కోట్ల ఖరీదు చేసే 9,000 హార్స్ పవర్ కలిగిన 1,200 ఎలక్ట్రిక్ ఇంజిన్‌లను తయారు చేయనుంది. 9000 హార్స్‌పవర్ సామర్థ్యం కలిగిన ఈ ఇంజిన్ 4,500 టన్నుల సరుకును మోసుకెళ్లే గూడ్స్ రైలును అధిక వేగంతో నడుపుతుంది. ఒక సాధారణ ట్రక్కు 7 నుండి 10 టన్నుల వస్తువులను మాత్రమే తీసుకువెళుతుంది. ఈ నూతన ఇంజిన్లతో రైళ్ల వేగం గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల మేరకు పెరగనుంది.

## 'ప్రజలు యాచించే అలవాటును పెంచుకున్నారు'.. బీజేపీ మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు



**భోపాల్:** కేంద్ర మాజీ మంత్రి, మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి ప్రహ్లాద్ పటేల్ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. ప్రజలు యాచించే అలవాటు పెంచుకున్నారని అన్నారు. ప్రజా సమస్యల వినతులను 'భిక్షాటన'గా ఆయన అభివర్ణించారు. శనివారం రాజ్‌గఢ్ జిల్లాలో వీరాంగన రాణి అవంతిబాయి లోధి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రహ్లాద్ పటేల్ పాల్గొన్నారు. పంచాయతీ, గ్రామీణాభివృద్ధి మంత్రి అయిన ఆయన ఈ సందర్భంగా సభలో ప్రసంగించారు. 'ప్రభుత్వం నుంచి భిక్షాటన చేసే అలవాటును ప్రజలు పెంచుకున్నారు. నాయకులు వచ్చినప్పుడు పిటిషన్లతో నిండిన బుట్టను అందజేస్తారు. వారికి వేదికపై దండలు వేస్తారు. వారి చేతుల్లో లేఖలు ఉంచుతారు. ఇది మంచి అలవాటు కాదు. అడగడానికి బదులుగా, ఇచ్చే మనస్తత్వాన్ని పెంపొందించుకోండి. ఇది సంతోషకరమైన జీవితానికి దారితీస్తుంది. సంస్కారవంతమైన సమాజాన్ని నిర్మించడంలో సహాయపడుతుందని నేను మీకు హామీ ఇస్తున్నా' అని అన్నారు. కాగా, ప్రజలు ఉచితాలపై అధికంగా ఆధారపడటం సమాజాన్ని బలోపేతం చేయడానికి బదులుగా బలహీనపరుస్తుందని మంత్రి ప్రహ్లాద్ పటేల్ అన్నారు. 'ఈ యాచకుల సైన్యం సమాజాన్ని బలోపేతం చేయడం లేదు. అది బలహీనపరుస్తుంది. ఉచిత వస్తువుల పట్ల ఆకర్షణ ధైర్యవంతులైన మహిళల గౌరవానికి చిహ్నం కాదు. మనం వారి విలువలకు అనుగుణంగా జీవించినప్పుడు అమరవీరుడిని నిజంగా గౌరవిస్తారు' అని వ్యాఖ్యానించారు. మరోవైపు ఎప్పుడైనా భిక్షాటన చేసిన అమరవీరుడి పేరు చెప్పగలరా? అని ప్రహ్లాద్ పటేల్ అడిగారు. అలా అయితే తనకు చెప్పాలని అన్నారు. 'నర్మద పరిక్రమ యాత్రికుడిగా నేను భిక్ష అడుగుతా. కానీ నా కోసం ఎప్పుడూ అడగను. ప్రహ్లాద్ పటేల్‌కు ఏమీ ఇచ్చారని ఎవరూ చెప్పరు' అని అన్నారు. కాగా, బీజేపీ మంత్రి ప్రహ్లాద్ పటేల్ చేసిన ఈ వ్యాఖ్యలపై ఎంపీ కాంగ్రెస్ అధ్యక్షుడు జీతు పట్వారీ స్పందించారు. ఆయన వ్యాఖ్యలు రాష్ట్ర ప్రజలను అవమానించేలా ఉన్నాయని విమర్శించారు. 'బీజేపీ అహంకారం ఎంత స్థాయికి చేరిందంటే వారు ప్రజలను బిచ్చగాళ్ళు అని పిలుస్తున్నారు. ఎన్నికలకు ముందు తప్పుడు వాగ్దానాలు చేసి, వాటిని నెరవేర్చడానికి నిరాకరిస్తారు. ప్రజలు వాటిని గుర్తుచేసినప్పుడు సిగ్గు లేకుండా బిచ్చగాళ్ళు అని పిలుస్తారు. వారు గుర్తించుకోవాలి. త్వరలో ఈ బీజేపీ నాయకులు ఓట్లు అడుక్కోవడం కోసం వస్తారు' అని మండిపడ్డారు.

## రైతులకు శుభవార్త..



రైతులకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైతులకు శాశ్వత విద్యుత్ కనెక్షన్‌ను కేవలం రూ.5 మాత్రమే అందిస్తున్నట్లు ఆ రాష్ట్ర సీఎం మోహన్ యాదవ్ ప్రకటించారు. మధ్యప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఈ పథకాన్ని త్వరలో అమలు చేయనుంది. ఈ సందర్భంగా సీఎం మోహన్ యాదవ్ మాట్లాడుతూ... మధ్యప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం రైతులను ప్రోత్సహించడం. వారి జీవితాలను మెరుగుపరచడం. విద్యుత్ సమస్యలు లేకుండా, సాగునీటి అవసరాలను తీర్చేందుకు సౌర (సోలార్) పంప్‌లను ఏర్పాటు చేయబోతున్నాం. వచ్చే మూడు సంవత్సరాల్లో 30 లక్షల సోలార్ పంప్‌లను రైతులకు అందించేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. రైతుల నుండి సౌర విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేయబోతుంది. తద్వారా రైతులు అదనపు ఆదాయాన్ని పొందే అవకాశముంది. కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో సరైన రోడ్లు, విద్యుత్, మౌలిక సదుపాయాలు లేకుండా ఇబ్బంది పడ్డాం. కానీ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది' అని వ్యాఖ్యానించారు.

# నడ్డా వారసుడి కోసం రంగం సిద్ధం




**న్యూఢిల్లీ :** వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారం సాధించి, దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన భారతీయ జనతా పార్టీకి నెక్ట్స్ బాస్ ఎవరనే ప్రశ్న ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. జేపీ నడ్డా తర్వాత బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎవరు వస్తారని ఆ పార్టీతో పాటు దేశ రాజకీయ వర్గాలన్ని ఎదురుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో మార్చి 15 లోపు బీజేపీ జాతీయ అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. బీజేపీ అధ్యక్షుడి ఎన్నికకు, 50 శాతం రాష్ట్రాలలో సంస్థాగత ఎన్నికలు తప్పనిసరి. దానికి ముందు, బూత్, మండల్, జిల్లా స్థాయిలకు ఎన్నికలు జరుగుతాయి. ప్రస్తుతం 36 రాష్ట్రాలలో 12 రాష్ట్రాలలో మాత్రమే ఎన్నికలు పూర్తయ్యాయి. కాబట్టి కనీసం ఆరు రాష్ట్రాలలో యూనిట్ చీఫ్‌ల ఎన్నికలు అవసరం.వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడు, బెంగాల్, ఉత్తరప్రదేశ్, అస్సాంచ, గుజరాత్ రాష్ట్రాలలో బీజేపీ ఈ ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఈ ఏడాది చివరి నాటికి ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ఎటువంటి మార్పు ఉండదు. అత్యున్నత పదవికి ప్రతిపాదిత పేర్లను సమర్పించాలని రాష్ట్ర ఇన్‌చార్జ్‌లను ఇప్పటికే పార్టీ అధిష్టానం కోరింది. ప్రస్తుతానికైతే ఏ ఒక్కరి పేరు కూడా బీజేపీ జాతీయ అధ్యక్షుడి రేసులో వినిపించడం లేదు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నియమించబడాలంటే.. కచ్చితంగా ఆ వ్యక్తికి ఆర్ఎస్ఎస్ ఆమోదం ఉండాల్సిందే. బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలం గురించి తెలిసి, ఆ సిద్ధాంతాన్ని నమ్మి, పాటించే వ్యక్తికే బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి దక్కనుంది.2019లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జేపీ నడ్డా పార్టీ బాధ్యతలను స్వీకరించారు. జనవరి 2020లో ఆయన జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన కంటే ముందు ప్రస్తుత కేంద్ర హోంమంత్రి అమిత్ షా బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఆయన నుంచి నడ్డా ఆ బాధ్యతలు స్వీకరించారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా నడ్డా పదవీకాలాన్ని జూన్ 2024 వరకు పొడిగించారు. ఆ తర్వాత ఆయన ప్రభుత్వంలోకి ప్రవేశించడంతో, పార్టీ ఆయన తర్వాత ఎన్నికయ్యే అభ్యర్థుల కోసం చూస్తోంది. కానీ ఈ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. పార్టీలోని అగ్రనేతలు ఈ అంశంపై ఏకాభిప్రాయం సాధించాలని ఆశిస్తున్నారు. మరి చూడాలి ఎంతో పవర్ ఫుల్ పొజిషన్‌గా భావిస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఎవరు వస్తారో. బీజేపీ జాతీయ అధ్యక్ష రేసులో పలువురి పేర్లు ఉన్నాయి. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, పార్టీ జనరల్ సెకెటరీ సునీల్ బన్సల్, అగ్రనేతలు ధర్మేంద్ర ప్రధాన్, భూపేందర్ యాదవ్, వినోద్ తావ్డే వంటి ప్రముఖులు ఉన్నారు. అయితే, అధికారిక ప్రకటన వచ్చే వరకు ఎవరనేది నిర్ధారణ కాదు.

# మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌కు మాయావతి షాక్



**లక్నో:** ఉత్తరప్రదేశ్‌కు చెందిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి ఆదివారం సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆమె రాజకీయ వారుసుడిగా భావిస్తున్న మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌ను మరోసారి అన్ని పార్టీ పదవుల నుంచి తొలగించారు. ఆకాష్ తండ్రి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ కుమార్, రాజ్యసభ ఎంపీ రాంజీ గౌతమ్‌ను కొత్త జాతీయ సమన్వయకర్తలుగా నియమించారు. ఆదివారం లక్నోలో జరిగిన బీఎస్పీ సమావేశంలో ఈ మేరకు పార్టీలో భారీ మార్పులు చేశారు. కాగా, బీఎస్పీ సంస్థాగత బలాన్ని బలహీనపరిచే వర్గాలను సృష్టించడం ద్వారా పార్టీలో విభజనకు అశోక్ సిద్ధార్థ్ కారణమయ్యారని మాయావతి ఆరోపించారు. పార్టీకి లేదా ఉద్యమానికి హాని కలిగించడానికి తన పేరును దుర్వినియోగం చేస్తే వారిని వెంటనే తొలగిస్తానని ఆమె స్పష్టం చేశారు. మరోవైపు ఈ సూత్రానికి అనుగుణంగా అశోక్ సిద్ధార్థ్‌ను పార్టీ నుంచి బహిష్కరించినట్లు మాయావతి తెలిపారు. ఆయన ప్రభావం ఉన్న అల్లుడు ఆకాష్ ఆనంద్‌ను కూడా పార్టీ బాధ్యతలన్నింటి నుంచి తొలగించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని బహుజనుల పురోగతికి మాత్రమే కాకుండా దేశ పురోగతికి ఈ మార్పు అవసరమని అన్నారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతి వేడుకల ప్రణాళికలను కూడా మాయావతి వెల్లడించారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.